
దేవిదేవతలు
శ్రీకృష్ణ
శ్రీకృష్ణుడు



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020010001859

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

చారిత్రకసమితి ప్రచురము - ౧.

శ్రీకృష్ణుఁడు

(పరిశోధక చరిత్ర)

కర్త:

జయంతి వేంకట జగన్నాథరావు.

FOR COPIES APPLY TO:—

D. V. KRISHNA RAO,
Gadevari St.
BERHAMPUR (Ganjam)

విషయానుక్రమణిక

——:)o(:——

భూమిక

1. హిందూదేశమందు కోట్లకొలదిజనులు భగవంతుండని భావించుచున్న శ్రీకృష్ణుని జీవితమే మిథ్య యని కొందఱు బుద్ధిమంతులు వాదింప మొదలుపెట్టినారు. వాల్మీకి విరచితమగు రామాయణమును,వ్యాసవిరచితమగుభారతమును ఎందాక నిలచియుండు నందాక శ్రీరామకృష్ణుల నామములును స్మరింపఁబడు మనే యుండును. సర్వజనస్తవనీయుఁడైనవాఁడు తప్పక మహాత్ముఁడే యగును. ఆధునిక ప్రమాణములతో శ్రీకృష్ణుని జీవితచరిత్ర మీచిన్న పుస్తకమున విమర్శింపఁ బ్రయత్నించితిమి. నేఁడు మనము మహాపురుషులని, మహాత్ములని దేవదూతలని, ధర్మఘోషులని, మహావీరులని, యెంచిపూజించుచున్న మృతజీవులగు వారిలో నేరికిని శ్రీకృష్ణుఁడు తీసిపోఁడు.

2. వేదమతము, ఏకేశ్వరోపాసనము, ఉపనిషన్మతము, మధ్యదేశమునం దభివృద్ధి చెందెను. హాస్తినాపురప్రాంతమే మధ్యదేశము. భాగవతమత మనునది పూర్వ దక్షిణ పశ్చిమ భాగములందు క్షత్రియనాయకులచే నెలకొల్పఁబడి బ్రాహ్మణుల యామోదమునడయనారంభించెను. భాగవతధర్మము, జనకుఁడు జయవలి, అజాతశత్రుఁడు, అశ్వపతి, మొదలగు రాజన్యులచే ప్రథమమున పరిబోధింపఁబడి వాసుదేవునిచే నయ్యది సర్వజనాదరణము వడయునట్లు సంస్కరింపఁబడినదని చెప్పనగును.

3. భాగవతమతోద్ధారకుఁడు కృష్ణవాసుదేవుండను క్షత్రియుండు. ఈతనితండ్రి వసుదేవుండు. తల్లి దేవకి. ఆంగిరసుఁడగు ఘోరుఁడను మహామునివలన కృష్ణుఁడు జ్ఞానోపదేశ మొందినట్లు ఛాందోగ్యోపనిషత్తు చెప్పుచున్న' ఈ వాసుదేవుఁడు విదేశజాతియైన యాదవులందరి 'తృాత

శాఖకుఁ జెందిన వాఁడనికూడ చెప్పఁబడియున్నది. పరమాత్మ అనంతమనియును, శాశ్వతమనియుని, దయాపూరితమనియును, ముక్తియన శాశ్వతమైన ఆనంద మనుభవించుటయే యనియును బోధించిన మహాత్ముఁడే వాసుదేవుఁడు. *మహాభారతకథ యథార్థముకాకపోవచ్చునేమో కాని శ్రీకృష్ణుఁడను మహాపురుషుఁ డుండుట మాత్రము కల్లకాదు. శ్రీకృష్ణుఁ డుండియుండుటయే సత్యమైనచో మహాభారతగాథయు కల్పనముకానేరదు. అట్లగుట నీ రెండింటి అన్యోన్యసంబంధమును విడదీయరానిదైయున్నది.

4. గౌతమబుద్ధుని మతము సర్వజనాదరణము వడయుట యు,బుద్ధదేవునిపూర్వజన్మగాథలు జనసామాన్యము నాకర్షించు చుండుటయుఁగాంచి, బ్రాహ్మణులు వేదమతమునకు భంగ పాటొదవుననియెంచి, జాతక కథల ననుసరించి, అవతారముల సృష్టించిరను సిద్ధాంత మొకటికలదు. "బౌద్ధమతమునకు గౌతముఁడెట్లు మూలస్కంధమయ్యెనో, అట్లే బ్రాహ్మణమతమునకు క్షత్రియవంశసంజాతుండగు శ్రీకృష్ణు నాధారముచేసికొని భాగవతమతమును బ్రాహ్మణులు సృష్టించిరి." అనుప్రతీతియుకలదు: అదియును కావచ్చును.

5. "మహాభారత కృష్ణుఁడు ఇతిహాసపురుషుఁడుకాడు:

---

* అట్లా కృష్ణుఁడు ఆంగిరసఘోరునికడ నొందిన జ్ఞానోపదేశము నకును, గీతలలోఁ గృష్ణుఁడుపదేశించిన జ్ఞానమునకును సంబంధము కానరానందున గీతోపదేశమొనర్చిన కృష్ణుఁ డాతఁడు కాఁడేమో తిలక మహాశయుఁడు తనగీతారహస్యమున వ్రాసియున్నాఁడు. భారత కృష్ణుఁడు వేఱు; భాగవత కృష్ణుఁడు వేఱు; అని రామకృష్ణభాండార్కరుగారు వ్రాసియున్నారు.

ఋగ్వేదములోని ఆంగీరసకృష్ణుఁడు, అసురకృష్ణుఁడు, ఛాందోగ్యములోని దేవకీనందన కృష్ణుఁడును, కలసి భారత కృష్ణుం డయ్యెను. ఇట్లీసృష్టింపఁబడిన జీవచరిత్రయందు కాలక్రమమున ననేకగాథలు కల్పింపఁబడినవి.'' అని శ్రీపండిత సీతానాథ తత్వ భూషణుఁడుగారు శ్రీకృష్ణునిగూర్చి వ్రాసియున్నారు. ఇదియును కావచ్చును.

6. అంశుమతీ నదీతీరమున పదివేలభటులవెంటఁబెట్టుకొని ఆర్యనాయకుండగు నింద్రు నెదిరించిన కృష్ణుఁడు ఋగ్వేదమున చెప్పబడియున్నాఁడు. అశ్వినీకుమారుల నారాధించుచుండిన కృష్ణుఁడు, వానికుమారుఁడు విశ్వకాయుఁడు, వేదములయందు పేర్కొనఁబడియున్నారు. కృష్ణుఁడను ఋషి కొన్నిసూక్తముల నశ్వినీకుమారుల నుద్దేశించి చెప్పినటుల వేదములం దున్నది. ఈ బ్రాహ్మణ కృష్ణుని, ఆ క్షత్రియ కృష్ణుని ఏక మొనర్చి మహాభారత కృష్ణునిగ మనవారు నిర్మించిరను వాదమును కలదు. ఏవాద మెట్లున్నను, నిరవధికమగు కాలమునననుసరించి కథలుకూడ మార్పుచెందుచునే యున్నవనుట నిర్వివాదము. అంతమాత్రమున మూలపురుషుల చరిత్రలు మిథ్యయనుటకు వీలులేదు. మహాపురుషులజీవితములు మన నడవడికి దారిచూపు దీపముల వంటివి. అట్టి మహాపురుషుల నిజచరిత్రల మన మెఱుంగఁ బ్రయత్నించినచో, హిందూసంఘము నేఁడు ప్రపంచ మందగ్రస్థాన మాక్రమించి యుండవలసియున్నది. అట్లయ్యును అట్టి మహాత్ముల చర్యల సరియైన మానవదృష్టితో వీక్షింపక, ఆ మహాత్ము లవతారపురుషులనియు, భగవదంశ సంభూతులనియు నుత్ప్రేక్షించి వ్రాయుటచే ఆ పురుష సింహముల కీర్తికి కళంకము నాపాదించు దోషమును, ఆమహాత్ముల

నాదర్శప్రాయులుగ నెంచఁగూడని నష్టమును మనము పొందుచున్నాము. మనుజుడు తన శక్తియుక్తుల నెంతవర కుపయోగింపవలనుపడునో, మహాపురుషుల జీవితములు మనకు బోధించును. అట్టివారు భగవంతులేయని యనినచో, నెట్టి మానవున కైనను, ఆ మహాపురుషుల మార్గముల ననుసరించుటకు బుద్ధి పోడమునా? ధైర్యము కుదురునా? లోకమునకు మార్గదర్శకులుగ నుండఁ బ్రయత్నించిన మహాత్ముల నవతార పురుషులనుటచే, నా మహాపురుషుల ఆశయములకు విఘాతము కలిగించిన మహాపాతకముగూడ మనల నంటఁగల దేమో!

7. శ్రీకృష్ణునివంటి యుగకర్తను బట్టుఁవలె భగవంతుండని, పొగడినంత మాత్రాన మనపాపము లన్నియు పోయి మనకు స్వర్గము చేకూరదు. మనుజుని శక్తిసామర్థ్యములు గుర్తెఱుంగ నిచ్చగింపని సోమరు లొనర్పవలసినపని యిది. సంఘాభివృద్ధియు, దేశాభివృద్ధియు గోరువా రట్లాచరింపరు. వీరాధివీరుల, రాజనీతిపరులలో నగ్రేసరుల, మనపూర్వులు దేవళ్లనొనర్చి, వారినాదర్శములుగ మన మొనర్పఁజాలకుండ మనల నిర్వీర్యులఁ జేసిరి. వీరపూజకిది మార్గముకాదు. వీరపూజలేని దేశము లభివృద్ధి చెందనేరవు; తమస్వాతంత్ర్యమును ఆత్మగౌరవమును, గాపాడుకొనఁజాలవు. కావున బ్రపంచమున నట్టి సంఘము నామమాత్రావశిష్టమగును.

8. ఈ చిన్న పుస్తకమున శ్రీకృష్ణుని జీవితము, చర్యలు, మాటలు, నాతని నెంతదూరము మన మాదర్శపురుషునిగ గైకొనందగునో అది చర్చింపఁబూనుట, యువకులకు బ్రయోజనకారిగ నుండవచ్చునని యాశింతుము.

పూర్వగాథ

1. మానవసృష్టి క్రీస్తుకు పూర్వము 4004వ సంవత్సరమున ప్రారంభమైనది. అనగా నేటికి రమారమి ఆరువేల సంవత్సరములైనది. ఈశ్వరున కాసృష్టి రుచింపకుండుటచే నాతఁడించుమించు నూరుసంవత్సరము లాలోచించి క్రీ॥పూ॥ 2349 (B. C. లో) మహాప్రళయము కల్పించెను. అం దనవసరములైన ప్రదేశము లెన్నియో మునిగిపోయినవి. ఆనాడు పూర్వసృష్టియెంతయో నాశన మొందెను. ద్రవిడ దేశాధీశుఁడైన సత్యవ్రతుఁడు మాత్ర మీశ్వరానుగ్రహమున హేమకూటమున (Pamir Plateau) కేగి ప్రాణముల దక్కించుకొనగలిగెను. ప్రళయానంతరము నామమాత్రావశిష్టమైన భూభాగమునుండి దక్షిణ హిందూదేశము నిలచియుండెను. అందుండినప్రజలు వరుణదేవునారాధింప మొదలిడిరి. వీరినే ఆర్యులు వేదములయందు పణులని పిలువఁ దొడంగిరి.

2. సత్యవ్రతునితో హేమకూటమునకు వలసపోయిన ద్రవిడులు కాలక్రమమున నభివృద్ధిఁజెంది 'ఆర్య' లను గౌరవనామమున వ్యవహరింపఁబడఁజొచ్చిరి. వీరు మొదట సరస్వతి దృషద్వతీనదులకు మధ్యనుండు దేశమం దుండిరి. అద్దానికి 'బ్రహ్మావర్త' మనిపేరు. ఇయ్యది దేవనిర్మితదేశ మనికూడ

చెప్పుచుండిరి. కాలక్రమమున సత్యవ్రతుని సంతతివారు హేమ కూటమునుండి దిగివచ్చి గంగాసింధునదులకు మధ్యనున్న ఉన్నతస్థలమందు నివాసము లేర్పరచుకొనిరి. ఆర్యులు తమ బుద్ధిబలముచే నీదేశమంతయునాక్రమించి అభివృద్ధికి దెచ్చుటచే నయ్యది 'బ్రహ్మఋషి దేశ' మనిపేరొందఁ జొచ్చెను. ఆర్యులు మొదట ముఖ్యముగా నింద్రదేవు నారాధించుచుండిరి. కురు క్షేత్రము మత్స్యపాంచాల శూరసేనదేశము లీ బ్రహ్మఋషి దేశమందుండెను. ఇటఁ బుట్టినవారే ప్రపంచమున నాచార్య పీఠమలంకరించుటకు అర్హత కలిగియుండిరి.

౩. కాలక్రమమున నార్యులసంఖ్య యత్యధికమైన కొలది వారు క్రొత్తదేశము లాక్రమింపవలసిన యవసరము కలిగెను. సరస్వతీ నదినుండి ప్రయాగవఱకును నున్న దేశము 'మధ్యదేశము'గ నెన్నుకొని, ఆర్యు లన్నియెడలఁ బ్రాకఁ దొడఁగిరి. కొంతకాలమైనపిదప మధ్యధరాసముద్రమునుండి మహోదధి* వఱకును వ్యాపించియున్న దేశమంతయునార్యావర్తమయ్యెను. కృష్ణసారము [లేడి] తిరుగు దేశమంతయు నార్యావర్తమని మనవారు సూత్రప్రాయముగఁ జెప్పఁదొడఁగిరి. ఇతర దేశములు మ్లేచ్ఛ దేశములట! ఇట నార్యులయందువలె చతుర్వర్ణ విభజనము లేకుండెను.

---

* Bay of Bengal.

4. జాతిభేదము లెట్లువచ్చెనో చూతము. మానవజాతి లోనున్న తెగలన్నిట నార్యులెక్కుడు మేధాశక్తి పొందియుండిరి. వారినివాసమున కేర్పఱచుకొనిన గంగాసింధుమైదానమధికఫలవంతమైన ప్రదేశమగుట నార్యుల కెక్కుడు తీరిక యుండెను. అట్లా తీరికగల కాలమును వారు వ్యర్థపుచ్చక, తమభాష, భావములు, మతము, నభివృద్ధి పఱచుకొనుటకే వినియోగింప మొదలిడిరి. మానవజాతి ప్రారంభదశయందు వ్రాత కనిపెట్టఁబడకుండుట నప్పటి కార్యు లార్జించిన విద్యల మేధావంతులైన బాలురచే బఠియింపించి, యేతన్మార్గమున నిలువఁజేయుచుండిరి. అట్లగుట నార్యులార్జించిన జ్ఞానము నూర్జిత మొనర్చుటకు గొందఱిని బ్రత్యేకింప వలసివచ్చెను. ఈ బ్రహ్మజ్ఞాన నిధులే కాలక్రమమున బ్రాహ్మణులు అను ప్రత్యేక జాతిగ నేర్పడి ఆర్యసంఘమం దగ్రస్థానము నాక్రమింప మొదలిడిరి. మిగిలినవారు, బ్రహ్మజిజ్ఞాసాపరులగు వారి నెమ్మదికి భంగము రాకుండఁ గాపాడుచు, తమబుద్ధిబలముకన్న బాహుబలము నభివృద్ధి పఱచుకొనుచు క్షత్రియులైయుండిరి. ఇట్లీ రెండు తెగలే తొలి నేర్పడియుండెను.

5. బ్రహ్మఋషి దేశమునుండి ఆర్యులు గంగానదీతీర భూములకే తెంచినంతనే వారు ఐహికసంపత్తులార్జించుటయం

దగ్గిగణ్యులైన యింకొకజాతితో తారసిల్లిరి. ఈ నూతన జాతికి సేద్యము, పశుపాలనము, వర్తకము ముఖ్యవృత్తులుగ నుండెను. ఈ దాక్షిణాత్య జాతులను ఆర్యులు పణులనియును, వైశ్యులనియును పేరిడి తమలో మూఁడవశాఖగ చేర్చుకొనిరి. పణులు బ్రహ్మక్షత్రియశాఖల అధికారమును మతమును అంగీకరించుటచే తమవృత్తుల తామునిర్విఘ్నముగ కొనసాగించు కొనగలిగిరి. ఈ నూతన ఆర్య వైదిక సమ్మేళనమువలన ఆర్యసంఘమునకు ప్రపంచచరిత్రయందు ఎక్కుఁడు ఔన్నత్యము ప్రాప్తించుటకు కారణమయ్యెను.

ఆర్యులు మధ్యదేశమువీడి ప్రక్కనున్న భూములకు వ్యాపించునంత నచ్చో అనాగరక సనాతనజాతులనుచూడవలసి వచ్చెను. ఈ జాతులవారు మానవసంఘమందు అతినికృష్ట దశయందుండుటచే వారిని ఆర్యులు తమలో చేర్చుకొనుటకు సమ్మతింపక వేరుగనుంచిరి. అగ్రవర్ణముల సేవించుచు కొంత కాలముండిన వీరికి ముక్తి ప్రాప్తించునని తలంచి 'దస్యు' లను నామమిడి ప్రత్యేకజాతిగ నేర్పఱచిరి. వీరేశూద్రులు. ఈ శూద్రులు అన్నిచోట్లను స్థానిక వాసులని చెప్పనగును. ఆర్యుల యాజమాన్య మంగీకరింపక వేఱుగ నిలిచియున్న వారిని 'మ్లేచ్ఛ' లని పిలువదొడగిరి. మ్లేచ్ఛులే శూద్రులై కాల

క్రమమున సత్త్వవర్తనవలన అగ్రవర్ణములకుఁగూడ నేఁగ బ్రాకుట కానాడు వీలుండెను.

7. ఇంక ఆర్యులు తమయధికారము నెట్లు వ్యాపింపఁజేయుచుండిరో చూతము. ఋషులని పిలువఁబడిన బ్రాహ్మణులు ఆర్యనివాసములకు దగ్గర నుండిన అడవులలో ఆశ్రమములేర్పఱచుకొని నివసించుచుండిరి. వీరిబోధన లొకప్పుడు అచ్చోనుండిన అనార్యజాతుల కాగ్రహము జనింపఁజేసినచో ఋషుల కాపదలు ప్రాప్తించుచుండెను. ఆ పత్సముద్రమునందు మునిఁగియున్న ఋషిపుంగవుల నుద్ధరించుటకు క్షత్రియోత్తములేతెంచి ఆటవికుల హింసించి వారి నార్యులకు దాసులుగ జేయుచుండిరి. మతముపేరిట మునులు కయ్యములు ప్రారంభించుటయు, ఖడ్గపాణులై వారిని సంరక్షించుటకు క్షత్రియులేతెంచి అమాయికుల హింసించి వారి స్వతంత్రత కోల్పుచ్చుటయు, నాఁటి ధర్మమైయుండెను. క్షత్రియ వీరులొనర్చిన మహోపకారమునకు కృతజ్ఞతా సూచకముగ ఋషులు తామొనర్చెడి యాగాదులయందు హవిర్భాగము లార్యనాయకులకర్పించుచుండిరి. వివిధ ఆర్యజాతులకు వివిధనాయకు లుండిరి. ఆర్యజాతి శాఖలన్నియు నేకమైన తరువాత ఎనమండ్రు నాయకులు మాత్రము మిగిలిరి. వీరలే దిక్పాలురను పేరున

హావిర్భాగములనందుకొన నాహ్వానింపఁబడుచుండిరి. వీరియందు పూర్వదిశకు సంరక్షకుఁడుగనుండిన ఇంద్రుఁడు ఈనాయకులకు నాయకుఁడయ్యెను.

8. ప్రాగ్దేశాధీశుఁడైన దేవేంద్రుఁడేల దేవతలరాజు కావలసి వచ్చెను? బ్రహ్మఋషి దేశము ఆర్యావర్త పుణ్యభూమిగ నభివృద్ధిజెందునమయమున ఆర్యులు తమకుఁ దూర్పుననున్న విదేశజాతులతో నెక్కుడుగఁబోరాడవలసివచ్చెను. మలయ ద్వీపము, బర్మాదేశము ప్రక్కనుండి నాగులను నొక నూతన జాతి ఆర్యావర్తమందుఁ బ్రవేశింప మొదలిడెను. వృత్రుఁడను వాఁడు వీరినాయకుఁడు. నాగులు నదీమార్గములఁబట్టి దేశములో ప్రవేశించి కొండలోయలలో కోటలుకట్టి నిలువఁదొడగిరి. ఈ వృత్రునకు 'అహి' యని కూడ పేరుండెను. ఇంద్రుఁడు తఱచు వృత్రునితోడను వాని యనుచరులతోడను అహవములొనర్చుచుండెను. తుదకు విసుగొంది ఆర్యులు నాగులను తమలోఁ గలుపుకొనినట్లు కాన్పించును. ఈ త్రిజాతుల సమ్మేళనము-ఆర్య, ద్రవిడ, నాగజాతులసమ్మేళనము-కాశీక్షేత్రమందు జరిగెను. తత్సూచకముగ మూఁడుతోజులపండుగ నేఁటికినిహిందువులందరును పాటించుచున్నారు. అందలి (1) మొదటిదినము నాగుల దినమగుటచేనయ్యది 'భోగి'యనబడుచున్నది.(2) రెండవదినమున

---

(1) భోగి (2) సంక్రమణము (3) కనుమ

ఆర్యులకు ప్రియమైన పితృపూజచేయుచున్నారు. (3)మహాదేవ దినమున పణులకు సంబంధించిన పశువుల పండుగ కావించుదురు. ఇంక ఈ కాశీక్షేత్రమందు నాగభూషణుఁడు రాజు; మంత్రి *మహా విష్ణువు; క్షేత్రపాలకుఁడు అనార్యనాయకుఁడైన భైరవుఁడు. ‡

9. సర్వజాతి సమ్మేళనమగుటకు పూర్వము ఆర్యసంఘమందు రాజు లేకుండెను. అయ్యది నాయకప్రభుత్వముగ నుండెను. పణుల నాయకుఁడైన వరుణదేవునకు మాత్రము రాజను బిరుదముండెను. ద్రవిడులు ఆర్యసంఘమందు ప్రవేశించిననాటి నుండి ఆర్యులయందు, రాజు-రాజ్యము అను నిబంధనలు వచ్చెను. చాలకాలమువఱకు ఆర్యనాయకులు ద్రవిడనాయకుల అధికారమంగీకరింపనట్లు ఈశ్వరు (రుద్రు) నకును దక్షప్రజాపతికిని జరిగిన వివాదములవలన స్పష్టపడగలదు.

10. కొంతకాలమైన తరువాత ఆర్యులలో పాలిత, పాలక భేదములు వచ్చెను. పాలకులు సురలనియును, పాలితులు నరులనియును పిలువఁబడజొచ్చిరి. చాలకాలమువఱకును నరులను దిక్పతులుగ నుండకూడదని సురలాటంకపఱచుచుండిరి. నహుషుని కథయు త్రిశంకుని కథయు నిందులకు ప్రబల నిదర్శన

(1) భోగి (2) సంక్రమణము (3) కనుమ

* ఆర్యక్షాత్రరక్షకుఁడు ‡ శునకరూపుఁడు—పశుపాలకుఁడు.

ములు. ఈసురలే దేవతలని మనవారు నేఁడుభావించుచున్నారు. పాలకులలో కొంత కాలమైన తరువాత భిన్నాభిప్రాయము లుద్భవించి వారు సురలనియును అసురులనియును రెండు శాఖలుగ చీలిపోయిరి. తొలుదొల్తఆర్యులు నరమాంసమును భక్షించుచుండిరి. యుద్ధమందు మృతినొందినవారియు, న్యాయాధికారులచే మరణదండనపొందిన నేరస్తులయుఁ గళేబరముల నందఱు నేకమై భుజించుచుండిరి. తినుబడి వస్తువులు అల్పముగ నుండినప్పుడు ఇట్టి దురాచారమునకెట్టి ఆటంకమును లేకుండెను. పణులు ఆర్యసంఘమందు ప్రవేశించి ఖాద్యపదార్థముల నధిక మొనర్చిన తరువాత నరమాంసభక్షణముఅనావశ్యకమయ్యెను. వ్యవసాయమును వాణిజ్యమును అభివృద్ధిజెందిన తరువాత నరబలి నికృష్టమని తోచెను. అందుచే యజ్ఞపశువుల నగ్నిలో దహన మొనర్ప మొదలిడిరి.

11. కొన్నికొన్ని తావులయందు పూర్వాచార పరాయణులు నరమాంసభక్షణము కొనసాగించుచుండుటచే ఆర్యసంఘమువారిని ఆర్యావర్తమునుండి అవ్వల కంపవలసివచ్చెను. వీరలే 'అసురు' లని పిలువఁబడదొడగిరి. ఈ అసురులు ఆర్యావర్త పరిసరములయందున్న ఆరణ్యభూముల కేతెంచి అనార్యజాతులతోఁగూడిసమయముచిక్కినపుడెల్ల ఆర్యుల నివాసముల పైఁబడి నాశన మొనర్చుచుండిరి. కాలక్రమమున భరతవర్ష

మందలి పూర్వదక్షిణభాగములు తత్ప్రాంతద్వీపములుఅసురుల కాటపట్టులయ్యెను. పిమ్మట ఆర్యు లనేకపర్యాయములు అసురులను భారతవర్షమునుండి అంపివేయుటకు ప్రయత్నించిరి. ఈసురాసురయుద్ధములు ǂమందర గిరిప్రాంత భూములందుజరుగుచుండెను. పణులనాయకుఁడైన వరుణదేవుని దండయాత్రవలన అసురులు దక్షిణహిందూదేశము వీడి యూఫ్రటీస్, *టైగ్రీస్ నదీతీరములకు వలసపోవలసివచ్చెను. అచ్చట వారు నెలకొల్పిన అసురరాజ్యమే పాశ్చాత్య పండితులచే అస్సీరియా (Assyria) సామ్రాజ్యమని తఱుచు వర్ణింపబడుచుండెను.

12. వరుణదేవునకు నీటిదారులు, నాటుదారులే కాక, ఆకాశమార్గములుకూడ కరతలామలకముగ తెలిసినట్లు ఋగ్వేదము చెప్పుచున్నది. పణులకు ఋతువులు, ఋతువర్షములు (Monsoons) కూడ బాగుగ తెలియును. క్షత్రియవీరులు ఆర్యుల అధికారమును నాటుదారులబట్టి అన్నియెడల వ్యాప్తమొందింప యత్నించుచుండ, పణులు నీటిమార్గముల దూరదేశములకేగి అచ్చో ఆర్యసంప్రదాయములను, నాగరికతను నెలకొల్పుచుండిరి. పాశ్చాత్యదేశములకు క్షత్రియులే తేరక పూర్వమే పణులుపడవలపైనేగి సముద్రాంతరభూములయందు వలస

ǂ మహేంద్రగిరి. * శరావతి.

రాజ్యముల స్థాపించి ఆయా దేశములతో వర్తకముచేయ మొదలిడిరి. చరిత్రల జాగ్రత్తగా పరిశోధించినచో ఆర్యావర్తమందుండిన అన్నిశాఖల వణిజులును * పాశ్చాత్యదేశములయందు కూడ మనకు ప్రత్యక్షమగుదురు.

13. కొంతకాలమైన తరువాత ఆర్యసంఘమందు బ్రాహ్మణ క్షత్రియ వివాదములు ప్రబలుటచే ద్వీపాంతరభూములకేగిన అసురులు విజృంభించి మరల భరతవర్షమున కాలిడ మొదలిడిరి. లంకయందు రాజ్యము చేయుచుండిన రావణుఁడు తన యనుచరులనంపి వింధ్యపర్వతములవఱకు తనయాజమాన్యము వ్యాపింపజేసెను-అగస్త్య, విశ్వామిత్ర, గౌతమ కణ్వమహామునులకు అసురులు బాధకలిగించుచుండుటచే అయోధ్యాధీశుఁడైన శ్రీరాముఁడు దక్షిణాపథమున కేగవలసివచ్చెను.

---

* West	East
The Phoenicians (Panis)	Vaniks or Vysyas.
The Cretans	Kiratas.
The Copts	Guptas.
The Carthegeinions	Sarthavahas
The Bedounis	Videhas
The Venniti	Vens
The Cannons	Karans.
etc.,	etc.,

శ్రీరాముని నాఁటికి దిక్పతులగు సురలు పసదూలియుండుటచే వారు నరనాయకుఁడగు శ్రీరాముని వెనుకనుండి అసుర సంహారణమున కాతని ప్రోత్సహింపవలసివచ్చెను. తరువాత వారు ఆర్యసంఘమందు దూరి అనేకరాజ్యముల నేలుచుండిన రాజులను తమ పక్షమునకుఁద్రిప్పుకొన మొదలిడిరి. ఈయసుర సంప్రదాయానువర్తులగు రాజులనే శ్రీకృష్ణుఁడు హింసింపవలసి వచ్చెను-ఈ మహత్తరకార్య మాచరించుటకుగాను కృష్ణుఁడు ఇంద్ర, వరుణ పదవులందుండిన దేవతలచే ప్రార్థింపఁబడినట్లు పురాణములుకూడ చెప్పను—శ్రీకృష్ణుఁ డవతరించిన తరువాత ఆర్యావర్తమున అసురులు సంపూర్ణముగ అదృశ్యమైరని చెప్పనగును.

14. కాలక్రమమున సురలనువారుకూడ ఆర్యావర్తనాట్యరంగముననదృశ్యులైరి. త్రిశంకుఁడనునరనాయకునిమనుష్యశరీరముతో ఇంద్రలోకమునఁ గాలిడ వీలులేదని వాదించి, ముమ్మారాతనిఁదన్నితగిలివేయఁగా విశ్వామిత్రుఁడనుఋషిజోక్యముకలిగించుకొని త్రిశంకునికొఱకు వేఱుస్వర్గమునొకదానినినిర్మించి సురనరవివాదముల నానాఁ డంతతోనంత మొందించెను. ఆత్రిశంకునిపట్టియగు హరిశ్చంద్రుఁడు ఇంద్రాదిదేవతలకన్న నెక్కుఁడు వన్నెకెక్కిన సత్ప్రవర్తనకలిగి మనెను. హరిశ్చంద్రుఁ డార్జిం

చిన సత్కీర్తి తన్ను పదభ్రష్టునిఁ జేయునేమో యనుభీతిచే ఇంద్రుఁడాతని కర్ధాసనమిచ్చి సత్కరించెను. నహుషుని నాఁటికి దేవతల పొగరింకను సన్నగిలినది. దేవాసురయుద్ధముల యందు తఱచుగ దేవతలు దశరథుఁడు ముచికుందుఁడువంటి నర నాయకులసహాయము వేడుకొనుచుండిరి. నహుషుఁడు మానవ దేహముతోడనే, (అనగా చచ్చిమరలపుట్టకుండఁగనే) దేవేంద్ర పదవిని పొందఁగలిగెను. శ్రీరామునినాఁటికి దేవతలు సంపూర్ణ ముగ మూలఁబట్టిరి. నేఁటి ఆబ్దికపు బ్రాహ్మణులట్లు ఋషులు క్రతువు లొనర్చునప్పుడుమాత్రము వారి ఆవశ్యకత కాన్పించు చుండెను. తాముచేయలేని కార్యము శ్రీరాముఁ డొనర్పగలిగి నందుకు, దేవతలు తమ కగౌరవము కలుగకుండ దశరథ తనయుఁడగు శ్రీరాముని మహావిష్ణుని అవతార మని ప్రశంసింప మొదలిడిరి. ద్వాపరమునాటికి ఆర్యావర్తమున దిక్పతు లేలు చుండిన స్థలములే కాన్పింపకుండెను. ఇంద్రాది దేవతలు నామ మాత్రావశిష్టులై యుండుటచేతనే శ్రీకృష్ణుఁడు తండ్రిని ఇంద్ర యాగము చేయవలదని చెప్పెను. అనవసరముగ వారికడ నుండిన పదార్థములను బ్రాహ్మణులకును పశువులకునుఉపయో గించిన నెక్కుడు ప్రస్తుతలాభ ముండునని కృష్ణుఁడు తండ్రికి బోధించెను. ఇంద్రుఁడలిగి ఆభీరుల శిక్షింపనరుదెంచెను గాని

గోవర్ధనగిరిగుహాలయందు డాగియుండినవారిచెంతకు రావెఱచి వెనుక కేగెను. జగత్కంటకముగ ప్రాగ్జ్యోతిష మేలుచుండిన నరకుని బాధపడలేక దేవేంద్రుఁడు శ్రీకృష్ణునికడ కేతెంచి పలికిన పలుకులఁ బరిశీలింతము.

"కం॥ నరకుండిటు ప్రత్యక్షపు
నరకంబునఁద్రోచె, నీవు నరసంతతికిన్
నరకచ్ఛేదనకరుడఁవు,
నరసఖ, కరుణింపఁదగు ననాథులమమ్మున్॥

చ॥ * * *
* * సం
గరమున మేము వానిభుజగర్వము సైఁపగలేక యిఁదులన్
సిరులుఁ దొఱంగి వచ్చితిమి చెన్నటి మానవజాతి లోనికిన్॥

యాదవుల పూర్వవృత్తాంతము.

1. నహుషుఁడు నరులలో జన్మించినను తన నిరుపమాన సత్ప్రవర్తనమువలన మహాఋషులను మెప్పించి దేవేంద్రపదవి పొందెను. అతని మనుమఁడైన యదుతనతండ్రియగు యయాతి యాజ్ఞాపితంబు నీడేర్పకుండుటచే రాజ్యభ్రష్టుఁడయ్యెను. యదు వంశీయులగు వృష్ణి భోజ మల్ల కుకుర అంధకులు కలకాలము ఆర్యావర్త పరిసరభూములందిమ్మరి శంతనుచక్రవర్తి యనంతర మార్యావర్తమున విజృంభించి చిన్నచిన్న రాజ్యములనేర్పఱచు కొనిరి. వారిలో మాధవుఁడను భోజకుఁడు యమునానదీతీరమం దున్న మథురానగరమాక్రమించి ఆప్రాంతములకురాజయ్యెను. ఈతనిసోదరులగు ముచికుందాదులు వింధ్య, సహ్యాద్రి, మాల్య వంతము మొదలగు దక్షిణాపథ దుర్గమపర్వతరాజంబులందు దుర్గంబుల నిర్మించి అట దుర్జయులైరి. నర అసుర యదు పురు వంశీయులు ఉభయులును జాతుల సంకరమువలన కలిగినట్లు యయాతి మహారాజుచరిత్రమే చెప్పుచున్నది. వానిభార్యలలో దేవయాని దైత్యగురువగు శుక్రునికుమార్తెయనియును, శర్మిష్ఠ వృషపర్వుండను అసురరాజుకూతురనియు చెప్పబడియున్నది. యాదవులు యదువంశీయులు; యవనులు తుర్వసు సంతతి

వారు; భోజకులు ద్రుహ్యునకు పుట్టిరి. అనువువలన మ్లేచ్ఛులు కలిగిరి. తండ్రికి తన పుంసత్వము యిచ్చిన పురు వంశీయులే పౌరవ్యులు. ధృతరాష్ట్రుడు, పాండురాజు అనువారు పౌరవ్యులలోనివారు. ఋగ్వేదమునందు యదు, తుర్వసు లిద్దరును దశ్యులైనట్లును, అనేకగోవుల నిచ్చి సమారాధనల నెరపి మనువును మంచిమాటలాడుటచే వారినాతం డార్యసంఘములో చేర్చుకొనినట్లును, చెప్పబడియున్నది. కావున వీరల సంతతివారగు యదు, వృష్ణి, భోజ, అంధక, కుకుర, మంద, కరూశ జాతులవారందరు ఆర్యావర్తపుణ్యభూమికావలనుండిన ద్రవిడజాతులవా రనియును, వీరు కొంతకాలము అసురవీరుల పాలన మందుండి తరువాత ఆర్యసంఘమందు ప్రవేశించి శ్రీకృష్ణునినాడు ఆర్యులలో ఐక్యమైనట్లును స్పష్టపడగలదు.

భారతమునుబట్టి యయాతి వంశీయులైన యాదవ జాతులకు రాజ్యపాలనాధికారము లేదు. యదు, వృష్ణి, భోజక, కుకుర, మల్ల మొదలగు తెగలవారందరును యదువంశీయులే. వీరందరు తొలుగొత్త ఆర్యావర్తమునకు పశ్చిమమున నుండిన దేశములలో సంచరించుచుండిరి. కాలక్రమమున ఆర్యావర్త భూములయందు ప్రవేశించి సింధునదీప్రాంత భూములందును, దక్షిణ హిందూదేశమందును, నివసింప మొదలిడిరి.

అందు భోజకులు యమునాతీరమందు మధురానగరము రాజధానిగా నొకరాజ్య మేర్పఱచుకొనిరి. సార్వభౌమపదము తొలగియుండిన యాదవులలో భోజకులకే తొలుదొల్త రాజ్య పాలనాధికారము కలిగెను. ∴ యాదవులపాలనకు లోబడిన అనార్యజాతి ఆభీరులు. వీరు శూద్రులుగను, యాదవులు క్షత్రియులుగను, ఆర్యులచే అంగీకరింపబడిరి. ఈయాదవులలో వృష్ణి వంశీయులు కొంతకాలమైనతరువాత అధికబలవంతులైరి. భోజకుల యింటి ఆడపడుచును పౌరవ్యులుసహితము వివాహ మాడి వారితో మైత్రి కావించుకొనిరి. కుంతిభోజుని కుమార్తె యగు కుంతీదేవిని పౌరవ్యుఁడగు పాండురాజు పెండ్లాడుటే యిందుకు నిదర్శనము కాదా! వసుదేవునికాలమున వృష్ణి వంశీయులు ఆర్యావర్తమం దధికబలవంతులుగ నుండుటచే నానాదేశపు క్షత్రియకుటుంబములాతనికి తమతమకన్యల నిచ్చి వసుదేవుని మైత్రి నభిలషించుచుండిరి. ఆహుకుని ఏడ్గురు కొమార్తెలను ఆహుకుని తమ్ముఁడగు ఉగ్రసేనుఁడు వసుదేవున కిచ్చి వివాహముగావించెను. అందు రోహిణియొకర్తుక. కోసల రాజు కన్యల నిరువురను, కాశీపతికూతురగు వైశాఖిని, వివాహ మాడెను. సృగాళుఁడు వసుదేవుని మైత్రినాసించి తనకన్యయగు సునామ్ని నాతనికి భార్యగ నొసంగెను. ఇంత యేల: యాదవ

వంశీయులలో మకుటధారులమని విఱ్ఱవీగుచున్న మధురాధినాథులగు భోజకులు సహితము తమకన్యల, దేవకి మొదలగు ఏడ్గురను వసుదేవునకర్పించి ఆతనిసఖ్య మపేక్షించి యుండిరి. వసుదేవుడు మధురకేతెంచునప్పుడు యువరాజగు కంసుడు స్వయముగ రథమునడపి ఆతనిని గౌరవించెను. మధురాధిపతియగు ఉగ్రసేనుడు వసుదేవుని మైత్రివడసి యుండుటచేతనే జరాసంధునిపక్షము చేర నిరాకరింప సాహసించెను.

ఇంక ఆర్యావర్తమున పౌరవ్యుల అధికార మెటులుండెనో చూతము.

శంతను చక్రవర్తికాలమునాటివఱకు పౌరవ్యుల అధికారము ఆర్యావర్తమున నిరంకుశమైయుండెను. విచిత్రవీర్య చిత్రాంగదుల శైశవంబున పౌరవ్య సామ్రాజ్యంబునంగల సామంతులు స్వతంత్రింప మొదలిడిరి. మగధాధీశుడైన బృహద్రథుడు పౌరవ్యుల అధికారము ధిక్కరించి స్వతంత్రించెను. ఆతడు తన స్వాతంత్రతను స్థిరపరచుకొనన నెంచి ప్రాక్దక్షిణ వాసులగు జాతులతో మైత్రిగావించుకొనెను. మగధరాజ్యమునకు ప్రాక్ దక్షిణభాగంబులను బలిక్షేత్ర మందురు. అసుర వంశీయుల అధికారము ప్రబలముగ నుండుటచే ఆతడు ఆ మార్గముల ననుసరింపలసివచ్చెను. ఉత్తర పశ్చిమభాగమం

దుండిన పాంచాలురుకూడ స్వతంత్రించి సమ్రాట్టులగుటకు నువ్విళులూరుచుండిరి.

పౌరవ్యసామ్రాజ్య వ్యవహారముల చూచుచు నడిపించుచుండిన (Protector) భీష్ముఁడు సామ్రాజ్యాభిమానము గోరి బాలుఁడగు ధృతరాష్ట్రునకు గాంధార రాజకన్యను, పాండునకు ఆనాడు ఆర్యావర్తమందు బలవంతులుగ నున్న యదువంశ సంజాతయగు కుంతీదేవిని, మద్రపతి కూతురా మాద్రినింగూడ భార్యలుగ నొసర్చెను. పాండురాజు వయోవంతుఁడై రాజ్య భారము వహించిన తరువాత దిగ్విజయ మొనర్చి పౌరవ్యుల అధికారమును ఆర్యావర్తమందు అన్నియెడల వ్యాపింపజేసెను.

కాని పాండురాజు శాపదగ్ధుఁడై అకాలమృత్యువు వాతఁ బడుటచే జాత్యంధుండగు ధృతరాష్ట్రుఁడు సామ్రాజ్యవ్యవహార ములఁ జూడవలసి వచ్చెను. అప్పట్టున పౌరవ్యసామ్రాజ్య మందు మఱల అరాజకము తలచూప మొదలిడెను. పాంచాల పతియగు ద్రుపదుఁడు స్వతంత్రించి ఆర్యావర్త సమ్రా ట్టగుటకు వేచియుండెను. మఱియు పాంచాలురు నిరంకుశులుగ నుండుటచే పౌగరెక్కి తద్దేశవాసులుగను, మిత్రులుగను నుండిన బ్రాహ్మణోత్తముల నగౌరవించుటచే ద్రోణ ప్రభృతులు

ద్రుపదుని వీడి వచ్చిరి. భీష్ముఁడు ద్రోణాదుల బలపౌరుషంబులు గుర్తెఱింగి వారినిసత్కరించి కురుకుమారులకు యొజ్జలుగ నియోగించెను. ద్రోణాదులు పౌరవ్యుల అస్త్రవిద్యాపారంగతులుగ నొనర్చి వారిమూలమున పాంచాలపతిని పరిభవింపఁ జేసెను. నాటినుండియు ద్రుపదునకు పాండుసుతులపై ప్రేమయు గౌరవమును అధికమయ్యెను.

పౌరవ్యు లనుభవించుచుండిన ఆర్యావర్తసార్వభౌమతను నాల్గుమూలలనుండిన నాలుగు ముఖ్యజాతులవారాసించుచుండిరి.

1. మగధాధీశుఁడైన జరాసంధుఁడు.
2. పాంచాలపతియైన ద్రుపదుఁడు,
3. మత్స్యదేశాధీశుండగు విరటుఁడు.—
(ఈతనికి సింహాబలుఁడు బానటయై యుండెను.)
4. మధురనేలుచుండిన ఉగ్రసేనుఁడు—
(వృష్ణివీరుఁడగు వసుదేవుఁడు తనకు వెనుదండిగా నుండునని ఉగ్రసేనుఁడు తలంచియుండును.)

మొదట ఆర్యావర్తము నాల్గు ముఖ్యభాగములుగ విభజింపబడియుండెను:—

(1) సప్తసింధు అనుపేరున సింధునది ముఖ్యముగ పారుచుండు దేశము పిలువబడుచుండెను.

(2) పంచనదము అను పేరున సింధునది యొక్క ఉప శాఖలు ప్రవహించుచుండు దేశము.

(3) సరస్వతి దృషద్వతీ నదుల మధ్యదేశమునకు బ్రహ్మావర్తమని పేరు. ఇందుండిన ఆర్యులు చుట్టు ప్రక్కలనున్న దేశముల నాక్రమించి అభివృద్ధి గాంచిన తరువాత ఆదేశమంతయు మధ్యదేశ మని పేరొందెను.

(4) గంగానదికి దిగువనున్న మధ్యభాగము ముఖద్వార ప్రాంతభూములు ప్రాచీ (Praki) దేశమని పిలువ బడుచుండెను. గోగ్రా, గండకి, సోణభద్ర (హిరణ్యా భాగ) నదులు ప్రాచీదేశమందుండెను. గంగానద దక్షిణతీరమునుండి గోదావరీనదివఱకునున్న భూ భాగము అరణ్యామయమై 'దండక' అనునామమున పిలువబడుచుండెను.

కౌరవులును, పాండవులును నివసించిన దేశము కురుదేశము ముఖ్యనగరము హాస్తినాపురము. పాండవులు యమునానది పశ్చిమమునకేగి అచ్చో * ఇంద్రప్రస్థ నగరము నిర్మించుకొని నివసించుచుండిరి. కురురాజ్యమునకు తూర్పున పాంచాల

---

* Indraprastha is medern Delhi-Kurushetra near Thaneswar.

ముండెను. అందు అహిచ్ఛత్రము, కన్యాకుబ్జము, కౌశాంబి అను ముఖ్యనగరములుండెను. గంగా యమునా నదుల మధ్యదేశమున గంగకు కొంతవఱకు తూర్పునను (1) పాం[illegible]డెను. మత్స్య, శూరసేన దేశములు మధ్యదేశమున దక్షిణ పశ్చిమ భాగములం దుండెను.

మాగధులు మధ్యదేశమునుండి గంగానదీదక్షిణ భాగమున కేతెంచిరి. మహాభారతకాలమున అంగ, వంగ, పుండ్ర, కిరాటదేశములును, మత్స్యదేశమునందలి భాగమైన చేదిదేశముకూడ మాగధులకు సామంతులుగ నుండిరి. పాంచాలమునకు తూర్పున కోసల, అద్దానికి తూర్పున విదేహ దేశములు, గంగానది కుత్తరభాగమందుండెను. విదేహదేశమునకు తూర్పున ప్రాగ్జ్యోతిషము, ఆపైన కామరూపమునున్నవి. కోసలులు కొందఱు వింధ్యపర్వత దక్షిణభూముల కేతెంచి, అచ్చో నొకరాజ్య మేర్పఱచుకొనిరి. అయ్యదియే దక్షిణ కోసల. పూర్వసముద్రతీరమునకు కళింగమని పేరు. పశ్చిమ తీరము ప్రభాసమని పిలువబడుచుండెను. పశ్చిమప్రాంతములందు ద్వారకానగరమున శ్రీకృష్ణుడను బలవంతుడగు నాయకుడుండెను. సింధుదేశమునకును ఆరావళిపర్వతపంక్తులకును మధ్య సాళ్వదేశముండెను.

1 Kuru and Panchala occupied the North and East of Madhyadesa.

అనార్యులుగ నుండిన యాదవులు తమ సత్ప్రవర్తనము వలన ఆర్యులలో చేరినట్లును, కాలక్రమమున వారు తమ బలమధికము కావించుకొని స్వతంత్ర రాజ్యముల నేర్పఱచుకొనినట్లును, వసుదేవునినాడు యదువంశీయుల బలము అత్యధికమగుటచే ఆర్యావర్తమం దనేక రాజకుటుంబముల వారు యాదవులతో సంబంధబాంధవ్యములుకూడ చేయ మొదలిడినట్లు కాన్పించును. యాదవుల అభివృద్ధికి జరాసంధుఁడే ప్రబలవిరోధిగ నుండెను. అదిగాక పూర్వరాజవంశమైన పౌరవ్యుల బలము నానాటికిని సన్నగిలుచుండుటచే పాంచాల, మత్స్య, మాగధులు వారిని ధిక్కరింప ప్రారంభించుచుండిరి. వసుదేవుని కుమారుఁడగు శ్రీకృష్ణుఁడు యాదవు లభివృద్ధి జెందుటకు మత్స్య, పాంచాల, మాగధులను తొలుదొల్తఁ బౌరవ్యులకు లోబరుపవలెనని సంకల్పించుకొనెను. కావున పౌరవ్యులలో నొకశాఖయగు పాండవులకు పాంచాలురతోడను, మత్స్యదేశాధిపుఁడగు విరటునితోడను, బాంధవ్యము సంఘటిలుట శ్రీకృష్ణునకు ఆమోదదాయకమయ్యెను. శ్రీకృష్ణుఁడు యెదుట నిలిచి భీమునిచే జరాసంధుని చంపించి పాండవులను ఆర్యావర్తమున అధిక బలవంతులఁ జేసెను.

భారతవర్షమున ఆనాడు జరిగిన మహాయుద్ధమందు

యాదవులే రథికులై కార్యమూనినచో, ఆర్యనృపులెల్ల రలిగి, ఏకీభవించి యాదవుల రూపుమాపుదురన్న భీతి శ్రీకృష్ణున కుండుటచేత నేకావలయు పాండవులను ముందుంచి కురుక్షేత్ర రణరంగమున దా బ్రవేశించెను. కురుక్షేత్రయుద్ధానంతరము నిర్జీవమైన భారతవర్షమును పాండవులెంతో కాల మేలరని యును, అందుచే యాదవులు అనాయాసముగ ఆర్యావర్త మున నిరంకుశాధికారులు కావచ్చుననియును కృష్ణుడు తలంచి యుండవచ్చునేమో! కాని, యాదవవీరుల అవివేకకృత్యములే వారివినాశమునకు కారణములయ్యెను. యాదవులు నవనాగరికు లయందు తాండవించుచున్న ముఖ్యమైన *మూడు దురభ్యాస ములును, అలవరచికొని యుండిరి. వారు తమకాలమును నిరంతరము యుద్ధములయందును, వనితావినోదములయందును, సురాపానమందును, వృథసేయుచుండిరి. తుదకు కల్లుత్రాగి కైపెక్కి యాదవు లొకరి నొకరు గ్రుద్దుకొని చచ్చిరి.

పెరటిచెట్టు మందునకు పనికిరా దనునట్లు శ్రీకృష్ణుని బోధనలు యాదవులకు పథ్యముకాకుండెను. అందుచేతనే ఆతడు తనయందు భక్తివిశ్వాసములుంచిన పాండవుల అభి వృద్ధికే పాటుపడెను. యాదవులయందు దురభిప్రాయము

* Wine, Woman and War.

జనించుటచేతనే తనమూలబలమగు నారాయణగోపాలురను కూడ కురుక్షేత్రయుద్ధమందు శ్రీకృష్ణుఁడు రణదేవతకు బలియిచ్చెను.

ఉగ్రసేనుఁడేలిన మధురానగరము మొదట మాధవుఁ డనువాఁడు నెలకొల్పి వివిధశాఖలయాదవుల కయ్యది పట్టు కొమ్మగాఁ జేసెను. మాధవుని వంశీయులైన భోజకులు రాజులైరి. వృష్ణి యిత్యాదిశాఖలవారు వారికి అనుచరులుగ నుండిరి. ఈభోజకులలోనివారు కొందరు వింధ్యపర్వత ప్రాంతములకేగి విదర్భకడ వేరొకరాజ్యమేర్పఱచుకొనిరి. కాల క్రమమున మధురానగరము యాదవవీరులకు ముఖ్యస్థానమై వన్నెకెక్కుటయేగాక పాంచాలురకును, పౌరవ్యులకునుగూడ పక్కలోని బల్లెమట్లుండెను.

వసుదేవుఁడు

(ఆనకదుందుభి)

మథురయందును దక్షిణాపథభూములయందును యదు వంశీయులు చిన్న చిన్న రాజ్యముల నెలకొల్పుకొని అభివృద్ధి జెందుచుండిరి. ఆర్యావర్తప్రాంతభూములందు నివసించిన జాతులయందు పాలితపాలకభేదములు మాత్రముండెను. వీరిలో పాలకులకు యాదవు లనియును, పాలితులకు అభీరులనియు పేరులు. అందుచేతనే యాదవులు క్షత్రియులుగను, అభీరులు శూద్రులుగను, ఆర్యులు గణించుచుండిరి. కొంతకాలమైన తరువాత ఈ యదువంశీయక్షత్రియులలో అనేకశాఖ లుద్భ విల్లెను. వారందరకును భోజకులు నాయకులుగ నుండిరి. కావున తొలుదొల్త భోజవంశమువారు రాజులై చరియింప ఇతర యాదవులు కింకరులై చరియించుచుండిరి. ' అందువృష్ణివంశము న వసుదేవుఁడనువాఁడుజన్మించి అధికబలవంతుఁడుగ నుండుటను మథురపతియైన ఉగ్రసేనుఁడు కీర్తిశేషుఁడును తనయన్నయును నగు ఆహుకునికూతునిచ్చి చెంతనుంచుకొనెను. వసుదేవుఁడు ఆర్యావర్తమందుండిన అనేక దేశముల రాజకన్యకల వివాహ మాడి వారితో యాదవులకు సఖ్యము చేకూర్చెను.

ఆసురసంప్రదాయానువర్తియగు జరాసంధుఁడు మథుర నేలుచుండిన భోజకులను తన పక్షమునకు ద్రిప్పుకొననెంచి ఉగ్రసేనుని కుమారుఁడగు కంసునకు తనకూతులనిచ్చి వివా

హము కావించెను. కాని చార్వాకమత మవలంబించిన వారభివృద్ధిగాంచలే రని వసుదేవుఁడు బాగుగగుర్తెఱింగి యుండుటచే, జరాసంధకూటమున ఉగ్రసేనుని జేరకుండజేసెను.

అంతట జరాసంధుఁడు తనఅల్లుఁడగు కంసునిజేరదీసి కానిమాటలాతనికి చెప్పెను. "వసుదేవుఁ డార్యావర్తమున అధిక ప్రఖ్యాతి నార్జించుచున్నాడు. మీతండ్రి ఆతనిచేతిలోని కీలుబొమ్మ. నేడో రేపో వసుదేవుఁడు మీతండ్రిని త్రోసి మధుర సింహాసన మాక్రమింపనున్నాడు. వసుదేవునిచేతమీతండ్రికో, కాకున్న వసుదేవునికి పుట్టనున్న కొమరునిచేత నీకో, మృత్యువునిశ్చయము - చేతులుకాలిన తరువాత ఆకులుపట్టిన లాభముండదు. కార్యము మీరకుండగనే కనులువిప్పుము - వసుదేవుఁడు పుత్రవంతుఁడైనంత నే ఆతనికిలోభము హెచ్చును. రాజ్యతృష్ణ జనించును. వసుదేవుఁ డేకాకిగ నున్నంతకాలము ఆతఁడు మీభోజకులను వినయవిధేయతలతో సేవింపవచ్చును."

జరాసంధుని మాటలు కంసునిమనంబు కలంచెను. అందుచే నాతఁడు వసుదేవుని దేవకీసమేతముగ కారాగృహబద్ధు నొనర్చెను. వసుదేవుఁ డధికబలవంతుఁడయ్యును యాదవుల నేమముగోరి చెరయందుండుటకు సమ్మతించెను. అంతియే కాదు; కంసునిభీతిబాపవసుదేవుఁడు తనకు దేవకియందుజన్మించు సంతానముకూడ కంసుఁడుఖండించుటకు తాను సమ్మతించెను.

క॥ పలికిన పలుకులు దిరుగక,

సాలయక వంచనములేక సుతుల రిపులకుం
గలఁగక యిచ్చిన ధీరుం డిల
వసుదేవుండు దక్క నితరుఁడు గలఁడే॥

తదుపరి జరాసంధుఁడు తనయనుచరులగు రక్కసుల కంసుకడకంపి ఆతని దనుజమార్గానువర్తిఁగమార్చ మొదలిడెను. బాణ, భౌమ, మాగధ, మహాశన, కేశి, ధేనుక, బక, ప్రలంబ, తృణావర్త, చాణూర, ముష్టి కారిష్ట, ద్వివిధ, పూతనాది రక్కసులు మధుర కేతెంచుటచే, అనేకమంది యాదవులు, తమతమపదవుల విడిచి నిషధ, కురు, కోసల, విదేహా, విదర్భ, కేకయ, పాంచాల, సాల్వదేశంబులు సొచ్చిరి. మచ్చరంబులు విడిచి కొందఱు మాత్రము కంసుని కొలిచియుండిరి. అందుచే యాదవబలంబు నానాటికి సన్నగిలఁ జొచ్చెను.

మాటదప్పక కన్నపుత్రులఁజంప కంసున కప్పగింపుచుండి నను, ఆతఁడు తనక్రూరమార్గంబుల వీడకుండుటచే వసుదేవుఁడు కంసుని మోసగించి అంత మొందించినగాని, యాదవులకు సేమంబుఁ జేకూరదని నిశ్చయించి, దేవకి ఏడవచూలగు బలరాముని కంసునకీయక, దేవకిగర్భంబు విచ్ఛిన్నమైనదని బొంకెను. ఆబాలుని పెంప నాభీరనాయకుఁడగు నందునికడ కంపెను. తరువాత జన్మించిన బాలునికూడ నందునికడకు తానుస్వయముగ గొనిపోయి, అటనుండి ఒకస్త్రీశిశువును కొనివచ్చి యియ్యదియే దేవకి ఎనిమిదవ కాన్పని కంసునితో చెప్పెను. కంసుఁడా స్త్రీశిశువునే పట్టివధించెను.

ఈ దేవకి ఎనిమిదవచూలే మనకథానాయకుఁడగు శ్రీకృష్ణుఁడు. జరాసంధుని దుర్మంత్రంబున కంసుఁడు దేవకీవసుదేవుల కారాగృహామందుంచినంతమాత్రమున యదువంశ మంతరింప లేదు. వసుదేవుని సంకల్పము కడుదొడ్డది. ఆ కారాగృహామే జరాసంధాది దుష్టనృపుల మారణ మొనర్పజాలిన మహావీరు లుద్భవించుటకు కావలసిన వాతావరణ మొనగూర్చెను. ద్రోణునిచే పరాభవింపబడిన ద్రుపదుఁడు ఈసువీడి, ధృష్టద్యుమ్నుని బడసినటుల, ఆసురమార్గానువర్తులగు రాజుల కుతంత్రములచే చెరయందుండిన వసుదేవుఁడు ప్రార్థించి ప్రార్థించి అసుర సంహారణమునకు చాలిన యదుకిశోరమును శ్రీకృష్ణుని గావించెను. అట్లగుట నెకదా తలిదండ్రులపూజాఫలమే కొమరులై పుట్టుదురందురు.

కంసుభీతిచే కృష్ణుఁడు కలకాలము అభీరశిబిరంబులనుండ వలసివచ్చెను. అందుచే అభీరులకు ఈతనియెడ అభిమానము మెండయ్యెను. చిన్ననాటనుండియు శ్రీకృష్ణుఁడు అభీరులమధ్య నాడుకొనుచుండుటచే వారాతనికొఱకు ప్రాణములగూడ నర్పింప సంసిద్ధులైయుండిరి. శ్రీకృష్ణుని అభివృద్ధికి అభీరులే మొదట నధికముగ తోడ్పడిరి.*

---

* మాలవీలకు శివాజీపట్ల నట్టి ప్రేమభక్తులుండెను. కావుననే శ్రీ శివాజి ఛత్రపతి కాగలిగెను.

శ్రీకృష్ణుని జననము-బాల్యము

అసురప్రేరితుఁడై కంసుఁడు ప్రజల ననేకవిధముల బాధించుచుండెను. కొంతకాలమునకు తనసోదరికి జన్మించిన బాలుఁడు సజీవుఁడైయున్నటులఁ దనకు వినవచ్చెను. అంత నా దురాత్ముఁ డాబాలువలన నపాయము శంకించి మంత్రులతో మంతనముచేయ వా రిట్లనిరి.

కం. "ఇట్టయినఁ దడయ నేటికిఁ,
బట్టణముల పందలందుఁ బల్లెలనెల్లన్
బుట్టెడు పెరిగెడు శిశువులఁ
బట్టి వధించెదము మమ్ముఁ బంపు మధీశా."

వారిపలుకులకుఁ జెవియొగ్గి కంసుఁడు పూతనాది రాక్షసుల బృందావనమున కంపెను. కాని వారు కృష్ణున కెట్టి అపకారమును జేయలేకుండిరి.

ఆ. "వెదకి వెదకి దైత్యవీరులు సాధుల
నడఁప వారిబలము ఉడఁగిపోయె;
యశము సిరియు ధర్మ మాయువు భద్రంబు
లార్యహింసనేయ నడఁగుఁ గాదె."

రాక్షసమార్గంబుల నవలంబించిన రాజులప్రతిభ యిట్లే నన్నగిల్లును. బలరామకృష్ణు లెట్టిపీరులు కానుండిరో అది వారి బాల్యక్రీడలందే కాన్పింపఁదొడఁగెను.

సీ. "గోవల్లభుఁడ నేను గోవులు మీరని, వడి అంకవైచుచు వంగియాడు
రాజు నే భటులు మీరలు రండు రండని ప్రాభవంబునఁ బెక్కుపనులఁ బనుచు
నేఁ దస్కరుండ మీరింటివా రని నిద్రపుచ్చి సొమ్ములుగొనిపోయి డాఁగు
నే సూత్రధారి మీరందఱు బహురూపు లని చెలంగుచు నాటలాడఁ బెట్టు

* * * * * * * "

బాలక్రీడాకలాపములందే మానవుని భవిష్యద్వర్తనము గోచరించును. వత్స బకరూపంబులుదాల్చి వచ్చిన అసురుః మర్మంబులెరింగి కృష్ణుఁడు వారిని సంహరించెను. గోపగోపికా జనంబులు అంత:

కం. "ఆపదలమీఁద నాపద,
లీపాపనిఁ జెంది తొలఁగ నీయర్భకునిం
బైపడిన ఖలులు దహనునిఁ
బైపడు శలభములపగిదిఁ బడిరి ధరిత్రిన్."

అని యనుచు శ్రీకృష్ణుం గొని యాడిరి.

కాళీయుఁడను అహిపతి యమునానదీప్రాంతభూములందు అనేక ఉత్పాతంబులు కలిగించుచుండుట విని, కృష్ణుఁడొకనాఁడు యమునఁ బవిత్రఁ జేయఁగా నుత్సుకుఁడై ఆమడుఁగునడాఁగియున్న కాళియాహిపైఁబడి మర్దించెను. కాళియాహి చచ్చినక్రియఁ బడియుండ వానికాంతలు దురంతంబైన చింతాభరంబున శ్రీకృష్ణుని కడ కేతెంచిన, ఆతం డవధరించి కారుణ్యమానసుండై కాళియున కిట్లనియె:—

కం. "గోవర్గముతో మనుజులు,
ద్రావుదు రీమడుఁగునీరు దగ దిందుండన్
నీవును నీబాంధవులును,
నీవనితలు సుతులు జనుఁడు నేఁ డంబుధికిన్."

అంతట కాళియుఁ డటనుండి కదలి రత్నాకరద్వీపంబునకుం జనియె.

ఆటలాడుచు కృష్ణుం డొకనాఁడు యమునానదికవ్వలి వైపుననున్న మునులకడకు అన్నమడుగ గోపబాలురఁ బుత్తెంచెను. ఆమునులు గోపబాలుర మందస్థితింజూచి యన్నము లేదనిరి. పురుషులకన్న స్త్రీలెక్కుడు దయారసము కలిగి యుందురని యెఱింగి కృష్ణుఁడు దనవారి నయ్యార్యుల భార్యల కడకుఁ బుత్తెంచెను. అంత నా ధరణీసురసుందరు లన్నంబు కడవల నిడికొనివచ్చి ఆఁకలిగొనియున్న ఆగోపాలుర కిడిరి.

కం. "పరమేశ్వరార్పణంబుగఁ
బరజనులకు భిక్షయిడినఁ బరమపదమునం
బరఁగెదరు * * * "

ఆనాఁడు తమస్త్రీలు అనుభవించుచుండిన పరమానందంబుఁ గాంచి బ్రాహ్మణు లిట్లు చింతింపఁదొడఁగిరి:

కం. "జపహోమాధ్యయనంబులుఁ,
దపములు వ్రతములును లేని తరుణులు హరి స
త్కృపఁబడసి రన్నిగలిగియుఁ
జపలతబొందితిమి భక్తిసలుపమి నకటా."

కాని బ్రాహ్మణులు కంసభీతులయి బలకృష్ణసందర్శనంబు సేయఁ జనరైరి.

ఒకనాఁడు ఇంద్రియాగంబు సేయం దలంచియున్న నందాదులకడకు శ్రీకృష్ణుఁడేతెంచి యిట్లనియె:—

కం. "కర్మమునఁ బుట్టు జంతువు,
కర్మమ్మున వృద్ధిఁబొందుఁ, గర్మమునఁ జెడుం,
గర్మమె జనులకు దేవత,
కర్మమె సుఖదుఃఖములకుఁ గారణమధిపా."

విప్రుండు వైదికకర్మంబున మెలంగు; నృపతి ధరణీపాలనంబున సంచరించు; వైశ్యుండు వాణిజ్య కృషికుసీద గోరక్షణాదుల వర్తించు; శూద్రుం డగ్రజన్ముల సేవించి బ్రతుకు. సత్త్వరజస్తమోగుణంబు లుత్పత్తి స్థితి లయకారణంబు లందు రజంబున జగంబుజన్మించు; ఇంద్రుఁడేమి సేయఁగలవాఁడని, ఇంక నిట్లనియె:

సీ. "పసులకుఁగొండకు బ్రాహ్మణోత్తములకు మఖముగావింపుట మంచిబుద్ధి
ఇంద్రయాగంబున కేమేమి చెప్పింతు రవియెల్లఁజెప్పింపుఁ డరసి మీరు
పాయసంబులు నపూపములు సైఁదపుఁబిండివంటలుఁ బప్పును వలయునట్టి
ఫలశాకములు వండఁబంపుఁడు హోమంబు సేయుఁడు ధేను దక్షిణల నిచ్చి

గీ. బహురసాన్నంబు పెట్టుఁడు బ్రాహ్మణులకు
నచలులై పూజలొనరింపుఁ డచలమునకు
నఘమచండాల శునకసంహతికిఁదగిన
భక్ష్యములఁ దెండు కసవుల పసుల కిండు."

నరులకు సంరక్షకులుగనుండినంత కాలమే సురలు పూజార్హులు. అసురులు అనేకవిధములగు బాధల నరులకుఁ గలిగించుచుండినను దేవేంద్రాదు లూరకుండిరి. అందుచేత శ్రీకృష్ణుఁడు వారిని పూజింపవలదని తండ్రిని వారించెను. ఇంతియేగాక సురలు దైత్యుల మూఁడగములకుఁ దోడ్పడుచున్నట్లు కాన్పించును. నందుఁడు యమునాజలంబులఁ గ్రుంకులిడుచుండ నొక్క దైత్యుం డాతని వరుణనగరంబునకుఁ గొంపోయెను. అంతటఁ గృష్ణుఁడు వరుణనగరంబున కేగి తండ్రిని విడిపించి తెచ్చెను. నాఁటినుండియు వరుణుండు యాదవుల స్నేహం బపేక్షించుటకు మొదలిడెను. బలరాముఁడు వరుణదేవునితో మైత్రి కావించి సుర చేయువిధంబు నేర్చుకొనెను. ఈసురాపానమే తుదకు యాదవుల వినాశనమునకుఁ గారణమాయెను.

ఇట్లు బలరామకృష్ణులు నానాఁటి కభివృద్ధిఁ జెందుచుండుట విని యాగంబుఁ జేయుమిషనుఁ గంసుండు రామకృష్ణులఁ దనకడకు దోడ్కొనిరా నక్రూరు నంపెను. అక్రూరునివెంట రామకృష్ణులు మధురానగరంబున కేతెంచిరి కాని, వా రాతనితో ఆరాత్రి పురంబుప్రవేశింప నిరాకరించిరి. కృష్ణుండానాఁటి రాత్రి మధురానగరంబంతయు నామూలాగ్రంబుగఁ బరిశోధించి, మరునాఁటి యుదయమున కోటకేగుచున్న నొకరజకునిగాంచి ఇట్లనియె:—

"మామందలలోనఁ గట్టికొన మంచి పటంబులేవు నీమునేన్
సుందరధౌతచేలములు శోభిలుచున్నవి తెమ్ము."

ఆమాటల కా రజకుండాగ్రహించి,

"మా రాజుసొమ్ముఁ గైకొన
నేరాజులు మోతు రింతయొగ్గిదమే !
* * * *
గొల్ల, యేగుము తలఁగన్." అనియెను.

ఆచాకిపలుకులకుఁ గృష్ణుండు రోషించి ఘోరకరాగ్రతలంబ
వానితల పగులనడఁచెను. కృష్ణునిదారుణకృత్యంబునకుఁబౌరు
దిగులొంది రామకృష్ణులకుఁ గావలసినవెల్ల నాలుకమొదపక
యర్పించిరి.

కుబ్జయను కురూపి కృష్ణునకు మేనఁబూసికొన సుగ
లేపము లర్పించిన నాతండు సంతసించి, తత్పదంబులమీఁ
దనపదంబులుద్రొక్కి హస్తాంగుళద్వయమబల గవుదక్రిందవిష
నిడి కృష్ణుఁడు మీఁదికినెత్తిన ఆ మెవక్రతలెల్ల మానెను. అం
మధురానగరంబంతయు శ్రీకృష్ణుఁడు దుష్టశిక్షణార్థము,
సంరక్షణార్థమే తెంచిన మహాపురుషుఁడను పలుకులు వ్యా
చెను. ధనుశ్శాలకరిగి అచ్చోనాతఁడు గురుతరమైనవిల్లువిర
ఆకోదండభంగనిర్గతధ్వానము భోజవిభుని బింకము ఛేదించె
తరువాత నాతఁడు కువలయాపీడ మను గజంబును వధించె
కంసుం డపు డటకేతెంచు:

కం. "చచ్చిన కుంభీంద్రంబును
వచ్చిన బలమాధవులను వరుసం గని, తా

నొచ్చిన చిత్తముతోడుతఁ
జెచ్చెరఁ గడువెఱచె భోజసింహులుం దధిపా."

అంతటఁ గంసప్రేరితులై చాణూరముష్టికులను వీరులు శ్రీకృష్ణ బలరాముల మల్లయుద్ధంబునకు ఢీకొని మడిసిరి. కంసుండు భయకంపితుండై, ఆత్మవిశ్వాస మంతరింప మంత్రులం జూచి యిట్లనియె:—

ఉ. "వల్లవబాలురన్ నగరివాకిటికిన్ వెడలంగ ద్రొబ్బుఁ డీ
గొల్లల ముట్టికోల్ గొనుఁడు క్రూరుని నందుని గట్టుఁ డుర్వికిన్
దెల్లముగాఁగ నేఁడు వసుదేవునిఁ జంపుఁడు; తండ్రిగాఁడు వీఁ
డెల్లవిధంబులం బరులకిష్టుఁడు గావకుఁ డుగ్రసేనునిన్."

కంసునికి ఆత్మబలముపై విశ్వాసమంతరించుట గమనించికృష్ణుఁ డాతనిపైకి సింహముక్రియన్ లంఘించి, పక్షీంద్రుం డురగంబుఁ బట్టువిధంబున కంసుని కేశబంధంబు లోకక్షోభంబుగఁబట్టి వానిని బడద్రొబ్బి చంపెను. కంసుఁడొనర్చిన పాపకృత్యములే యాతనిమనంబు వేధింప నందొకవిధమగు భీతిజనించెను. కాకున్న వీరాధివీరుండగు కంసుఁడు బాలుఁడగు కృష్ణునిచే నిహతుఁడగుట ఎట్లుసంభవించును? మనముచేయు పాపములే మహాభూతములై మనలను మ్రందించును.

శ్రీకృష్ణుఁడు కోటనుండి కదలి కారాగృహమునకేగి అందు గుందుచుండిన దేవకీవసుదేవుల విడిపించి, మాతామహుండైన ఉగ్రసేనుందర్శించి:—

"అనఘ యయాతిశాపమున యాదవవీరులకున్ నరేశ్వరా
సనమున నుండరాదు; ****రమ్ము జనపాలన శీలివిగమ్ము వేడ్కతోన్"

అని వేడుకొనెను. వసుదేవుఁడైనను, ఆతనికుమారుండైనను గంసునిజంపి మధురారాజ్య మాక్రమింతు రని జరాసంధుఁడు కల్పించిన అపవాదము మిథ్యయని యాదవలోకంబున కెరుక పరుపఁగావలయు శ్రీకృష్ణుఁడుముదుసలియైనఉగ్రసేనున కేమరలఁ బట్టముగట్టెను. యాదవవీరులమనంబులందుజనించిన అనుమానములానాఁటితో నంతమొందెను. నాఁటినుండియు వివిధశాఖల యాదవులేకమై అభివృద్ధిగాంచ మొదలిడిరి.

"ఉగ్రసేనుని రాజుసేసినంతఁ, దొల్లి కంసభీతులై విదేశంబులకేగి కృశించుచున్న యదు వృష్ణి భోజ మరు దశార్హ కుకుర అంధక ప్రముఖులు సకలజ్ఞాతిసంబంధులతో నేతెంచి చిత్తంబులలర వారివారి నివాసంబులనుండ మొదలిడిరి."

ముందు కథావిధానంబునకు బలరామకృష్ణులు ఆర్య సాంప్రదాయముల నెఱుంగుట అత్యావసరమని తలంచి, వసుదేవుం డాబాలురకు గర్గాదిభూసురోత్తములచే నుపనయనము చేయించి, అవంతీపురవాసియు, సకలవిద్యావిలాసియునైన సాందీపునికడకు నరువదినాలుగువిద్దెలు నేర్చుకొన వారల నంపెను. ఎదిగినబాలురగుటచే వార లన్నివిద్యలను ఎక్కుడు శ్రద్ధతో నేర్చుకొన మొదలిడిరి. ఆవిద్యల ఆవశ్యకతగుర్తెఱింగి

యుండుటచే అతిస్వల్పకాలమున వారు సకలకళాకోవిదులైరి. మానవు లెవ్వరైనను గురువాక్యోద్యుక్తులైనఁగాని తత్పూర్వారంభము చేయఁబోలరు. కావుననే వసుదేవుండాబాలుర గురువుకడకంపెను. సాందీపనివంటి విద్యావిశారదుఁడు శ్రీకృష్ణునివంటి మేధావంతునికి ఉపదేశికుఁడైనచో అఱువదినాలుగువిద్యలును అఱువదినాలుగుదినంబులలో బోధించెనన నాశ్చర్యమేమున్నది! ముందుకథయందుఁ జతురంగబలసమేతులును జతురులును సగు రాజన్యులతో శ్రీకృష్ణుఁడు పోరాడవలసియున్నది.

బాల్యక్రీడలందు శ్రీకృష్ణుఁడు కావించిన అద్భుతకృత్యములయందాతనికి భగవంతుఁడు తోడ్పడియుండిన నుండవచ్చు. ఇఁక ముందుకథయందు వెఱ్ఱిముఱ్ఱి గొల్లసుద్దులవలనఁ గార్యములు కానేరవు. కావుననే వసుదేవుఁడు ఆర్యావర్తరాజకీయ నాట్యరంగమున ముందు కృష్ణుండాడనున్న మహాభారతనాటకమునకుఁ గావలసిన విధానముల నెఱుంగఁగావలయు నవంతీపురమునకంపెను. లౌకిక వైదిక వ్యవహారముల నారితేరిన సాందీపని అభీరకృష్ణుని ఆర్యకృష్ణు నొనర్చి, అఖిల రాజతాపసలోకంబుచే మన్ననలందు నంతవానిగఁ జేసెను. చాణక్యుఁడు చంద్రగుప్తుని చేపట్టి ఆతని మగధసింహాసన మెక్కించుటకుఁ గావలసిన సాధనసామగ్రిఁ జేకూర్చినట్లు, సాందీపని శ్రీకృష్ణుని ఆ నాఁడు భారతవర్షమందు సూత్రధారిగ నుండఁజేయుటకే కావలయుఁ గావలసిన విద్యాబుద్ధులనెల్ల నలవడఁజేసి పంపెను.

దుష్టసంహారణము—శిష్టరక్షణము

కంసవధతో శ్రీకృష్ణుని బాల్యక్రీడలు ముగిసినవి; కాని నాఁటినుండియు నాతఁడు బలసంపన్నులగు రాజాధిరాజులతోఁ బోరొనరింపవలసియుండెను. భోజకులు యాదవజాతియందలి అంతశ్శాఖవారగుటచేఁదత్కంసవధ ఆర్యావర్తమున నొకజాతి అంతఃకలహముగఁ బ్రజలచే భావింపబడి యుపేక్షింపఁబడెను. కురుపాంచాలాధీశులచేఁ గంసుని క్రూరకృత్యములచే, ననేకులు యాదవవీరు లాతనియెడ నసంతృప్తిఁజెందియుండిరి. కావున శ్రీకృష్ణునకుఁ గంసవధ అంతకష్టమీయలేదు; కాని కంసుని మరణానంతర మాతని మామయగు మగధాధీశుఁడు శ్రీకృష్ణునితో నంతులేని పంతమూని పోరఁబొచ్చెను.

కంసుని మరణమున నాతనిభార్యలగు అస్తియుఁ బ్రాప్తియు విధవలై దుఃఖించుచుఁ దమతండ్రియైన జరాసంధునగరంబునకుం జని తమతండ్రితో నిట్లనిరి:—

శా॥ వాఁడ్రుడున్ వీండ్రుడును రాజులేయనుచు గర్వప్రౌఢితో యాదవుల్
వేంద్రంబైన బలంబుతో మధురకున్ వేవచ్చి నిష్కారణం
బాంద్రుఁడున్ బిడ్డలు బంధులున్ వగవఁ గంసాది క్షమావాధులం
దండ్రీ! చంపిరి; కృష్ణుచేత నిటు వైధవ్యంబు వచ్చెం జుమీ ॥

అనిన విని ప్రళయకాలానలంబు తెఱంగున మండిపడి శోక రోషంబులు బంధురంబులుగా జరాసంధుం డిట్లనియె.

శా॥ యేమీ కంసునిఁ గృష్ణుఁడే రణములో హింసించె నోచెల్ల! నా
సామర్థ్యంబు దలంపఁ, డించుకయు మచ్చండప్రతాపానలో
ద్దామార్చుల్ నశి నేఁడు గాల్చు యదుసంతానాటవీ వాటికన్
భూమిం గ్రుంగిన మింటఁడాఁగిన మహాంభోరాశిలోఁ జొచ్చినన్ ॥

అని జరాసంధుఁడు శ్రీకృష్ణుకడ కిట్లు కబురంపెను.

కం. "నీకొండె బ్రతికియుండుట,
నాకొండెంగాక గోపనందన, వినుమీ
లోకంబున నిద్దరకును
నేకసమయవృత్తి పొసఁగునే యిటమీఁదన్."

ఆమాటలకు శ్రీకృష్ణుఁడు దిగులొందక మందహాసం బొనర్చెను. జరాసంధునకు బలమధికముగనుండుట నాతఁడెఱుంగును. జరాసంధుని పక్షమూనియుండిన రాజు లనేకులుండిరి. పౌండ్ర కళింగ కరూశ చేది సాళ్వ విదర్భ యవన వేణుధారి సౌవీర గాంధార త్రిగర్త కామరూపదేశాధీశులును మఱియు అంగ వంగ సుహ్మ విదేహ కోశ కాశ దశార్ణ మద్ర పాండ్య దేశాధీశులును జరాసంధుని యాజమాన్య మంగీకరించి యుండిరి. ఇంక యాదవులకన్ననో ఆనాఁడు బలమధికముగ లేకుండెను. కావున జరాసంధుని బలంబుఁ గ్రమక్రమంబుగఁ గృష్ణుండు సంహరింప సమకట్టెను. అందుచేతనే కృష్ణుం డన్నయగు బలరామునితో నిట్లనియెను:—

ఆ. "మగధనాథుఁ బోర మడియింపఁ బోలదు,
మడియకున్న వీఁడు మరలి మరలి

బలముఁ గూర్చుకొనుచుఁ బఱతెంచుఁ; బఱతేరఁ
ద్రుంపవచ్చునేల దొసఁగు దొఱఁగ."

అఖండభారతవర్షంబున నన్ని తావులకు వ్యాపించిన ఆజరాసంధ వ్యాధిని నిశ్శేషముగ నిర్మూలించుట కప్పటికిఁ దగిన బలంబులు లేమి శ్రీకృష్ణున కెక్కుడు కాలముపట్టెను.

కృష్ణుండు తాను మధురానగరంబున నుండుట అపాయ కరంబని యెఱింగి యాదవవీరులతో నాలోచించినంత, వారిలో నయకళానిర్ణిద్రుండగు వికద్రుండను యదువృద్ధుండు వానికిట్లనియె:

"అపరిమిత నృప సహాయుఁడు,
కపటోపాయుఁడు ఘోర కర్మనిపుణుఁడు"

ఆ జరాసంధుఁడు

"యాదలిపాటునవచ్చి గదియవిడిసె".

కంసుండు బలగర్వితుండగుటం జేసియు, నీ మధురానగరంబున ముట్టడిసమయమున వలయు ధనధాన్యాదులును, ఆయుధంబులును సంగ్రహింపఁ బడకుండుటం జేసియు, నిప్పురంబు దుర్గంబని నమ్మరాకయున్నది: కావున:

కం. "విను దక్షిణాపథంబున
వనజేక్షణ, తనరు ఋష్యవంతము వింధ్యం
బును సహ్యము ననఁగాఁ గల
యనుపమశైలములు బహుగహన సంకటముల్."

తొల్లి ముచికుందుండు, పద్మవంతుండు, సారసుండు, హరితుం

డను పేళ్లఁగల యదువంశభూపతులు నలువురు వైరిభయనివారణార్థంబై కావించిన దుర్గంబు లనేకంబులు కలవు. పడమటి సముద్రంబులోని దీవులును బహువిధంబులు. ఈ నలువురు అనుజులకును పెద్దవాఁడైన మాధవుండే తొల్లి ఈమధురానగరమును పాలించుచుండెను".

విక్రదుని పలుకులాలించి కృష్ణుండింకొక దుర్గమప్రదేశంబున కేగుటకై సకలజనంబులకు నిర్గమసన్నాహం బాజ్ఞాపించె: నాలోనన,

ఆ. "కాలయవనుఁ డనఁగఁ గాలకల్పుఁడు వచ్చె,
వేచి మధురమీఁద వేఁగుఁజేఁగ
గపటి నసికి నపుడ యొసఁగి జరాసంధుఁ
డును గడంగె ననియు వినియె నొకట."

* ఈ కాలయవనుఁడు జరాసంధుని ఆహ్వానంబున నార్యావర్తముపై దాడివెడలెను.

కాలవిలంబ మొనర్పక శ్రీకృష్ణుఁడు సకుటుంబులగు వృష్ణ్యంధకవీరులం దోడ్కొని సమస్తసంపదలతోడ సాగరానూప ప్రదేశంబుచేరి, ‡ మందరమునకు నెనయైన రైవతకాద్రిచేరువను ద్వారవతీనామకంబగు పురంబు నిర్మింప, శాత్రవులవలని భయంబువిడిచి యాదవు లందుండిరి.

* Jayachendra invited Mohemmad Ghori.
Doulat Lodi invited Baber.

‡ Mahendra in Orissa-Ganjam District

శకదరదపారదాదులును,హిమశైలాశ్రితులగు దస్యులుం దనకు విధేయులు గావున నిరవధిక సేనాసముదాయంబులతోఁ గాలయవనుఁడు మధురపై కేతెంచెను. కృష్ణుఁడు తనవారి నం దఱిని ద్వారకయం దుంచి తా నొక్కఁడ పాదచారియై మధురకు వచ్చెను. వానిఁబట్టుకొనుటకుఁ గాలయవనుఁడు ఆయుధములు గైకొనకయే తనవారిని వీడి వచ్చెను.

కం. "చేయీక వాని మొనలకుఁ
బాయఁగ వెలయించి చవ్వు పఱచె నవధ్యో
పాయుఁడు హరి యదు గడుగున్
జే యందినయట్లు యాసనేయుచు వీఁకన్."

ఇట్లరిగియరిగి, దేవతలచే వరంబుఁగొనిన ముచికుందుని చేంత కాతనిఁగొనివచ్చి,ఆతనిచే యవను నంత మొందించెను. కృష్ణుఁడు మఱలివచ్చి, మధురానగరంబున విడిసియున్న యవనముఖ్యుల నెల్ల వధియించి, యపరిమిత రథగజతురగసముదాయంబులం గైకొని యవిలంబితగమనంబునం ద్వారకకు విచ్చేసెను.

వింధ్యపర్వతంబునకు దక్షిణపార్శ్వంబున భీష్మకుండను భోజనృపుం డేలుచుండెను. ఆతని కుమారుండగు రుక్మి జరా సంధునిపక్ష మూనియుండెను. శ్రీకృష్ణుఁడు వారి నెటులైనను దనవారిగఁజేసికొన నిశ్చయించెను. అందుచేత నే శిశుపాలున కీయ నిశ్చయింపఁబడిన రుక్మిణిని దాను గైకొనిపోయి రాక్షసవిధిని వివాహమాడెను. త న్నెదిరింపవచ్చిన జరా సంధాదుల నోడించి పారఁదోలెను. తరువాత రుక్మి కృష్ణుని

పక్షమూని ఆతనితో బాంధవ్యము లనేకములుగావించుకొనెను. కానికొంత కాలమైనతరువాత రుక్మికిఁబౌత్రియగు రుక్మవతియను కన్యను అనిరుద్ధునకిచ్చి వివాహ మొనరించు దినములలో రుక్మి కొందఱి దాక్షిణాత్యరాజుల ప్రోద్బలంబున బలరాముని జూద మాడఁబిలచి పరిభవింపఁజూచెను. ఆనాఁడు దాక్షిణాత్య భూములయందు కాళింగులే ముఖ్యులుగనుండినట్లు కాన్పించును యాదవులపలుకుబడి దక్షిణాపథమున నానాఁటి కభివృద్ధియగుట గాంచి, కాళింగప్రభువులగు వేణుధారియు, శ్రుతవర్మ్మందును, అంశుమంతుండును, జయత్సేనుండును దమలో విచారించి రుక్మి పాలికిం జని యేకాంతంబున నతని కిట్లనిరి:—

ఉ. "నెత్తముమీఁదఁ గౌతుకము దుర్భరమై జనియించె నిప్డు మా
చిత్తములందు నీవు గడుఁజిత్రపుజూదరి వాత్మలోన న
స్వ్యత్తుఁడు సీరపాణి కడువేడుక నాతనిం జయింతు మే
మిత్తఱి నిన్నొకింత గవియింపు మొనర్పుము తత్ప్రసంగమున్."

వారిమాటల ననుసరించి రుక్మి బలరామునిజూదమాడఁ బిలిచెను, ఆజూదమున బలరాముఁడు రుక్మినిబరిహాసించి, రుక్మికిఁ దోడుగ నేతెంచిన కాళింగుని తలపగులనడఁచి పండ్లు డులిపి చంపెను.

ఆనాఁడు తనయన్న యొనర్చిన ఆకార్యములకుదా నన్నపై నలిగినను, నాఁటినుండియు రుక్మి పక్షము లుడిగిన పక్షియగుటచే, దక్షిణాపథ భోజకులను (విదర్భభోజకులు) గూడ శ్రీకృష్ణుఁడు

తనకు దాసులుగఁ జేసికొనఁగలిగెను. కంసుని మరణమున మధుర భోజకు లిదివరకే కృష్ణునకు వశంవదులై యుండిరికదా!

ఇట్లుండ నా కాలమునఁ బ్రాగ్జ్యోతిష మేలుచుండిన నరకుండను మహాదనుజరాజు బదరీవనంబునఁ బుణ్యాయజనతత్పరులై కూడియున్న తపస్విపుంగవులకుఁ బెక్కుబాధ లిడుచుండెను.

అప్పటికి దక్షిణాపథంబున తనపలుకుబడి నధికమొనర్చికొని శ్రీకృష్ణుం డుజ్వలతేజోవంతుడయియుండెను.

తే॥ "అస్నులార్చి, హోతల నొంచి, యఖిల యోగ్య
వస్తు విస్తారములను విధ్వస్తములుగఁ
జేసి, యాఁడు వారలనెల్లఁ జెఱలుపట్టి
కొనుచుఁ బోయె * * * "

ఇట్లు నరకుండు భామినుల కెక్కుడు బాధగలిగించుట విని శ్రీకృష్ణుఁడు ఆతని సంహారింప సత్యభామా సమేతుండై ప్రాగ్జ్యోతిషంబున కేతెంచెను. తమ్మెదుర్కొన నరకుం డేతేరునంతఁ గృష్ణుండు నగుచు సత్యమొగంబునం జూడ్కి నిల్పి, నీవు కయ్యంపుమోపు మోవుమని నాభామిని చేతికిఁ దనశార్ఙ్గంబిచ్చిన, నయ్యింతి కొంతవడి పోరొనర్చి నరకునిరథంబు, సారథిని దునిమెను. స్త్రీలు పురుషులవిలాసార్థం బీశ్వరునిచే సృష్టింపఁబడిన క్రీడాపరికరములుగ భావించి, వారిని తనయిచ్ఛవచ్చినట్లుపయోగించుచున్న నరకుం డానాఁడు స్త్రీలుసర్వశక్తిస్వరూపిణులని గ్రహించి రిత్తబోయిన మనంబున వెనుకకేగి, కొండొకరథంబుగొని కయ్యంబున కేతెంచెను. నరకుఁడు మఱలివచ్చి

నంత కృష్ణుండు చక్రప్రయోగంబొనర్చి ఆతనిం గడతేర్చి, నరక పుత్రుండగు భగదత్తునకుఁదండ్రిరాజ్యంబిచ్చి, నరకునిచేఁగారా గారమందుంచఁబడిన పదియాఱువేల దేవకన్యలను విడిపించెను. ప్రాగ్జ్యోతిషమునుండి మగిడివచ్చు మార్గంబున దేవనివాసంబున కేతెంచి అచ్చటి పారిజాత వృక్షమును వ్రేళ్ళతోఁ బెఱికి ద్వారకకుఁ గైకొనివచ్చెను. బలిముడిగిన దేవతలకు భాగ్యభోగ్యంబు లనవసరములని కాఁబోలు కృష్ణుఁ డట్లుగావించెను.

తండ్రిరాజ్యంబు కొడుకగు భగదత్తున కిచ్చివేసినను, ఆతని సిరియుసంపదయు నెల్ల ద్వారకకుఁగొంపోవుటను గృష్ణునిపై భగదత్తునకు దీఱనిపగ యుండెనన నసంభవ మేమున్నది !

నరకసంహారణమునకు శ్రీకృష్ణుని నాహ్వానింప నరుదెంచిన ఇంద్రుఁడేఆనాఁటి దుస్థితినిగూర్చి, శ్రీకృష్ణునితో నిట్లనియెను:

చ॥ "నరకుఁడనంగ దైత్యకుల నాథుఁ డొకండు సరోజసూతిచే
వరములుగాంచి పేర్చి సురవర్గము నెల్లను గాసిచేసె సం
గరమున నేము వాని భుజగర్వము సైఁపఁగలేక యిందులన్
సిరులుఁ బోఁఖం (లం) గి వచ్చితిమి చెన్నటి మానవ జాతిలోనికిన్"॥

ఇట్లనుట వలన అధికారసంపన్నులై సకలభోగము లనుభవించుచుండు నరులే దేవతలుగా పరిగణింపఁబడు చుండిరని తెల్లమగుచున్నది. అందువలన నేగద యిప్పటికింగూడ, అధికార సంపన్నుఁడై, సకలవైభవములఁగూడియున్న వానిని ఈ జన్మమున నే దేవేంద్రుండనియును, ఆతని పదవిని దేవేంద్రపదవి యనియును, వాకొను నలవాటు వాడుకలోనికి వచ్చినది.

ప్రాచీదేశప్రాంతమున వింధ్యపర్వత సమీపభూములయందు (ఇంచుమించు పాతాళమున) మహారణ్యముల మధ్యనొక పురంబు నిర్మించుకొని (శోణపురము) ప్రహ్లాదుని మనుమఁడగు బాణుఁడు రాజ్యమేలుచుండెను. ఈతఁడు కలకాలముఆర్యావర్తముతో నెట్టిసంబంధమునులేకయుండెను. కాని కొంత కాలమున కాతని కూఁతురగు ఉషాకన్య అనిరుద్ధకుమారువరించి, చిత్రరేఖ యను తనచెలియల నంపి నాయాదవవీరుని శోణపురమునకు మాయచేసి కొంపోయెను. కృష్ణుండు కొంతకాలమున కని రుద్ధుని దురవస్థవిని బలభద్ర సాత్యకి ప్రద్యుమ్న ప్రముఖులును, యదు వృష్ణి భోజాంధక వీరవరులును వెంటరా శోణపురంబుచేరఁ జనెను. మార్గమధ్యంబున మహారణ్యంబున బలభద్రునికి శివ జ్వరము వచ్చెను.

అయ్యది అరణ్యప్రదేశమగుట, మలేరియా జ్వరములట మెండు. అట్లగుటను:

ఆ॥ "   *   *

మూడుకాళ్లు తలలు మూడునగ్గిన,
జ్వరమువచ్చి తాఁకె సరభసమున."

అపుడు కృష్ణుండు:

ఆ॥ "తాఁకి యీజ్వరంబు తనచేతనున్న బ
స్త్రము సమంత్రికముగఁ జటులవృత్తి

---

1 మలేరియా జ్వరమునకు మూలమగు క్రిములు మూడు తలలును, మూడు కాళ్లును గలయట్టివిగా రూపించును.

నోరు తెఱుంగకుండ నురుసత్త్వనిధియైన,
సీరపాణిమీఁదఁ జిమ్ముటయును."

అనంతరము:

మ॥ "పరమాత్ముండగు శౌరి యప్పు డనలప్రాయంబు మాహేశ్వర
జ్వరదర్పం బణఁపం దలంచి నిజతేజస్స్ఫూర్తి శోభిల్ల దు
ర్భర [1] హైమంబనునట్టి శీతము జనింపంజేసి పొమ్మన్న ని
ష్ఠుర వృత్తిన్ జనె * * * "

అప్పుడు శ్రీకృష్ణుఁడు మంచు సృష్టించి అన్న నందు కప్పియుంచి ఆతనిజ్వరమును శాంతింపఁజేసెను. తరువాత యదువీరులు బాణునితో యుద్ధమొనర్చి, ఆతని బాహుగర్వ ముడిపి, ఉషాసుందరి ననిరుద్ధునితోఁ గనకరథంబున నిడుకొని ద్వారక కేతెంచిరి.

శ్రీకృష్ణుఁడు ఆర్యావర్తమందుండిన పురాతనరాజకుటుంబములు వారిని దాను స్వయముగ సంహరించుటకు సంకల్పించుకొని యుండలేదు. అందుచేతనే మగధాధీశుఁడైన జరాసంధుని వధియించుటకు వేఱొకనిని వెదకుచుండెను. యాదవులార్యావర్తరాజకీయ నాట్యరంగమున స్వయముగ జోక్యము

---

1 Manufacture of Ice & Treatment by Ice, ఈ మొదలగునవి శ్రీకృష్ణునకు విదితమనుట కాదా! మంచుతయారు చేయుట, మంచుగడ్డతో జ్వరచికిత్స చేయుట, మొదలగు విషయములకు మనపాశ్చాత్యసోదరులే ఆచార్యులని మఱియిఁక ననఁదగదు.

కలిగించుకొనినచో, ఆర్యవంశపు క్షత్రియులందఱు నేకమై గూఢ పులతోఁ బోరొనరించినచో, భరతవర్షమున సురాసురయుద్ధము లట్లు, యాదవ ఆర్యయుద్ధములు ప్రారంభమై ఎక్కుడుజనక్షయ మునకుఁ గారణమగును. అందుచేత శ్రీకృష్ణుఁడు ఆర్యావర్త నృపులలో నగ్రేసరులును పౌరవ్యులలోని వారును నగు పాండ వేయులనే తనఉద్దేశముల నెఱవేర్చుకొన సాధనములుగ నెన్ను కొనెను.

ఆర్యావర్తమందుండిన రాజవంశముల కెట్టి మనస్పర్థ లుండెనో చూతము:—

పాంచాలురకు నానాఁటికి బలమధికమగుటచే ద్రుపదుఁడు పొగరెక్కి అచ్చోనుండిన బ్రాహ్మణులఁ జులుకనగఁ జూడ మొదలిడెను. అందులకు ద్రోణాదు లలిగి, పుత్ర మిత్రకళత్రాగ్నిహోత్ర శిష్యగణంబులతో హస్తిపురంబుఁ జేరిరి. భీష్ముఁడు ద్రోణుని గురురాజకొమరులకు అస్త్రవిద్యగఱ పుటకు నియోగించి గౌరవించెను. ఆ బాలుర నస్త్రవిద్యాపారం గతులఁగావించి, వారిని వెంటఁగొని ద్రోణుఁడు ద్రుపదుని బరిభ వింపనే తెంచెను. ఆయుద్ధమున నర్జునుఁడు ద్రుపదునిబట్టి కట్టితెచ్చి, ద్రోణునెదుటఁ బెట్టెను. అంతట ద్రోణుఁడు మందస్మిత వదనార విందుఁడై ద్రుపదునితో:

ఆ. "ఇంకనైన మమ్ము నెఱుఁగంగ నగునొకో……"

అని యుల్లసములాడి ద్రోణుఁడా ద్రుపదుని విడిచి

పుచ్చెను. విప్రు నలుకయు, దృణహుతాశనంబును దీర్ఘంబుగ నుండునవి గనుకనా !

పాండువిభుని మరణానంతరము కృష్ణద్వైపాయనుఁడు కుంతీపాండవులం దెచ్చి హస్తినాపురమున విడిచి సత్యవతి కేకాంతంబున నిట్లనియె.

క. "క్రూరులు విలుప్త ధర్మా
చారులు ధృతరాష్ట్ర సుతు లసద్వృత్తులు ని
ష్కారణవైరులు వీరల
కారణమున నెగులు పుట్టు గౌరవ్యులకున్"॥

అందుచేతనే సత్యవతి కోడండ్రగు అంబికాంబాలికలం దోడ్కొని వనంబునకుఁ దపంబు సేసికొన నేతెంచెను. అప్పట్టున నామె పారాశర్యునుపదేశంబు భీష్మవిదురుల కెఱింగించెను. అందుచే భీష్మవిదురులు ధృతరాష్ట్రునకు బోధించి పాండవులను వారణావతమున కనిపిరి. కాని దుర్యోధనాదులు పాండవుల కపకారము ఘటింపనెంచి, పురోచనుండను తమముఖ్యకార్మికునంపి, వారణావతంబున నాయుధశాలా సమీపంబున లక్షా సర్జరస సమ్మిశ్రంబై ఘృత తైలార్ద్రంబయిన మృత్తికా పుంజంబున నొక్క చతుశ్శాల నవిరళ సంధాధవళితంబుగా నిర్మించి, అందుఁ బాండవుల నుండఁబంచిరి. పరాభిప్రాయ మాయోపాయ ప్రయోగవిదుండైన ధర్మతనయుండు తమ్ములతో నిట్లనియెను.

కం॥ "ఎఱిఁగితిమి దీన తెఱఁగే
మఱి కెఱుఁగని యట్లు గూఢమతి నుండుద మిం

దఱియుఁ బురోచనుకృతకము,
నెఱిసేర్పడు సంతసము వినీతాత్ములమై".

ధర్మజునిశీల మెట్లున్నదో యిందుఁ గమనింపదగును!

విదురునాదేశంబున ఖనకుండనువాఁడు వచ్చి పాండవుల రక్షించుటకు బిలంబు నొకదానిని నిర్మించెను. భీముండా లక్కయిలుగాల్చి అన్నదమ్ములతోఁగూడ బిలంబుఁబట్టి అడవి కేగెను. ఇప్పటి కింకను శ్రీకృష్ణుండు పాండవుల కెట్టి సహాయ్య మును జేయలేదు.

పాండురాజు ధర్మపత్నియగు కుంతీదేవి భోజవంశ మునంజనించెను. అందుచే నామె శ్రీకృష్ణునకు మేనయత్త కావలయును. పౌరవ్యులలోనెల్ల పాండవులే యాదవులకు సన్నిహిత బంధువులు. అధికారమునందున్న కౌరవులు పాండవులను బాధ పెట్టఁదొడఁగిరి. కావున శ్రీకృష్ణునకు వారిపైఁ బ్రేమ మెండయ్యెను. తాము పడుబాము లెల్లఱకును దెల్లంబగుటకు ధర్మజుండు లాక్షాగృహదహనమున కంగీకరించి, తల్లితోడను దమ్ముల తోడను ఏకచక్రపురంబున కేతెంచి, బ్రాహ్మణ వేషంబున నుండుట కియ్యకొనెను. అటనుండి వారు ద్రౌపదీ స్వయం వరమునకు ద్రుపదువీటి కేగిరి.

భారతవర్షమును ధర్మబద్ధముగ నేలఁజాలు మహావీరు నన్వేషించుచుఁ గృష్ణుఁడు పాంచాలనగరంబున కేతెంచెను. అచ్చోనర్జునుఁడుమత్స్యయంత్రముఁగొట్టి ద్రుపదపుత్రినిబడసెను. తత్క్షణమే అచ్చటికేతెంచియుండినరాజులందఱు బీదబాపలుగఁ

గాన్పించుచుండిన ఆపాండవులతోఁ బోరనుంకించుచుండ, శ్రీకృష్ణుండు పాండవుల క్షేమము గోరి వారల కిట్లనియె:

చ॥ పరులకు దుష్కరంబయిన భాసురకార్యముఁ జేసి, తత్స్వయం
వరమున బట్టఁగాఁబడెను వారికుహాయతనేత్రఁ గృష్ణ నీ
ధరణి సురాన్వయోత్తముఁడు; ధర్మవిధిం జెపుఁడయ్య యింక నె
వ్వరికిని జన్నె వీని ననవద్యపరాక్రమము నాక్రమింపఁగన్?

కృష్ణునిచేత నివారితులై రాజపుత్రులు తమతమ దేశంబులకుంజనిరి. బలభద్ర సమేతుండై కృష్ణుండు పాండవులున్న తావునకుఁజని తమ్మెఱింగించి, వారి సేమం బారసి—అర్జునుండు తానార్జించి తెచ్చిన పడతిని తల్లిఆజ్ఞానుసారము అందఱి అన్నదమ్ములతో సమముగ ననుభవించుట కంగీకరించుటఁగాంచి, ఆశ్చర్యనిమగ్నుండయ్యెను. నవయౌవనుండగు వీరాధివీరుఁడు తాను సర్వరాజసమక్షంబున నార్జించి తెచ్చిన త్రిలోకసుందరిని తనతక్కిన అన్నదమ్ములు తనతోపాటుగ భార్యగ ననుభవింతుమన్న దాను లోభమించుకంతైనలేక సమ్మతించిన వ్యక్తి ఎంతస్వార్థత్యాగి! అట్టి ఉదారస్వభావునిరాఁగోవు మహత్తర కార్యములందు ముందుంచుటకుఁ గృష్ణుఁడు నిశ్చయించుకొనెను. పాంచాల యాదవ సాహాయ్యము పాండవులకుఁ బ్రాప్తించుటచే ధృతరాష్ట్రుండు దిగులొంది పాండవులం దోడ్తేర ద్రుపదుపురంబునకు విదురు నంపెను.

వారు హస్తిపురంబున కేతెంచినతరువాత ఆవృద్ధ కురుపతి కృష్ణుండును సకలవృద్ధ రాజులునుంగల సభయందద్ధ

రాజ్యము పాండవులకిచ్చివేసెను. అపుడు ధృతరాష్ట్రుఁడిట్లనియె,

ఆ॥ "సర్వలోకకర్మసాక్షి యీ కృష్ణుండు
సాక్షిగాఁగ మీకు సకలవృద్ధ
రాజులొద్ద నర్ధరాజ్యమిచ్చితిఁ బాండు
రాజ విభవమెల్ల రచణఁ గొనుఁడు"

ఖాండవప్రస్థము నివాసముఁ జేసికొనియుండుఁడని పాండవుల నావృద్ధరాజునియమించెను. అంత శ్రీకృష్ణునిఆదేశముపై ఇంద్రుఁడంపవిశ్వకర్మ వచ్చి సురపురమున కెనయగు పురము నిర్మించి యద్దానికి ఇంద్రప్రస్థమను నామకరణ మొనర్చి చనెను.

అర్జునునియెడ కృష్ణునకు ప్రేమమధికముగ నుండుటచే, బలదేవాదు లెఱుంగకుండ సుభద్రార్జునులకు వివాహంబు సేయ సమకట్టి పశుపతి పూజామహోత్సవవ్యాజంబున నఖిల యాదవ భోజాంధక వృష్ణి వరులతోఁ గృష్ణుండంత ద్వీపంబునకుంజనియె. యతిరూపంబున ద్వారకకేతెంచియుండిన అర్జునుంకు కృష్ణుఁడు పంచిన మార్గం బనుసరించి సుభద్రం దోడ్కొని పోవుచుండ పృథశ్రివసుఁ డాదిగాఁగల యదువీరులా యతిరథంబునకెదురై నిలిచిరి.

తనకు సుభద్రి తేరుగడపుచుండ, నమితమగు యాదు సైన్యముల నోడించి అమరేంద్రిసుతుఁ డనిలో లబ్ధవిజయుఁడై పరమోత్సాహంబున నరిగెను.

ఇట్లగుటచే, సుభద్ర నర్జునుఁడు గైకొనుట యాదవు లిష్టపడలేదనుట కాదా!

తరువాత నర్జున సమేతుండై కృష్ణుండు వెడలి ఖాండవ వనము దహింపఁజేసెను. ధృతరాష్ట్రుఁడు పాండవుల కిడిన భాగమందు ఖాండవవనముండెను. ఆసుభిక్షమగు ప్రదేశ మొకప్పుడు దేవేంద్రుని స్వాధీనమందుండుటచే నాతఁడు కృష్ణార్జునులతోఁ బోరనేతెంచెను. కాని కృష్ణార్జునులింద్రునోడించి ఆతనికడనుండిన దివ్యాస్త్రంబులఁ గైకొనిరి. అర్జునుం డాదవానలమున మ్రంద నుండిన దానవవిశ్వకర్మయైన మయుని రక్షించి యాతనివలన నొక దివ్యసభయు, భీముని ఉపయోగార్థము గదయుఁబడసెను. వాఁటినుండి దానవవిశ్వకర్మయైన మయుఁ డనుచరసమేతముగ నార్యావర్తము వీడి సముద్రాంతర భూములకు వలసపోయెను. ఈతని సంతతివారే మధ్యఅమెరికాదేశమునందు నూతన నివాసములేర్పఱచుకొని ఎక్కుడుగ నభివృద్ధిఁ జెందిరి. వారి పట్టణములకట్టడపురీతులు, దేవళములపైనున్న చిహ్నములు, నేఁడనేకములు గాన్పించుచున్నవి.*

వరుణదేవునిచే వెంటాడఁబడిన అసురులు పశ్చిమదేశంబులకేగిరి. కృష్ణార్జునులచే వెంటాడఁబడినవారు (కాలకేయ, నివాతకవచులు) హిందూమహాసముద్రమందలి దీవులకును, బిమ్మట శాంతమహాసముద్రము దాఁటి అమెరికాదేశమునకును వలసపోయిరి.

మునిప్రేరితుఁడై ధర్మజుఁడు పితృప్రీతిగ రాజసూయముఁ జేయనుద్దేశించి, తనకోర్కె శ్రీకృష్ణునకు విన్నవించిన నాతఁడు:

* The ancient Maya civilization of Central and South America.

"పరశురాముచే ధాత్రి యపగతక్షత్రింబయ్యె. అంతనుండియైల వంశంబును నిక్ష్వాకువంశంబునుందక్కఁ దక్కినక్షత్రియవంశంబు లెల్లఁగృత్రిమంబులయ్యె; యయాతిభోజవంశంబులు చతుర్దిశలను వ్యాపించె; అయ్యవి తరువాత జతుర్దశవంశంబు లయ్యె. ఇట్టి సకలక్షత్రియవంశంబులఁ జయించి అసురపక్షపాతియగు జరాసంధుండున్నవాఁడు. వానితోడి వైరంబు బలవంతంబగుటం జేసి మేము మధుర నుండనోల్లక కుశస్థలంబునకువచ్చి రైవతక పర్వతంబున ఘనంబుగా దుర్గంబు నిర్మించుకొని భవదాశ్రమం బున సుఖంబున్నవారము.

చ॥ ఖలుఁడు బృహద్రథాత్మజుఁడు గర్వితుఁడై మహిలోని రాజులం
బలుకుఱఁబట్టి తెచ్చి చెఱఁబెట్టి గిరివ్రజ మన్పురంబులోఁ
బొలయక నిత్యమొక్కొకని సూనరిబోలె వధించి నేనుమున్
బలిమియుసేర్పడం గడఁగి భైరవ పూజయొనర్చు నుగ్రుఁడై.

అట్టివానింజంపినంగాని సామ్రాజ్యవిభవము మీకు సుస్థిరంబు కానేరదు." అని యనియె.

ఆమాటలువిని సమబలుండగు భీమసేనుండలిగి, యన్న కిట్లనియె:

కం॥ "ఈ హరికరుణయు నర్జును,
సాహాయ్యముఁ గలుగ నీ ప్రసాదమున జగ
ద్ద్రోహు జరాసంధు మహా,
సాహసు వధియింతు నుగ్రసంగ్రామమునన్."

భీముండుగాని యొండొరులు మాగధుని వధియింపం సమర్థులు గారని కృష్ణుఁ డెఱుంగుట ధర్మజున కిట్లనియెను:—

చ|| "విను మగధేశ్వరుఁ డెపుడు విప్రజనావళియందు భక్తితోన్
వినయముఁ గల్గి యొగ్గియును వేఁడిన నో కృప చేయ కిచ్చుఁ గా
వునఁ బవనార్జునుండు పవనోద్భవుఁ డేనును బ్రాహ్మణాకృతిం
జని రణభిక్ష వేఁడిన వశంవదుఁడై యతఁ డిచ్చుఁ గోరికల్"

ధర్మజు ననుమతి భీమార్జునుల వెంటఁగొని బ్రాహ్మణ వేషంబులు దాల్చి గిరివ్రజంబు సొచ్చి జరాసంధునిచే నతిథి పూజలందు కృష్ణుఁ డమ్మగధనాథున కిట్లనియెను:

"* * * * * * నా-
కీవతె రాజభిక్ష యితఁ డింద్రతనూభవుఁ డే నుపేంద్రుఁడన్,
బావని యీతఁ డింతొకని బైకొని యొక్కటి పోరఁగాఁదగన్."

కృష్ణునిపలుకులకు జరాసంధుండు నవ్వి "మామక దోర్బలశక్తికిఁ దుల్యుఁ డీమరుత్సూనుఁడు, వీఁడె నెదుర్తు" నని చెప్పి, బురివెలికేగి యచట సమతలభూమిని భీమునితో గదా యుద్ధంబునకు గడంగెను. "ఇవ్విధంబున వారు పోరుచుండ, కృష్ణుండు జరాసంధుని జన్మమరణ ప్రకారంబు లెఱుంగుటం జేసి సమీరనందనుండు చూచుచుండ నొక్క శాఖాగ్రంబు రెండుగాఁ జీఱివైచిన, నతండు నాకీలు దెలిసికొని మాగధునిం బడఁ ద్రోచి వానిపదంబు పదంబునం ద్రొక్కి బాహుయుగళంబున రెండవపదంబు పట్టి మస్తకపర్యంతంబు వ్రయ్యలుచేసి చంపె. అప్పుడు శ్రీకృష్ణుఁడు జరాసంధసుతుండైన సహదేవుని మగధకు పట్టాభిషిక్తుఁగావించి, గిరివ్రజమునుండిన రాజుల బంధవిముక్తులఁ జేసి వారల కిట్లనియె:

ఉ॥ "మీరలు ధర్మముం దగవు మేరయుఁ దప్పక భూజనాళిఁ జెం
పారయ సౌఖ్యసంపదలు నందగ బ్రోచుచు భూరియజ్ఞముల్
గౌరవవృత్తి మత్పరముగా నొనరించుచు మామకాంఘ్రి పం
కేరుహముల్ భజించుచు నకిల్బిషులై చరియింపుఁ డిమ్ములన్."

స్తూత్రప్రాయముగ శ్రీకృష్ణుఁడు తన జీవితాశయముల నిందుఁ జెప్పియే యున్నాఁడు.

ధర్మజుఁడు రాజసూయయాగంబు ప్రారంభించి, వచ్చినవారి యందగ్రపూజార్హు లెవ్వరని సదస్యులనడిగిన, వారందఱును శ్రీకృష్ణుఁజూపిరి. అంత:

కం॥ "దంపత్కాంచన రుచితో,
దంచిత వస్త్రముల నూతనార్క ప్రభలన్
మించిన రత్నములం బూ
జించెన్ ధర్మజుఁడు కృష్ణు జిష్ణు సహిష్ణున్."

ఈ రాజసూయయాగంబువలన యుధిష్ఠిరునకు సార్వభౌమతయును శ్రీకృష్ణునకార్యావర్తరాజలోకంబున నద్వితీయ పురుషుఁడను మహాగౌరవమునుం గూడ నేకముహూర్తంబునఁ బ్రాప్తించెను. యుధిష్ఠిరునవివేకమువలన తరువాత పాండవులకు కొన్నిదురవస్థలు ప్రాప్తించెనేగాని, రాజసూయయాగముతో శ్రీకృష్ణు సంకల్పములు నెఱవేఱె ననియే చెప్పనగును.

జరాసంధుని ముఖ్యసేనాపతియు, స్నేహితుండునునైన చేదిపతియే శిశుపాలుఁడు, శ్రీకృష్ణునకుజరిగిన గౌరవముచూచి సహింపలేక, పీఠముడిగ్గి నిలచి సభాసదులంజూచి యిట్లనియె:

తే॥ "బరగమున్న యయాతి శాపమునఁజేసి,
వాసికెక్కఁడు యీ యదువంశమెల్ల
బ్రహ్మ తేజంబునెల్లఁ గోల్పడిన యితఁడు,
బ్రహ్మ ఋషి సేవ్యుఁడగునె గోపాలకుండు?"

అమ్మాటలకలిగి ముకుందుం డాగ్రహంబునలేచి తటాలున శిశుపాలునిపైఁబడి దన చక్రంబున దునిమెను.

శిశుపాలుని సంహరించుటచే సాల్వుఁ డలిగి మయ నిర్మితమైన 'సౌభక' మను కామగమనముగల తన వ్యోమ యానముతో ద్వారకపైఁబడి అద్దానిఁ గొల్లగొట్టెను.

సాల్వుని సౌభక విమానమిట్లు వర్ణింపఁబడియున్నది:

సీ॥ *"ఒకమాటు నభమున బ్రికటంబుగాఁదోఁచు,
నొకమాటు ధరణిపై నొయ్యనిలుచు
నొకమాటు శైలమస్తకమున వర్తించు,
నొకపరి చరియించు నుదధినడుమ."

రాజసూయమునుండి వచ్చిన తరువాత కృష్ణుఁడు కల కాలము సాల్వునితోఁ బోరినఁగాని వానిసంహరించుట సాధ్యము కాలేదు. కృష్ణుఁడు సాల్వునితో నిరంతర యుద్ధములనిమ

* [దీనినిబట్టి ఆనాఁటి విమానములు జలస్థల భేదములేక వర్తించుచుండి నట్లు కాన్పించును. ప్రస్తుతము మనము గాంచుచుండిన విమానములు Sea Planes, Land Planes అని రెండువిధములుగనున్నవి; కావున నవీన శాస్త్రజ్ఞులు సౌభక విమానమువంటి దానిని నిఁక కనుగొనవలసి యున్నట్లు తోఁచెడిని.]

గ్నుఁడై యున్నపుడే ధర్మజుఁడు జూదమాడి, రాజ్యము సర్వ
స్వము కౌరవులకోడి, కానల కేగెను.

మయసభ చూడ నేగినప్పుడు, అచ్చోనుండిన చిత్ర
విచిత్రంబులఁగాంచి దుర్యోధనుండు మతిచెడి అవివేక కార్యంబు
లాచరింప మొదలిడుటచేఁ గొందఱాతనిఁజూచి నవ్విరి. అందు
కాతఁడు కనలి మయసభ తన్నగౌరవించుటకే కల్పింపఁ
బడినదని తలంచి యుధిష్ఠిరు నెట్లైన పరిభవించి వాని రాజ్య
మపహరింపవలెనని సిద్ధసంకల్పుఁడై యుండెను. 'ధర్మజుని జూద
మాడ బిలిచినచో నీకోర్కెలీడేర్తు'నని శకుని యనెను. ఆనాఁడు
రాజులలో జూదమాడుట తప్పుకాదు. కావున తమ్ముని ఆహ్వాన
మంగీకరించి ధర్మజుఁడు దుర్యోధనుతో జూదమాడఁబోయెను.
ధర్మమార్గానువర్తియగు నాపాండవాగ్రజుఁడు శకుని పన్నిన
వలలో చిక్కుకొని రాజ్యము సర్వస్వమేగాక, భార్యా
సోదరసమేతముగ తాను కౌరవులకుదాసుఁడు కావలసివచ్చెను.
పాండవులనగౌరవింపదలఁచి దుర్యోధనుఁడు జూదమునదాస్యము
నకు పాల్పడినపాంచాలిని కురుసభకు తెప్పించెను. వృద్ధరాజున
కీవార్త వినవచ్చినంతనే ఉపద్రవములు సంభవించునను భీతిచే
పాండవులను దాస్యవిముక్తులుగఁజేయనాజ్ఞయిడి, ద్రౌపదికి కురు
రాజ్యమం దర్థభాగ మొసంగెను. పాండవులు రాజ్యభోగము
లనుభవించుటఁ జూచి దుర్యోధనుఁ డోర్వలేక ధర్మజుని
మఱల జూదమునకు బిలిచి రాజ్యముంగొని పదమూడువత్స
రములు రాజ్యభ్రష్టులైయుండ నియమించి వారిని పంపివేసెను.

మాయజేసి జూదమాడి వంచనచే నోడించి కౌరవులుపాండవుల రాజ్యభ్రష్టులఁజేసియడవులకుబంపిరని విని కృష్ణుం డుపప్లావ్యంబునకు బాంచాల యాదవ వృష్ణిభోజాంధకకేకయాదులెల్ల వెంటరాఁజని, వారిదురవస్థఁగని పాండవయశోభివృద్ధికిఁ దా నొనర్చిన ప్రయత్నములెల్ల నిష్ప్రయోజనంబులగుటకు విచారించి దుర్యోధనాదులమోసఁ గనలి తనవారికిట్లనెను:

క॥ "అవినీతుల దుష్టులఁ గౌ
రవ నాశులఁజంపి ధర్మరాజును సుగుణ
ప్రవరున కొనరింతునా యీ
యవనీ రాజ్యాభిషేక మభిజిత్కీర్తిన్."

"అయ్యవసరంబున నేను మీయొద్దనుండమింజేసి యిట్టి దుర్వ్యసనంబు సంభవించె.*ఏను సముద్రతీరంబున సాల్వుతోఁ బదినెలలు యుద్ధంబుసేసి వాని వధియించు పొంటె నక్కడ మసలితి" అని పాండవులనోదార్చి వారి బాలుర వెంటఁగొని ద్వారకకేతెంచెను.

సత్యభామతోఁ బాండవులయొద్దకువచ్చిన శ్రీకృష్ణుఁడు యుధిష్ఠిరునకు ఆర్యావర్త సామ్రాజ్యాధిపత్యమిచ్చుటకు తన నిశ్చయ మిట్లెఱింగించియే యుండెను:

---

*సర్వజ్ఞుఁ జూదముగాని, ద్రౌపదీపరిభవ ప్రయత్నములుగాని యెఱుఁగని కృష్ణునకు ద్రౌపదీ వస్త్రాపహరణ గాథామాత్ర మెట్లెఱుంగ నయ్యెనో!

చ. "దమమును సత్యయుక్తియును ధైర్యనిరూఢియు నిత్యతృప్తియున్
శమమును నీకు నైజములు సమ్మతి నర్థపశంబు గామ లో
భములును జొంద పట్లుగుటఁ బార్థివకుంజర ధర్మరాజనా
మమునఁ ద్రిలోకపూజ్య మహిమం బొగడొందెద వెల్లకాలమున్.

ఈ యంధకవృష్ణిభోజకురాన్వయభూపతు లెల్లరు నీ యిచ్చవచ్చినట్లు ప్రవర్తింతురు."

పాండవులంతటి పరమయోగ్యులే వారిచెంత కృష్ణుండు లేకుండిన కాలమందు దుర్వ్యసనంబులకు బాల్పడుచుండిరి. ఆర్యావర్త రాజలోకంబానాఁడెట్టి నికృష్టదశయందుండెనో దీనినిబట్టి యెఱుంగనగును.

శ్రీకృష్ణుండేగిన తరువాత అర్జునుఁడు శివునిగూర్చి తపం బాచరించి ఆతని మెప్పించి పాశుపతాది దివ్యాస్త్రంబులఁ బడ సెను. ఇంద్రాది దేవతులుకూడ పాండవశిబిరంబున కేతెంచి తమకడనుండిన దివ్యాస్త్రంబుల నర్జునునకిచ్చి వానిని దేవకార్యా ర్థమంపుమని ధర్మజు వేఁడిరి. అర్జునుఁడు దేవేంద్రు వెంటనేగి దానవ వీరులగు నివాతకవచులఁజంపి దేవతల ఋణముదీర్చివచ్చెను. వనవాసంబుననున్న కాలమువృథపుచ్చక పాండవులు రానున్న మహాభారతయుద్ధమునకు కావలసిన సాధన సంపత్తి నార్జించు కొనుటకే ఉపయోగించుకొనిరి. తమ్ము పరిభవింపనేతెంచిన దుర్యోధనుఁడు గంధర్వప్రభునిచే గొంపోఁబడినప్పుడు ధర్మజుఁడు తమ్ములనంపి వాని విడిపించి పౌరవ్యుల గౌరవమునకు భంగ

పాటొదవకుండ కాపాడెను. బుద్ధిమంతులు కష్టములకు క్రుంగి కృశింపక, తమపురోభివృద్ధికి నద్దానినొక సోపానముగ చేసుకొన ప్రయత్నింతురు.

గీ॥ "ధార్తరాష్ట్రుల చర్యకుఁ దలఁకకుండ
దారుణారణ్యవాసంబు మీరివచ్చి
పాండురాజ కుమారులు వఱలుచుండ్రి
అగ్ని సంతప్త కాంచనంబట్లు మిగుల॥" (ఆధునికము)

పాండవులు పదమూఁడగు నేటఁ దా మొనర్పవలసిన యజ్ఞాతవాసదీక్ష మత్స్యభూపతియగు విరటుపురంబున గడుప నిశ్చయించిరి. ద్రుపదుని తరువాత విరటుఁడే ఆర్యావర్తమం దధికబలవంతుఁడు. తనకు సింహబలుని సహాయముండుటచే దుర్యోధనునిసైత మీవిరటుఁడు లెక్క సేయకుండెను. తమ సత్ప్రవర్తనమువలన బాండవులు విరటుని యభిమానమార్జించిరి. కౌరవులు విరటు నగౌరవించుటకు సర్వసైన్యసమేతముగ నేతెంచి మత్స్యాధిపుని గోవులఁ గొంపోయినపుడు మారువేసముననున్న అర్జునుఁడేగి కౌరవయోధుల పరిభవించి గోగణంబుల మఱల్చుకొనివచ్చి విరటుని కృతజ్ఞతకుఁబాత్రుఁడయ్యెను. అందుచే బాండవులను గుర్తెఱింగిన తరువాత విరటుఁడు తన కూఁతు నర్జుననకీయ సంకల్పించినట్లు తెలుఁప, అర్జునుఁ డా బాలికను అభిమన్యునకు భార్యగఁగైకొని, విరటుని ఆప్త బంధునిగఁ జేసుకొనెను.

ఉత్తరవివాహమునకు పాండవపక్షమువారగు రాజులందఱునువచ్చిరి. శ్రీకృష్ణుఁడును బలరామ సాత్యకిసమేతముగా నచ్చోటికి విచ్చేసెను. ఆసభయందు కృష్ణుఁడు రాజలోకంబు నవలోకించి, తమకు పైతృకంబగునట్టిదియు, రాజసూయంబున నలవఱచికొన్నట్టిదియు, ధార్తరాష్ట్రులు వంచనమెయి గైకొన్నట్టిదియు నగు రాజ్యంబు పాండవులకు పునస్సంపాదన సేయుకార్యంబునఁదోడ్పడవలెనని బోధించెను. విరాటద్రుపదులు తప్పకసాయపడుదుమని బాసయిచ్చిరి. కృష్ణుఁడుమాత్రము తానెట్టిసహాయముచేయనుండెనో స్పష్టీకరింపలేదు—బలదేవుఁడు కౌరవపక్షపాతిగను, సాత్యకి పాండవపక్షపాతిగను ఉండుటచే శ్రీకృష్ణుఁడప్పటికిఁ దటస్థుఁడై యుండవలసివచ్చెను. రాక్షస మార్గమున సుభద్రను అర్జునుఁడు కొంపోయిన నాఁటనుండియు యాదవులకు పాండవులపై పగ మెండయ్యెను. అట్లగుట కృష్ణుఁడు బహిరంగముగ పాండవపక్ష మూనుటకు జంకుచుండెను. ద్రుపద, విరాటుల నగ్రేసరులుగఁజేసినచో వారెక్కుడు శ్రద్ధతో పాండవపక్షమూనిపోరుదురు. కృష్ణునకు యాదవులలో పలుకుబడియు గౌరవమును నానాఁటికి సన్నగిలుటనుగాబోలు, 'విధిలేకుండిన తుట్టతుదకు తనసహాయ్యము పాండవులు వేఁడుదురుగాక' యనిచెప్పి శ్రీకృష్ణుఁడన్నదమ్ములతో నటనుండి కదలిపోయెను.

తమబలసంపత్తుల అభివృద్ధికిఁదోడ్పడని కార్యములయందు కృష్ణుఁడు జోక్యముకలిగించుకొనుటకు యాదవు లంతగ నిష్టపడ

కుండిరి. తత్కారణమున శ్రీకృష్ణుని లోకహితైకకార్యములు కూడ వారల కంతగ రుచింపకుండెను. అంతకన్న గూదవృల దుశ్చేష్టలు కృష్ణునకు రుచింపకపోయి యుండును. పెరటి చెట్టు సత్త్వముగ్రహించి ఔషధముగ నుపయోగించువా రరుదు గదా !

మహాభారత యుద్ధము

(i)

— యుద్ధ ప్రయత్నములు —

———:o:———

ఏనాఁడు పాండవేయులు విరటుపురంబున నుండినట్లు దుర్యోధనునకు స్పష్టపడియెనో ఆనాఁటినుండియునాతఁడు యుద్ధసన్నద్ధుఁడు గాఁజొచ్చెను. యుధిష్ఠిరుఁడుకూడ, ద్రుపదపురోహితుని దుర్యోధనుకడకు, 'రాజసూయయాగము నాఁటికి దమకున్న రాజ్యభాగమియ్యవలసిన'దనివర్తమానమంపియు, సైన్యముల సమకూర్పప్రారంభించెను. దీనిఁబట్టి యిరువాగులవారును యుద్ధమునిశ్చయించుకొనినట్లు కాన్పించును. ఆర్యావర్తమందలి రాజుల సహాయముకోరి ఉభయపక్షములవారును దోడాసవడి దూతల నంపుకొనిరి.

సకలరాజన్యసామాన్యంబుగా గోపాలదేవుపాలికి దూతంబుచ్చుట తగవుగాదని తలంచి సుయోధనుండు తానే స్వయముగ నాతనిపిలువనరిగెను. ధర్మజుఁడు అర్జును నంపెను. వారిరువురు నొకేసమయమున ద్వారకకే తెంచిరి. దుర్యోధనుఁడు కృష్ణుని తనకుసమానుఁడుగభావించెను. ఆతనికడనుండిన పశుబలమునాసించి, యుద్ధమునకాహ్వానింప నేతెంచెను. ఇంక నర్జునుఁడన్ననో శ్రీకృష్ణుని బుద్ధియు తమ సమస్తపురుషార్థమ్ములకు

మూలమ్ముగా భావించి యాతని భగవంతునిగా నెంచి పూజించు చుండెను. ఏ రికువ్రర మనోభావంబులఁ గుర్తెఱింగియే కృష్ణుఁడు తనకున్న పశుబలమును ఆత్మబలమును రెండుభాగములుగ నొనర్చెను. ఆభాగము లెవ్వియన:- "ఊరక నిరాయుధ వ్యాపారతమైనుండు నేనొకవైపునను, ఇంకొకవైపు:

"నాపాటిరియె పదివేవురు
గోపాలురు గలరు సమరకోవిద బాహా
టోపాభిరామమూర్తులు
చాపాద్యాయుధ కళావిశారదచిత్తుల్."

అని కృష్ణుఁడు పలికి, వారలతో ఎవరికి కావలసిన భాగమును వారుగైకొనుఁడని చెప్పెను. బలరామాదులకు శ్రీకృష్ణుఁడు పాండవపక్షపాతిగ కాన్పింపకుండుటకై కౌరవులకుకూడ కొంత బలమిచ్చి పంపెను. ఇదిగాక అపరిమితబలగర్వితులైయున్న యాదవులకడ తనమూలబలమగు 'నారాయణగోపాలు' రుండిన తనయనంతరము యాదవులు లోకోత్పాతముల గలిగింతురను భీతిచే తనమూలబలము కౌరవులకిచ్చి అద్దానిని అర్జునుచే నిర్మూలింపఁజేయ నిశ్చయించియుండనోపు. ఆత్మబలమధికమైన శ్రీకృష్ణునకు పశుబలముపై విశ్వాసమంతరించుటచే నద్దాని నాసించిన దుర్యోధనునకిచ్చి, నిరాయుధవ్యాపారతనుండ నిశ్చయించిన తాను రణంబునకు సహాయుంబొల్లని అర్జునుచెంతఁ జేరెను. అర్జునకోర్కెదీర్చుటె తనవ్రతంబగుటను, దానిడిన భాగంబులలో, చిన్నవాఁడను మిషమీద అర్జునుఁడే మొదటవం

తెత్తుకొమ్మనెను. మహాబుద్ధిమంతుఁడయ్యును శ్రీకృష్ణుఁడు ప్రమాదమువలన ప్రళయము సంభవించునను భీతిచే కావలయు నేదోకారణము కల్పించి, అర్జునుడే మున్ముందు వంతునెత్తుకొన వలెనని సిద్ధాంతపఱచెను.

శాపదగ్ధక్షత్రియవంశమగు యదువంశమున నుద్భవించిన వీరుఁ డగుటచేకాఁబోలు శ్రీకృష్ణుని సుయోధనుఁడు దనపక్షము నకు గైకొనుట కంతగ నాసింపలేదు. కృష్ణునియెడ నాతనికి భక్తికన్న భయ మెక్కుడుండెను. శల్యునితో:

క॥ సత్త్వసరస్వతి వగు మా,
చిత్త్వ విశారదము నీదుచిత్తము నియమా
దాత్త్యంబు మెఱయ నాకున
మాత్యుఁడవై ప్రాని నసెళ్ళు మత్సైన్యంబున్॥

అని యాతనిఁ బ్రార్థించిన దుర్యోధనుఁడు, శ్రీకృష్ణునికడ నప్పు డిట్లనియె:

ఉ॥ "　*　*　*
* గయ్యము సేయువగన్ సహాయముం
గోరి ధవత్సికాసమువకుం జనుదెంచితి *　*　* "

అనిమాత్రమే సెప్పెను—దుర్యోధనుఁడు, శల్యునితో

ఉ॥ "　*　*　*　నీవు స
మ్మానము సేసి నాకిటు లమాత్యుఁడవైనపదంబు కంటె మే
లై నుతికెక్కు కోర్కి రొటులారసి చూచివనొండు గల్గునే!"

అని పలికెను.

అట్లగుట దుర్యోధనునకు శల్యునిపైనున్న గౌరవమున సహస్రాంశమైనను కృష్ణునియెడ లేనట్లు స్పష్టపడుచున్నది కాదా!

> "వివిధోపాయ పరాయణుండు, రిపువాక్యార్థాపహారక్రియా
> ప్రవణోద్యోగుఁడు మంత్రరక్షణ కళాపారీణ్యగణ్యుండు దై
> ర్యవివేకాది గుణోత్తరుం డఖిల విద్యాజాల సంవేది * *"

అని పెక్కురుపెద్దలచే కొనియాడఁబడిన శ్రీకృష్ణుని మాహాత్మ్యము గుర్తెఱుంగలేని దుర్యోధనుని రారాజపదవి యందుంచినచో నార్యావర్తమునకు భావిభాగ్యము సమకూడు టెటులు? మానవకోటికి మంగళముచేకూర్పనవతరించిన మహాపురుషుఁడు, దుర్యోధనాది దుష్టచయము వారియాటల నార్యావర్తమున సాగనిచ్చునా!

దుర్యోధనుఁడు శిశుపాల నరక, జరాసంధ, కంసులంతటి— లోకకంటకుఁడు కాకుండినను, అతఁడు రజోగుణప్రధానుఁడై సాత్త్వికులగు పాండవుల కెన్నియో యపకృతులు కావించుటచే శ్రీకృష్ణుఁడు, ఆసురవృత్తుల నడంచినటులనే, దుర్యోధనాది దుష్టనృపులను లోకకల్యాణముకొఱకు నిర్మూలింప నిశ్చయించుకొనెను.

(ii)

— ద్రుపదపురోహిత దౌత్యము —

పాండవులకడనుండి కౌరవులకడ కిరువురును, కౌరవులంప పాండవులయొద్ద కిరువురును దూతలుగ వచ్చిరి. వీరిని మనవారిపుడు రాయబారులనియు వారొనర్చిన దౌత్యమును రాయబారమనియు ననుచు, పెంచి పెద్దగ్రంథముల వ్రాయుచున్నారు. అందు మొదటివ్యక్తి ద్రుపద పురోహితుఁడు. ఈతఁడు హస్తినాపురమునకేగి పాండుభూపాలు ధరణీ భాగమంతయు పాండవులకీవలసినదని నుడివెను. దౌత్యమొనరింప బయనమై వెడలిన పాంచాలపురోహితుఁడు మగిడి రాకపూర్వమే పాండవులు ఆర్యావర్తమునందలి సకలరాజన్యులకడకును తమదూతలనంపి రాఁబోవు కయ్యమునకు వారివారి సహాయ్యమపేక్షింప మొదలిడిరి. ప్రబలవిరోధియగు ద్రుపదునిపురోహితుఁడు దూతగ వచ్చుటచే కౌరవులలిగి యుద్ధాది కయ్యమునకు కాలుద్రువ్వుటగ భావించిరి. అంతకుదోడుగ, ద్రుపదపురోహితుఁడు 'శ్రుతికిఁబరుషంబైన' వాక్యముల ధార్తరాష్ట్రుల నాడిపోసెను. ఇంతలో పాండవులొనర్చుచుండిన సమరసన్నాహంబుల వార్తాహరులనుండి వినిన దుర్యోధనుండు పాండవులకు సూదిమొన మోపునంత నేలనైన నీయకుండుటకు నిశ్చయించుకొనెను.

(iii)

— సంజయ దౌత్యము —

భీమసేనాదులవలన తనపుత్రుల కపాయముశంకించియు, సుయోధనుని సంకల్పము మరల్ప నసమర్థుండగుటను, ధృతరాష్ట్రుఁడు సంజయుని పాండవులకడకంపి వారల నెటులేనియు కోపోపశాంతులఁగావించి రణమునకు రాకుండఁజేయ బ్రయత్నించెను. 'శుష్కప్రియములును, శూన్యహస్తములును' అగు సంజయుని దీర్ఘసంభాషణ విని ధర్మజుఁడు భీతినొంది కావలయు, తమకు ఇంద్రప్రస్థముగాని యింకే యూరునుగాని యొసంగినఁ జాలునని యనఁబోయెను. అప్పటున నచ్చో విచ్చేసియున్న కృష్ణుఁడు ధర్మజుని చిత్తవృత్తి గ్రహించి పాండవుల బలసంపత్తిని పొగడెను. యుధిష్ఠిరుఁడంతఁ గొంత శాంతచిత్తుఁడై కలఁతఁదేరి దనరాజనీతి నైపుణ్యమంతయుఁ దెల్లమగునట్లు సంభాషింపుచు కౌరవసామ్రాజ్యమున కాయువుపట్టులుగ నుండిన కుశస్థలి, వృకస్థలి, మాకంద, వారణావతంబులును ఇంకనైదవదిం కెందైనను సరియే, యీయవలసి యుండునని చెప్పెను- పాండవులు ప్రాణతుల్యముగ ప్రేమించిన ఇంద్రప్రస్థమును ఇప్పటున యుధిష్ఠిరుఁడు విడిచిపుచ్చుటచే తననిర్మోహత్వము వెల్లడించెను.

అనుద్దిష్టముగనాతఁడా ప్రదేశములనాశించియుండ లేదు. పాండ్రక వాసుదేవునితో శ్రీకృష్ణుఁడు పోరచేతెంచిన సందెఅంగి కర్ణుఁడు యాదవులనోడించి గైకొనినది కుశస్థలి. ఆనాఁటిది కర్ణుని

యనుభవముననుండెను. కుశస్థలికోల్పోవుట కృష్ణుని ప్రక్కలో బల్లెమట్లు మెలఁగుచుండెననియనఁదగియేయున్నది. మాకందియు పాంచాలురపట్ల నట్టిదియే. ద్రుపదునోడించినప్పు డాతనివలన కౌరవులు నష్టపరిహారముగ పుచ్చుకొని ద్రోణునకిచ్చియుండినది మాకంది. వృకస్థలి, వారణావతములు పేర్కొనుటచే పాండవులు తాముబడినబన్నములు—అనగా,విషభోజనము; లాక్షా గృహదహనము— మరువలేదని తెలియఁబఱచిన ట్లయ్యెను. ఇంక నైదవది ఎచ్చోటనుండినను సరే యనుటలో తమపడిన బన్నములు సర్వదేశ విఖ్యాతములనికూడ నుద్దేశించి పలికె ననియననగును.

తమపక్షమూని వచ్చిన యాదవులకును పాంచాలురకును సంతోషము కలిగించుటయేగాక, తానడిగిన ప్రదేశముల నిచ్చినచో, నయ్యవి కౌరవవీరులగు కర్ణ, ద్రోణ, కృపుల కెంతయో ఖేదము గలిగించి వారిని దుర్యోధనుపక్షము వీడజేయునని ధర్మజుఁడుద్దేశించి యుండెను. ధర్మజు మతము బాగుగ గుర్తెఱింగియే కానోపు శ్రీకృష్ణుఁడు పాండవదూతగ కౌరవసభ కేగినప్పు డన్నిటికన్న భేదోపాయంబునే యెక్కుడుగ నుపయోగించి కౌరవులలో కలతల జనింపఁజేసి మఱలివచ్చెను.

అడిగినదిమాత్ర మల్పమే. అర్ధరాజ్యమునకు బదులు మూరుమూలలనుండిన ప్రదేశములఁగోరెను. కాని వానినొసంగ దుర్యోధనుఁడు సంసిద్ధుఁడైనపుడు కొంప లంటుకొనును. కౌరవ

సామ్రాజ్యమున కలతలుజనించినంత, సామ్రాజ్యము గుభిల్లునఁ గూలును-ఇంతకును, సంజయుఁ డెవరు? దూత. అతనిపలుకుల వలన కార్యము కొంతయైనఁ జక్కఁబడలేదుగాని, కౌరవులకు క్రౌర్యముమాత్రము హెచ్చెను. శ్రీకృష్ణునకు కావలసినదిగూడ నింతియే !

కాని ధర్మజుఁడు శ్రీకృష్ణునితో చెప్పినట్లు:

క॥ నమ్మెలుఁగు చెదరి తెలుఁగుదు,
నెమ్మియెఱుఁగు వర్షసిద్ధి నెఱి యెఱుఁగుదు, వా
క్యమ్ముల పద్ధతి నెఱుఁగుదు,

* * * *

ఇట్టిఁ దగుటనేగద యీ కార్యనిర్వహణార్థము గురుసభకు యుధిష్ఠిరుఁడు కృష్ణు నంపవలసివచ్చెను.

(iv)

— శ్రీకృష్ణుని దౌత్యము —

తరువాత శ్రీకృష్ణుఁడు పాండవుల రాయబారిగ కురు సభకేతెంచెను. దుర్యోధనాదులు తనమాట వినరని నిశ్చయముగఁ గృష్ణుఁడెఱుంగును-వారినట్టి స్థితికిఁ దెచ్చిన పిమ్మటనే, తాను పాండవులపై నిందఁబొవుటకు రాయబారము పేరిట హాస్తినాపురమున కేతెంచెను-పాండవులకు మాత్రము ధర్మజుని మతము ననుసరించి, యుద్ధముచేయకుండగనే రాజ్యముపాలు రాఁ బట్టుకొనవలెనను కోరికయుండెను. వారు మాత్సర్యము వీడి గతములను మరచిపో నిశ్చయించుకొనిరి.

తే॥ "అలవి యెఱుఁగక ధార్తరాష్ట్రులు గడంగి
ముమ్మ బజేచిన పాటులు మానసమునఁ
జవులఁబెట్టిన విత్తుల చందమొంది,
యంకురింపక చెడిపోయె నంబుజాక్ష."

క॥ "కడవఁగ నోకళ్లు పసరము
నడిచిన నొక్కళులఁ బెయ్య నడువపలయునే
చెడుతెరు వాకౌరవ్యుల
కడనిలుమంగాక మనకుఁ గ్రౌర్యంబేలా!"

అనుమతము ననుసరించి పాండునందను లుండిరి; కాని కృష్ణుఁడు మాత్రము, వృకోదరుండును, వివ్వచ్చుండును తోడు

గాఁగ దురాత్ములగు గౌరవుల రూపుమాపి ఆర్యావర్తమునం తకు ధర్మజునిబట్టముగట్ట నిశ్చయించుకొనియుండెను. అందునకు జనవంద్యుఁడగు ధర్మసుతుని యాజ్ఞ అవసరము. 'పాండవ కౌరవుల్ గలసి పాలును నీరును బోలెనెమ్మిమైనుండఁ' జూచిన ధర్మజుఁడు కులక్షయకార్యమున కనుమతించునా? కాని కృష్ణుఁడు మాత్రి మెట్టులనైన రిపుక్షయంబుఁ జేసి పాండు కుమారుల నార్యావర్తమున నధిక విభవోపేతులఁ జేయ నిశ్చయించెను. రాజసూయమునాఁటి కార్యావర్తమున నిరంకుశుఁడుగ నుండిన జరాసంధుని సంహరించుటకు ధర్మజుని ఆజ్ఞపై భీమార్జునుల వెంటనిడుకొని వెడలెను. కాని నేఁడట్టి కార్యమునకు ధర్మజుఁడియ్యకొనవలెనుగదా! ఆతఁడు "గులక్షయము కాకుండ కార్య మేదియైనఁ జక్కఁబడుట యెంతయు నొప్పు" నను నభిప్రాయముతో నుండెను. కావున ధర్మనందనుని మనంబునిశ్చింతం బొనర్చుట కృష్ణునకు మొదటికర్తవ్యమైయుండెను.

శ్రీకృష్ణుఁడు పాండవపక్షపాతిగనుక,—రాజు బెడిదంబులు వల్కిన నచ్చోటఁగవులు వచ్చునని ధర్మజుఁ డెఱుంగును. కాని ముష్కర దుష్కృత్ములగు కౌరవుల సభకు అసహాయశూరుఁడగు శ్రీకృష్ణునితప్ప యింకొకనిని పంపుటకు ధర్మజుఁడు సాహసింపలేదు. ఆకారణముననే గదా,

తే॥ "కుటిలమతు లనీతులు కూరకర్ము
లట్టినీచుల కడకు ని న్ననుపఁజాల

నీవు సంకటపడియెదు దేవపదవి
యైన నే నొల్ల నొంటి యందరుగు టుడుగు."

అని ధర్మజుం డనెను !

ధర్మజుని అనుమానము వాప కృష్ణుండు ధైర్యముగ:—

చం. " * * * ఏను నిక్క మ
గ్గిన నసటం గలండె రణకేళికి మార్కొన నొక్కఁడేని యున్?"

అని పలికెనేగాని, పురుషప్రయత్నములందు మాత్ర మాత్రఁ డెట్టిలోపమును చేయలేదు.

సాత్యకిని రావించి, యిట్లు చెప్పెను:—

కం॥ "మనప్రజలోఁ గగిపురికిం
జనుదేరఁగవలయు వారి సారణతో రం
డని యేర్పడ నియమింపు, ప
యనమై యేతెమ్ము నీవు ... ... ".

" దుర్యోధనుండు దుష్టాత్మకుం డతండు మన్నించు మానసులునుం గుటిలబుద్ధులు గావునఁ జక్రగదాద్యాయుధంబులు రథంబునం బెట్టింపవలయు".

కృష్ణుఁ డిట్లు సాత్యకికి గట్టడిసేయుటయందే కౌరవులు కయ్యమునకుంగాలుద్రవ్వినచో తనకపుడు కావలసిన పరికరముల సంసిద్ధమొనర్చుకొనియే కృష్ణుఁడు కరినగరమునకుపయనమయ్యె నని సుబోధక మగుచున్నది. ఇందీతని దూరదృష్టి విశద మగుచున్నది కాదా! విజ్ఞానవంతుఁడగు వీఁ డెవ్వండును శత్రు

శిబిరంబునకు నిరాయుధుండై పోనోపఁడు. శ్రీ శివాజీఛత్రపతి బిజాపూర్ నుండి తనపై కరుదెంచిన అఫ్జుల్‌ఖానుని, సంధికై కలిసికొన నేగినప్పుడు కవచము, ఖడ్గము, వ్యాఘ్రనఖములు నేమఱి యుండెనా?

శ్రీకృష్ణుండు తానుతప్పక సంధి కావించుకొని వత్తునని చెప్పలేదు. 'రాజ్యము చవిగొన్నవారు పాలేల యిచ్చెద?'రని యాతఁడు ధర్మజునితో స్పష్టముగ పలికెను. అందుకు ధర్మరాజుఁడు, "లోకంబెల్ల నేను ప్రకాశిత ధర్మస్థితి నున్నటుల నొప్పుకొనిన నంతియుచాలు"ననెను కాని అర్జునాదులుమాత్రము 'సంధియేల యగునంచున్ మున్నుకైపెక్కినట్టి తలంపు' మాని సంధికై ప్రయత్నింపుమని యాతని బ్రార్థింపకపోలేదు. కావున కృష్ణుఁడు తుదకు 'సంధికినోపినంత పురుషకార మొనర్చుట' కంగీకరించియు తన దౌత్యమువలనవచ్చు పర్యవసానమును ముందుగ నిట్లు చెప్పిపోయెను.

——సుయోధనుఁడును ఆతనిమంత్రులును కుటిలమతులును, అవినీతులును అగుటను సంధికార్య వచనములు చక్క విననీరు; నాపలుకుల కాతఁడు తెఱంగు మాలిన మాటలాడును; మీ తొల్లింటి పాట్లును దలంచి అవ్వి విచ్చేసియున్న యెల్లవారును వారి నగర్హింతురు. కావున సంధిసమకూడకున్న నీవులోకంబు మెప్పవడయు నట్లొనర్చుటయైన నగుంగాక.

తే॥ "ఆసుయోధను ముక్కున నావి గలుగఁ
బుడమి నీ కీడుఁ గావునఁ బోర కలుగు;
నేను కయ్యపు శకునంబు లెన్నియేనిఁ,
గంటి; నీ వనుత్సాహివి గాఁగవలదు."

కావున సంధిపొసంగకున్నను, 'నచ్చోటి యుత్సాహంబు చందంబును, నందఱు జేయంగలవారివర్తనంబులుఁ గొలందులు నెఱింగి నీకు విజయంబగు విధంబునం జనుదెంచెద.'———
"శ్రీకృష్ణుం డిట్లనిన పిమ్మటనే గురుసభ కేతెంచె" ననుటచే శ్రీకృష్ణుఁడు రాయబారిగ నరిగె ననుటకన్న, దౌత్యమొనరింప నరిగెననుటకన్న, పాండవగుప్తచారుఁడుగ నరిగె ననుటయే యుక్తతమముగ నుండునేమో!

కౌరవబలమునఁ గలతల గల్పించి, భేదనీతి నెఱపి కార్యము సాధించుటయే శ్రీకృష్ణుని సంకల్ప మనుట స్పష్టము. మహాపురుషులు సంకల్పించినఁజాలు, కార్యములు క్రమపరిణామమును బొందును. కృష్ణుఁడు కరినగరముఁ జేరునంతలో కౌరవులలో నంతఃకలహము లుద్భవిల్లెను.

అతిలోభదూషితుఁడగు నావృద్ధరాజు అందఱను తన స్వభావమువంటి స్వభావముగలవారిగనే యెంచి, పాండవ దూతగ నేగుదెంచిన కృష్ణునకు వలయు వస్తువులనెల్ల లంచముగ నిచ్చి, వానిని తమపక్షమువానిగఁ జేసికొనినచో తనకొడుకులకు పాండవులవలని భయములేకుండునని తలంచెను.

కం॥ "వనయించుట నుర్వీశను గృహ
మున మహాత్మను నిక్కేపముగ నెయ్యపి రాగా
అని మాడ్కి కింపు వది రయ
ల్లను గౌరవ మొప్ప నీవలయు మాన కనఘా"

అని ధృతరాష్ట్రుఁ డనెను.

కాని "పాండవులకు నేడుగడయగు కృష్ణుం బట్టి బంధించిన రెక్కలువిఱిగిన పులుఁగులుంబోలె వారు (పాండవులు) నాకు విధేయులగుదురు". అని సుయోధనుఁడు స్పష్టముగా పలికెను.

కౌరవుల కేడుగడయైన గాంగేయుఁ డా పలుకులు విని, "ఆ మహాత్ము నెడ నపకారంబు విచారించిన దుష్టాత్ములు నష్టాత్ములగుదురు. దీనం జేటువచ్చు" ననుచు మొగంబు గంటువెట్టుకొని దిగ్గన లేచిపోయె. కృష్ణుఁడు కరిపురమున కాలిడకముందే కౌరవులలో నిట్టిభేదాభిప్రాయములు పుట్టినవి.

ఇంకఁ గృష్ణుఁడెట్టి యేర్పాటులొనరించుకొని హాస్తినాపురికరుదెంచెనో చూతము:— పూర్వము తమ యనుభవము నందుండిన కుశస్థలమునందు కొండొకతడవుండి, అచ్చోనుండిన యాదవుల మన్ననలంది, తమవాఁడైన కృతవర్మతోఁ సవిశేష స్నేహంబు సేసి, మార్గమధ్యంబున మహర్షులం గలిసికొని కరినగరంబున కేతెంచెను. కురున్నృపుఁడంపిన కజ్జంబులును, బంతులను పుచ్చుకొని, వానిననుభవించినవిధంబునలిపి, యనుభవమొల్లక, ఎదురుగ నేతెంచిన విదురాదివిశిష్టజనుల బంధుదృష్టిఁజూచి,

పరిరంభసంభావనము లొనర్చి, రాజమందిరమునఁ గొండొక
సేపు నిలిచి, విదురు సదనంబునకుఁ జనెను. పుణ్యాపరులు,
దోసఁబుట్టువు, లాప్తులైన పాండవులకే బాల్యమాదిగఁ గీడాచ
రించిన కౌరవు, లాపాండవులకుఁ బ్రాణమైన శ్రీకృష్ణుని కెగ్గు
నేల తలంపరు! అందుచే తన్ను దైవతుల్యునిగ భావించి పూ
జించు విదురు నాతిథ్యమంగీకరించెను. విదురుఁడు దుర్యోధనా
దుల దురుద్యోగంబు లెఱింగిన వాఁడగుటచే, పాండవేయుల దెసం
దనమైత్రి కతంబునను, శ్రీకృష్ణునియెడ భక్తికారణంబునను,
ఆతని కౌరవసభకుఁ బోవలదని బోధించెను. కాని శ్రీకృష్ణుఁడు
తొల్లి ధర్మజునితోఁ బలికిన తెన్నుననే, విదురునితోఁ గూడ, 'నే
తలంచిన చందంబునఁ దులువలై వారు కలగంబాఱిన, నా ముం
దర నిలువం జాలుదురే!' అని యతిధైర్యముగఁ బలికెను.

ఇట్టు లనెనే గాని శ్రీకృష్ణునకు మనమున భయము లేక
పోలేదు. కంసుఁడు తనతండ్రికిఁ గావించినటులే, దుర్యోధనాదు
లు దన్ను కురుసభయందు బంధింతురన్న భీతి కలిగియున్నటుల
గాన్పించును. అందుచేతనే మఱుచటి దినమున నభ్యంతరులైన
బలుమానుసులను పోడవికొని, విదురు కరమును, తమ్ముచే
యియ్యు, చెరియొక హస్తంబున బట్టుకొని దుర్యోధనుఁడున్న
కొలువు కూటమున కేగెను. ఆ సభయందు సాత్యకియు, కృత
వర్మయు తన్నంటి యిరువంకలఁ గూర్చుండఁ బెట్టుకొనెను.
అంతతో చాలక విదురుని తనకు వెనుకదెసనున్న యున్నత
పీఠంబునఁ 'గిరం బత్తళిక్కి' కూర్చుండ నియమించెను. ఇట్లు

స్వపరిజన రక్షితుండగుటంజేసి ధృష్టుం డించుకయు కౌరవ కుమారులకు వెఱగొందక యాత్మనిర్లక్ష్యభావమున సభోం గూరుచుండఁ గలిగెను.

ఇంక శ్రీకృష్ణుని దౌత్యాభిధానం బరయుదము. తా వచ్చిన పనిం జతురోపాయంబుల సాధింపఁ జూచెను. అందు ముఖ్యముగ భేదోపాయమునే యెక్కుడుగ ప్రయోగించినట్లు కాన్పించును. కౌరవకూటమును [illegible] ఖండింపఁజేయుటయే ఆతని ముఖ్యోద్దేశము. కురుసభలో నాతఁడు ప్రారంభమున సామముగ నిట్లు పలుకఁదొడఁగెను:

తే॥ "పాండవులు నీ తండ్రి పనిచిన ప్రజలు వారి
నరసి ప్రోచితి వైశశవమాదిగాఁగ;
నది యిది నిష్కాంతమున దిగవిడువఁ దగునె
వారమునఁ దనంగ ద్వేషింపు గారవమున;

ఆ॥ "వారి తండ్రిపాలు వారికి నిచ్చి నీ
పాలు నీవు పుత్రపౌత్రయుతము
ననుభవించి సుఖులరై యుండుఁడు ఇది బంధు
మిత్రసుజన కోటి మెచ్చు తెఱఁగు."

ధృతరాష్ట్రుం డతిలోభదూషితుండగుట నెఱింగి ఆతఁ డాలసింపక దానమార్గమునకు తక్షణమే గడంగెను.

'ఇంద్రప్రస్థంబు నను పాండవాగ్రజునకు నీకుం బెంపును జేరును జేయంగోరి'

చ॥ "మదపడంగించి భూపతి సమాజము నెల్లను నిన్నుఁగొల్వఁ జే
యుదునని పూని దిగ్విజయ మున్నతిఁజేసి మహావిభూతితో
మదిఁబదినుండ, నీ సుతుఁడు మంత్రులు సౌబలు జూదమార్చి సం
పదగొని యింతబోవక సభన్ ద్రుపదాత్మజ భంగపెట్టరే!"

ఈమాటలలోనే తండ్రికొడుకులలో భేదము పుట్టింపఁజాలు బీజము లున్నవి. అంతియేగాక శ్రీకృష్ణుండు ధృతరాష్ట్రుతో మఱియు నిట్లనియెను:

——నీకు మహావిభవము సేకూర్పఁజూచిన ధర్మజుతో సుయోధనుఁడు జూదమాడి యాతని బలవద్విరోధిగఁ జేసెను. నీకు మహావిభూతియే కావలసియున్న నయ్యది రాజసూయాధ్వరకర్తయైన ధర్మజుని వలననే రాఁగలదు. కావున నీవు లోభ ముడిగి పాండవులఁ దెమ్ము.——

ఆ మాటలపై నచ్చోవిచ్చేసియున్న మునిముఖ్యులు, ద్రోణభీష్మాదికురువృద్ధులుగూడ నటులనేయనిరి. మఱికొందఱు మునీంద్రులు కొన్నికథల నల్లి దుర్యోధనునందు దుర్మానమును దుర్బుద్ధియుఁగూడ నారోపించి యాతని సుద్రేకింపఁజేసిరి. కాని యారాజరా జతి శాంతతతో వారి కిట్లనియె:

క॥ "మునులార నన్ను వికృతి రోఁ
షాని మునుపుట్టించె నట్టిలయ్యెదఁ గా కీ
వినఁజవిగాని పలుకులఁ
బని గలదే? యుడుగుఁ డింక బహుభాషణముల్"

మహామానియగు దుర్యోధనుఁడు విధిచెయిదముల కెక్కుడు ప్రాముఖ్యత నిచ్చి మాట్లాడుటచే సంధికి సమ్మతించు నేమోయని కృష్ణునకు భీతిపుట్టినట్లు కాన్పించును. కానున్న వెంటనే ఓదార్చునట్టియు, వాఁతపెట్టునట్టియు ప్రసంగము ప్రారంభించువేళ!

————పాండిత్యశౌర్యనిత్యులు, పాండుసుతులు; వారిఁ గూడి బ్రతుకుట తెఱఁగు; కాని శకుని కర్ణదుశ్శాసన దుర్మంత్రితంబున కార్యతంత్రంబు కానేరదు. వీరెకాదు సురాసురులెత్తి వచ్చినను పాండవేయుల మార్కొనఁజాలరు. సవ్యసాచి కెదురుగ నిలువఁజాలిన వీరుఁడుండిన కయ్యమునకు పూనుకొనుఁడు. లేకున్న రిత్తగ బహుజనక్షయము వలదు———— అనిగదా యని యెను!

ఎందుకీ పుల్లవిఱుపు మాటలు? ఎట్టివాఁడైననిట్టి పలుకులకుఁగనలకుండునా? ఈమాటలు రజోగుణపూరితుఁడైన రాజరాజు కోపానలంబున కింధనంబు లయ్యెను. అతఁడాదినుండియు తనకడనున్న కర్ణుఁడు అన్నిటనర్జునునకుసరియగునని నమ్మియుంట, సవ్యసాచి నెదుర్కొనఁజాలిన వీరుని వెదకుకొన నక్కఱ లేకుండును. కావున వెంటనే దుర్యోధనుఁడు యుద్ధము సిద్ధమొనర్చి ఖచితముగ నిట్లు పలికెను: 'ధర్మపుత్త్రుండు జూదరియగుట భూమిని గోల్పోయె. మా యిరువురిలో నెవ్వరైన సంగ్రామమున జయంబుగొని రాజ్యముచేయుటయే నేను నిశ్చయించితి?'

అంతమాత్రమునకు—శ్రీకృష్ణుండు పుండరీకాక్షుఁడగు టెల్లబోయి, అరుణకమలాక్షుఁ డయ్యె—నట! శ్రీకృష్ణునకు కావలసినటులనే జరిగెనే! కావున నాగ్రహమునకు కారణము కాన్పింపదు. కాని తానటుపిమ్మటనాడిన నానాప్రకార వచనంబులఁ కరుణకమలాక్షుఁడగుట యవసరమని ఆరీతి నభినయించి యుండనోపు. శ్రీకృష్ణుండాడిన యప్రస్తుత పరుషవచనంబులకుఁ గటకటంబడి దుర్యోధనుండటనుండి రాజసమున దగ్గన లేచిపో యెను. ఆతని వెనుక కర్ణుండు ననుజగణంబును వారిపొందైన జనపతులును బోయిరి. అంత కృష్ణుండు సందెలించి మిగిలిన సభాసదులం గాంచి యిట్లనియె.

ఉ॥ "కంసుఁడు నిట్లు తండ్రి మదిగండెడు చందమొనర్చి ధర్మవి
ధ్వంసము చేసినం గులమువారలు నాకెఱిఁగింప* నేను దు
ర్మాంసము గోయు వైద్యుని క్రమంబున నాతని దుంచి యన్వయో
త్తంసముఁజేయనే జనకుఁ, దద్విధ మొప్పదె మీరుఁ జేసినన్"

ఈ విప్లవప్రబోధము, పాండవులకు రాజ్యము రాఁబెట్టు మార్గము గాఁబోలు! భేదోపాయ ప్రయోగమున శ్రీకృష్ణుండద్వితీయ కౌశలము కనపరచెను—పాపము! ధృతరాష్ట్రుఁడు కృష్ణుని పలుకుల కదరిపడి, మతిచెడి, మంతనంబునకు విదురునంపి గాంధారిం గొనివచ్చెను. ఆమె చెప్పినను దుర్యోధనుఁడు వినలేదు. ఆతఁడు కృష్ణుని కుతంత్రంబున కలిగికావలయు నాతనిఁబట్టి కట్ట సంసిద్ధుఁడయ్యెను. కృతవర్మ దీనింగాంచి యాదవబలములఁగొని

* ఆకులమున నెవ రెవ్వు డెఱిగింపగా!

వచ్చి సభాభవనమున కావల యుద్ధమునకు సిద్ధుఁడైయుండెను. సాత్యకియుఁదానొక్కఁడె—లోకులకి నెల్లఁజాలుదు—నని యెల్ల విధంబుల నప్రమత్తుండయి యుండెను. శ్రీకృష్ణుండంతట దండోపాయముకూడ నవసరమైన నదిప్రయోగింపఁగల సామర్థ్యము తనకున్నదని యందఱెఱుంగునట్లు ధృతరాష్ట్రు నుద్దేశించి యిట్లనియె:

ఉ॥ రోషము నాపయింగలిగి కార్యింతేఁ గౌరవు లింతసేఁటి సం
తోషము; నీవు ప్రార్థనముతోఁ బగనాకు ననుజ్ఞ యిమ్ము, ని
ర్దోషత సేను నోపుగతి దోర్బల మర్జయుతైన వారి వి
ద్వేషముఁ జక్కఁ బెట్టి జగతీవర! యంతటఁ బోయి వచ్చెదన్.

శిశుపాలుఁడు కాదు సుయోధనుఁడు! అనఁగలమాట యనెనేగాని కృష్ణునకు భీతిమాత్రముపోలేదు. సుయోధను బలసంపత్తుల బాగుగ నెఱుంగుట నటనున్న వారిని తనమాటలతో మైమఱపింపఁజేసి అవ్వాలికేగ నిశ్చయించెను. తనకెదుటనున్న యక్కురుపతి కుమారుఁ జక్కఁ జూచి,—ఏనొక్కరుండనని తలంచెదు. నాపార్శ్వంబుల సింద్రయమవరుణకుబేరు లుండుట నెఱుంగవు. నాకు బాసటయై యదువృష్ణి భోజాంధక వీరులున్నారు. హాల గాండీవ బాహులగు బలదేవార్జునుల బలం బెఱింగి వర్తింపుము. యుధిష్ఠిరభీమనకులసహదేవులు నావీఁపున నున్నారు—— అని అట్టహాసంబుగనాడిన ఆగంభీరవచనంబులకు దుర్యోధనుండు కొంతవడి చేష్టలు దక్కియుండెను. ఆ సందెఱింగి కృష్ణుండు

సన్నిహితులైన కృతవర్మకరంబును సాత్యకి హస్తంబును నవలంబించి, సభవీడి, చివ్వున నవ్వలికేగెను.

తండ్రియగు వసుదేవునికన్న శ్రీకృష్ణుండు కడునేర్పరి. కంసుఁడు వసుదేవుంబట్టి చెఱఁబెట్టినట్లు దుర్యోధనుఁడు కృష్ణుని బట్టి బంధింపఁజూచెను. దుర్యోధనుని దురుద్యోగంబు శ్రీకృష్ణుండు విదురువలన మున్ముందు వినియుండుటను కావలసిన సన్నాహంబు లొనర్చుకొనియే కౌరవసభ కేతెంచెను. తనకు మూడనున్నముప్పు, మాటలచేతప్పకున్నచో నాతఁడు పోటునకుఁగూడ సన్నద్ధుఁడైయుండెను. శ్రీకృష్ణునిదూరదృష్టియు, మనోధైర్యమును, వాగ్గాంభీర్యమును నాతనినప్పట్టునఁ గాపాడినవి. 'శ్రీకృష్ణుని బుద్ధియ మాసమస్త పురుషార్థమ్ములకు మూలంబు' అని యుధిష్ఠిరుఁడు విశ్వసించినటుల, కృష్ణుఁడు తనబుద్ధి చాతుర్యముచే కౌరవవీరుల మనంబులఁ గావలసినంత కలవరము జనింపఁజేసి వచ్చెను. బాహ్లీక భీష్మ ద్రోణ కృప ప్రముఖ నిఖిల విశిష్ట జనంబులను పాండవపక్షపాతులుగ నొనర్చెను. దుర్యోధనుని ప్రాణమిత్రుఁడైన కర్ణునితో నాతఁడు పాండవాగ్రజుఁడని చెప్పి, ఆతని మనంబున పాండవులపై అభిమాన మంకురింపఁ జేసెను. అందుచే నాతఁడు మనఃపూర్వకముగఁ బాండవులఁదెగనేయుటకు వెనుదీయక తప్పదు. అంతకన్న పాండవుల కెక్కుడు ఉపకార మొనర్చుటకు కర్ణుని అంతరాత్మ యియ్యకొనకుండెను. ఆప్తుఁడైన సుయోధనుని నాపత్సయమున వీడి చనుట కాతఁ డంగీక

రింపలేదు. శ్రీకృష్ణునిమాటలవలన కౌరవులు తప్పక గెలుతు రన్న విశ్వాస మా వీరాధివీరుని బాసిపోయెను.

కం॥ "అనుజులు బుత్విజులుగ నీ
పనియిటు సేయఁ దాని నీ వుపద్రష్టవుగా
విను కురుకుమార పసు విశే
సనమున రణయజ్ఞ మవేఁడు (ధర్మజుఁడు) సన్మతిఁ జేయున్"

ప్రబల విరోధియగు కర్ణుని నిర్వీర్యు నొనర్చుటకన్న పాండవుల పురుషార్థమింకేమున్నది ?

అంతతో పోయెనా! శ్రీకృష్ణునిమాటలమాహాత్మ్యమింకనుజూతుముగాక:—అతఁడు వెడలిన పిమ్మట భీష్ముఁడు కౌరవ వీరుల నిరుత్సాహులఁ జేయ నెంచి, దుర్యోధనుఁ డతిరథుండనియు దుశ్శాసన శకునులు సమరథులనియు, కర్ణుం డర్ధరథుండనియు, నిరూపించుటచే, రాజరాజు సన్మానము నాగ్రించి విజృంభించుచున్న కౌరవవీరులు, నిరుత్సాహులైరి. యుద్ధప్రారంభసమయ మాసన్నమైనది, ఒకరిచావున కింకొక రెదురుచూచుచుండిరి. అంతః కలహము లారంభమైన తరువాత నపజయమున కాలస్యమేల యుండును? భేదోపాయప్రయోగకుశలుండగు కృష్ణుని దౌత్య ఫలితము లివ్వి. ధర్మజునకు విజయంబగు విధం బంతకన్న వేఱెయ్యది !

———

శ్రీ కృష్ణుఁడు — గీతలు

(i)

— పార్థసారథి —

ఆనాఁడు:

కం. "దేవేంద్రుని ఖాండవమును
పావకునకు నీఁ దలంచి పార్థుని రథికుం
గావించి సూతుఁడయ్యెను
గోవిందుఁడు మఱఁదితోడి కూరిమి మెఱయన్."

ఆ కూరిమి నాఁటినుండియు నభివృద్ధిఁజెంది, పాండవులు నేఁడు పౌర రాజ్యంబునకుఁబట్టముగట్ట శ్రీకృష్ణుఁ బ్రోత్సహింప, నాతఁడు మరల పార్థుని రథికుం గావించి, దా సూతుఁడై కురుక్షేత్ర రణరంగమున దర్శనమిచ్చుచున్నాఁడు.

శ్రీకృష్ణుని మాహాత్మ్యమంతయు మహాభారతయుద్ధమందే చూపఁబడెను. భగవద్గీతలు, బాహ్లీకసోమదత్తుల మరణము, సైంధవవధ, అభిమన్యునిచావు, ఘటోత్కచునిమరణము, ద్రోణుని అస్త్రసన్యాసము, కర్ణునిఅంతము, హ్రదంబున డాగిన దుర్యోధనుఁ బిలిచి భీముచేచంపించుట, ఉత్తరాగర్భ సంరక్షణము నిట్టివన్నియు శ్రీకృష్ణుని ప్రసాదములే. కేవలము పగ్గముల చేఁబూని పార్థుని యశ్వంబుల నదల్చుట కతండుండలేదు. పంచేంద్రియంబులఁ బాలించు ప్రాణంబుపగిది పాండవులొనర్పవలసిన అన్ని కార్యములను, పార్థరథమునొగలపైఁదానుండి శ్రీకృష్ణుఁడే

నిశ్చయింపుచుండెను. నీతులు చెప్పుటకు, గోతులు త్రవ్వుటకు, నిందలు రాకుండ బంధునాశ మొనర్చుటకు, ధర్మజుఁ డాతని మాటపై నడచుచుండెను.

కురుక్షేత్ర రణరంగమున శ్రీకృష్ణుఁ డర్జుమునకు కావించిన ధర్మోపదేశము ననుసరించియే ఆతనికి భగవానుండను బిరుదము కూడ వచ్చినది. పగ్గంబులఁ జేఁగొని శ్వేతాశ్వంబుల నాల్గింటినడుపుచు నరునిరథంబుపైఁగూర్చొనిన శ్రీకృష్ణుఁడు దివ్య కళలతో వెలుఁగొందుచు భక్తాగ్రేసరులకన్నుల, కానాఁటికే కాదు, ఈనాఁటికిని, కాన్పించుచునేయున్నాఁడు. శరతల్పశాయి యైనభీష్ముఁడు శ్రీకృష్ణుని ప్రార్థించుచు పలికినపలుకులఁ బరిశీలింతుముగాక !

కం॥ "పనవారిఁ జంపఁజాలక
వెనుకకుఁబో నిశ్చగించు విజయుని శంకన్
ఘన యోగవిద్యఁ బాపిన
మునిచంద్రుని పాదభక్తి మొదవఁయున్ నాకున్"

ఉభయసేనా మధ్యంబున రథంబునిలుప శ్రీకృష్ణుని తత్తరించిన, యర్జునున కప్పట్టున ఘనమైన శంక లుత్పన్న మగుటయు, నాతఁడు గాండివము దిగవిడచి నిలువున నీరై నిలుచుటయు నేలకలిగెను? పడినపాట్లఁదలంచి, దాయాదుల దునుమ నేతెంచినవానికి, పాపము, పరబలంబుల వీక్షించినంత ధర్మ సందేహము లుత్పన్నములయ్యెను. 'బంధునాశము వంశక్షయము

కలిగించు కార్యముచేయుటకుజంకుపొడముచున్న'దనెను. అర్జునున కప్పట్టున సందేహములెందుకు కలిగినను, అయ్యవి, శ్రీకృష్ణునకు తన మాహాత్మ్యము వెల్లడింప మంచిసమయము చేకూర్చెను. వెంటనే మొత్తలపైనున్న కృష్ణుఁడు పార్థుమోమున దృష్టినిలిప నరుని పుట్టు పూర్వోత్తరంబులఁజెప్పి, జీవుని యొక్క అస్థిరతయు, ఆత్మయొక్క స్థిరతయుబోధించి, అర్జునుని సంశయములఁ బాప మొదలిడెను. "ఫలిత మపేక్షింపక కర్మల నాచరించుటయే మనవిధి; పుట్టినవారందఱును గిట్టకమానరు. మనము కేవలము నిమిత్తమాత్రులము. కర్మల ననుసరించి కార్యములు జరుగుచుండును. నేను కర్త ననుకొనుటకన్న వెఱ్ఱివేఱులేదు. ఈశ్వరుఁడే మనచే నన్నికార్యము లాచరింపఁ జేయుచున్నాఁడు. కావలసినచో, కాలగతినొందినవారి మరణాబునకు హేతుభూతులెవ్వరో వీక్షింపుము" అని శ్రీకృష్ణుఁడు తనమాటల చమత్కృతిచే నర్జునుని మనోవీథి ననేకాద్భుత దృశ్యముల నాట్యమాడించెను. తత్క్షణమే ఆ యతిరథశ్రేష్ఠుఁడు సంశయదూరుఁడై శ్రీకృష్ణునకు సాష్టాంగ నమస్కారము సర్వజనులు వీక్షింప నాచరించి, కార్ముకం బందుకొని కయ్యంబున కియ్యకొనెను. అస్త్రసన్యాస మొనర్చినవాని నాహవంబునకు సంసిద్ధునొనర్చుట శ్రీకృష్ణుని విశ్వరూపప్రదర్శనా ప్రభావమని చెప్పుదురు.

యుద్ధారంభమున శ్రీకృష్ణుని విశ్వరూప ప్రదర్శనమునకవసరములగు పరిస్థితులుండెను. శ్రీకృష్ణునిమెడ నెక్కుడు

గౌరవముండిన భీష్ముఁడు కౌరవసేనల కధిపతిగ నుండెను. ఇంక పాండవసేనలన్ననో, కృష్ణుని ప్రాణమిత్రుఁడగు అర్జునుఁడే నిజముగ నడిపించుచుండెను. ‘పరభూపాయుధులెల్ల జూపులన శుంభత్కేళి వంచించుట కింతకన్న తగిన సమయమెయ్యది? ఇరువాగుల నట్టి యభిమానవంతులుండుటచే శ్రీకృష్ణుఁడు నిరాటంకముగ నుభయసేనామధ్యంబున నిలిచి యంతనాటకమాడఁగలిగెను. ‘ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటికా’ కార్యమొనర్చ ఉచితజ్ఞుఁడు శ్రీకృష్ణుఁడనుటకు సందియము లేదు.

ఆనుషంగికముగా మరికొన్ని పరమప్రయోజనములుగూడ నాఁటిప్రదర్శనమువలనసిద్ధించెను. పదునెనిమిది అక్షౌహిణులును బదునెనమండ్రు మహారథికులును నున్న రణరంగమున, నతిరథశ్రేష్ఠుఁడైన అర్జునుని చేభగవంతుఁడుగ పూజింపఁబడుటచే శ్రీకృష్ణునకు గౌరవమధికమయ్యెను ఆదృశ్యముమాత్రము పాండవయోధులకు ధైర్యమును, కౌరవపక్షమూని వచ్చినవారి కధైర్యమును, ఏకకాలమున కలిగించి, పార్థరథంబు రణరంగమున నిరపాయముగ నెల్లెడల విచ్చలవిడిగ విహరించుటకు వీలిచ్చెను. యోధుల కెట్లుండినను, రణమొనర్ప నేతెంచిన జనసామాన్యమునకు మాత్రము శ్రీకృష్ణుండు భగవంతుండను భావముద్భవించుటచే వారు నరుని తేఱిపారఁజూడ వెఱచిరన నందసంగత మేమున్నది !

శ్రీకృష్ణుఁడు తనజీవితమందు ప్రధానముగ మువ్మారు విశ్వరూపము చూపినట్లు కాన్పించును. కన్నతల్లికి పురిటింట

తనకున్న సృష్టిసామర్థ్యముఁ జూపి తరింపఁజేసెనట. కౌరవ సభయందు తన్ను కట్టవచ్చిన దుర్యోధనాదులకు దిగులు గొలుప తన వాసుదేవత్వము వ్యక్తపఱచెనట. కురుక్షేత్ర రణరంగమున నర్జునున కంకురించిన దిగులు వాప శ్రీకృష్ణుఁ డీశ్వరుని లయకాలరూపము నతిచమత్కారముగఁ జూపెను.

శ్రీకృష్ణుఁడు తనవిశ్వరూపము నింకను మఱికొన్నిపట్టులఁ జూపినట్లు భాగవతమునఁగలదు. అభీరబాలుఁడగు యుద్ధవుఁడు బాల్యమున కృష్ణునిరూపము గాంచి ధ్యానించుచుండ శ్రీకృష్ణుఁ డచ్చోటుబాసిపోయెను. కాని యుద్ధవుఁడుమాత్రము శ్రీకృష్ణుని మనస్సునం దుంచుకొని ధ్యానించుటచే ఆతనికి, లేని కృష్ణుఁ డున్నటుల కాన్పించెను. యశోదకు కూడ కృష్ణుఁడు తనబొజ్జ యందు విశ్వమంతయు కలదని నోరుదెఱచి చూపి ఆమెవలన దెబ్బలు తప్పించుకొనెను. అక్రూరుఁడు నీటియందును, రథము నందును, శ్రీకృష్ణు నేకమూహూర్త్తమునఁగాంచి భక్తిపరవశుఁ డయ్యెను. కృష్ణుఁ డొక్కఁడయ్యును గోపికలకు అనేకులుగ కాన్పించెను. కంసునకుఁ గూడ అంత్యదశయం దన్నిచోటులఁ గాన్పించె నందురు. ద్రౌపదికి వస్త్రము లసంఖ్యాకము లగుట కూడ శ్రీకృష్ణుని మాహాత్మ్యమే యట! ఇంతవఱకును భీతిచేత కొందఱకు, ప్రేమచేత కొందఱకు, కృష్ణుఁడు భగవంతుఁ డను భావ ముద్భవించెను. కౌరవసభయందును, కురుక్షేత్ర రణ రంగమందును, శ్రీకృష్ణుని విశ్వరూపప్రదర్శనా విధానములఁ గాంచినారము. ఇంకొక్క ఘట్టమందు మాత్రము శ్రీకృష్ణుఁడు

నిర్యాణమునకు పూర్వము భిన్నమగు విశ్వరూపముఁజూపెను. శ్రీకృష్ణుఁడు కౌరవులకుఁగావించిన అపకారమున కాగ్రహించిన ఉదంకుఁ డాతని శపింపఁ జూచెను. కాని కృష్ణుఁడు తనమాటల మాహాత్మ్యంబున నుదంకుని వశపఱచుకొనెనేగాని ఈయుదంకునకు పూర్వప్రయుక్తంబులగు విశ్వరూపములలో నెద్దానినైనను జూపి నివ్వెఱపఱుపలేదు. అనువుగానిచోట నధికుఁడ ననుట కాతఁ డిచ్ఛగింపకుండెను కాబోలు !

ఇఁకశ్రీకృష్ణుఁడు గీతలయందు బోధించినమతము పరిశోధింతము:

శ్రీ కృ ష్ణు ని మ త ము.

శ్రీకృష్ణుని మహాత్మ్యమంతయు నాతఁడుబోధించిన గీతలయందేయున్నది. సృష్ట్యాదనుండియు మహాత్ములనేకులుద్భవించి మానవసంఘమునుసన్మార్గమున నడుపయత్నించిరి. వారలమార్గములు వేరైనను గమ్యస్థానము మాత్రము వేఱుకాదు. శ్రీకృష్ణుని నాఁటికి ఆర్యావర్తమందు ముక్తిఁ బడయుట కనేకమార్గము లవలంబింపఁ బడుచుండెను. అందు భక్తి, యోగ, కర్మ, సాంఖ్యాది మార్గములు ముఖ్యములు. ఆర్యావర్తరాజకీయ నాట్యరంగమందుండిన వివిధ రాజ్యముల నంత మొందించి, ఒక్క మహాసామ్రాజ్యము పౌరవ్యుల యాజమాన్యమున నెలకొల్పినటులే, హిందూసంఘమందు వ్యవహరింపఁబడుచుండిన వివిధమతముల మార్గముల నేకమొనర్చి ఒక్కమతముగ నొనర్ప యత్నించెను. సకలమానవులకును పనికివచ్చు మతము నెలకొల్ప యత్నించిన మహాత్ములలో శ్రీకృష్ణుఁడు మొదటి వాఁడని చెప్పక తప్పదు.

— శ్రీకృష్ణుఁడు-అవతారపురుషుఁడా, కాఁడా?—అను సంశయ మనేకుల వేధించుచున్నది. అవతారపురుషుఁడనగా భగవదంశ అధికముగ గలవ్యక్తి యని భావింపవలసియుండును. ప్రతి మానవునియందును ఈశ్వరాంశ యున్నది. కాని అయ్యది కొందఱియం దెక్కువగను, కొందఱియందు తక్కువగను,

కుండును. ఎవ్వరు తమయందున్న ఈశ్వరత్వమును గుర్తెఱింగి అభివృద్ధికావించుకొందురో వారు కాలక్రమమున సంపూర్ణమగు ఈశ్వరత్వమును పొందుదురు. అట్లుకాక సాధారణ ప్రాపంచక విషయములందు నిమగ్నులై తమయందున్న ఈశ్వరాంశ గుర్తెఱుంగక ప్రవర్తించువారు కాలక్రమమున పశుప్రాయులై తమ మానవజన్మ వ్యర్థమొనర్చుకొందురు. శ్రీకృష్ణుఁడు తన స్వలాభమునకుగాక యాదవసంఘమునకును, తరువాత భారత వర్షమునకును, ఆపయి మానవజాతి మంగళము కొఱకును ఎట్లుతనజీవితము వినియోగించెనో వెనుకటిప్రకరణములయందు చూచియున్నాము. ఇదిగాక కురుక్షేత్రరణరంగమున శ్రీకృష్ణుఁడు షగ్గములు చేఁబూని అర్జునునకు సారథ్యమొనర్చుతరి ఆవీరాధి వీరున కుపదేశించిన గీతలు శ్రీకృష్ణుని మహాత్మ్యమును వేనోళ్ళ చాటఁగలవు.

అన్నిజాతులట్లు హిందూసంఘముకూడ వివిధావస్థలు దాటివచ్చినది. మానవజాతి బాల్యదశయందు ఎవరికి వారే జీవించుటకు యత్నించుచుండిరి. ఆనాఁడు జన్మకు పరమావధి ఇంద్రియ సుఖములనుభవించి విజృంభించుటయే యని భావించు చుండిరి. కాలక్రమమున వ్యక్తులు, యితరుల కొఱకు తాము జీవింపవలసిన ఆవశ్యకతను కనిపెట్టిరి. ఆనాఁటి స్వర్గసుఖములు కూడ ఇంద్రియానందమయములై యుండెను. తపోధనులు, మునులు, అధ్వరకర్తలు, దిగ్విజేతలుకూడ చచ్చిన తరువాత దేవేంద్రలోకమునకేగి రంభాసంభోగముపొంద నువ్విళులూరు

చుండిరి. మానవశరీరముతో నున్నంతకాలమును మంచినడవడి పొందియుండుటెల్ల అప్సరసల ఆలింగనమున కేయనియనవలసిన దే కద! ఇట్టియూహలచే బాహుబలసంపన్నులును, అతిమేధావంతు లును, ఇతరులను హింసపెట్టక సన్మార్గమున నడచుచుండిరి. యమధర్మరా జిడనున్న కఠినశిక్షలు మనుజుల వెఱపించి మంచి మార్గమున నుంచుచుండెను.

కాని మానవునినడతలను పాపపుణ్యముల క్రింద విభజించి నంతమాత్రమున మహాత్ములు కొందఱకు మనశ్శాంతి కలుగ కుండెను-చిత్రగుప్తుని చిట్టాయందు మనపేరుననున్న పాపపుణ్య ములు (జమాఖర్చులు) సరిపడినంత నే మనము మరల మానవ జన్మమెత్త వలసివచ్చును. కావున మఱి జన్మలేనివిధాన మె య్యది యని మహాబుద్ధిమంతు లాలోచింప మొదలిడిరి. అంతులేని ఆనందమునకు వారాసించి తత్ప్రాప్తికై ప్రయత్నింప మొద లిడిరి. ఆశ లడుగంటనంతకాల మానందము ననుభవింపఁజాల మని వారునిశ్చయించుకొనిరి. ఎట్టి యానందమునాశింపనివాఁడే బ్రహ్మానందముఁ బడయఁగలఁడు. అట్టివానికి సుఖదుఃఖములతో నెట్టి ప్రసక్తియు నుండదు. భౌతికదేహ బాధలు వానిచెంతఁ జేరి ఆత్మాభివృద్ధికి నెట్టియాటంకమును కలిగింపలేవు. సుఖాభి లాషము, దుఃఖభయము, మనలను మానవ సంఘమును మిత్ర శత్రుకోటిక్రింద విభజింపఁ జేయుచున్న ది. మహాత్ములగు వారికి అందఱునొకటిగ కాన్పింతురు. అందఱును దమలోనున్నట్లును, తామందఱిలో నున్నట్లును వారు భావించుచుందురు. చావులేని

అంతరాత్మ, నశింపనున్న దేహమును జయించినగదా అయ్యది అమరత్వమొందుననదగును! 'అమరగీత' యని చెప్పఁబడు భగవద్గీతల సారమిదియే. ఇయ్యవి శ్రీకృష్ణుఁడు అర్జునునకు బోధించినట్లు చెప్పుదురు—

భగవద్గీత యొక్కటియే శ్రీకృష్ణుని మహాత్ముగ నొనర్చుటకుఁ జాలియున్నది.

ఇయ్యది ప్రపంచమందలి పవిత్ర వేదాంతగ్రంథములలో నగ్రస్థానమాక్రమించుచున్నది. గీతాగ్రంథము పదునెనిమిదిఅధ్యాయముల క్రింద విభజింపఁబడియున్నది. అందు మొదటి ఆఱధ్యాయములును కర్మకాండ నభివర్ణించును. తఱువాత ఆఱధ్యాయములును భక్తిమార్గమును వ్యక్తీకరించును. శేషించిన ఆఱధ్యాయములయందును జ్ఞానమార్గము ప్రశంసింపఁబడినది.

శ్రీకృష్ణుని యనంతరము వేయి సంవత్సరములకు అవతరించిన బుద్ధదేవుఁడు మొదటి ఆఱధ్యాయములనే ఆధారముగఁ జేసుకొనినట్లు కాన్పించును. ఈతఁడుముఖ్యముగా నిష్కామకర్మనే బోధించెను. బుద్ధదేవుఁడు 'ధర్మమును పాటించి సంఘమును సేవించిన ప్రతిమనుజుఁడును నిర్వాణము వడయు' నని ప్రబోధించెను.

తరువాత నేతెంచిన లోకరక్షకుఁడు, అనగా ఏసుక్రీస్తు, భక్తిమార్గమునకెక్కుడు ప్రాముఖ్యతనీయఁదొడఁగెను. తనమతమును వ్యాప్తమొందించుట కేసుదేవుఁడు సాత్త్విక మార్గమునే యవలంబించెను. ఆనాఁటికి బుద్ధదేవుని అహింసామత ప్రభావ

మింకను ప్రజలహృదయముల వీడియుంటలేదు. ఇతఁడు 'భక్తిని ప్రధానము చేసుకొని సాధుకర్మావలంబనమున ముక్తిఁగాంచ నగు' ననెను.

మఱి ఐదువందల సంవత్సరముల కవతరించిన మహామ్మద్ అను మతబోధకుఁడు ఏసుదేవుని మతమే పాటించినను, క్షత్రియోచితములగు రాజసమార్గముల నద్దాని నన్నియెడల వ్యాప్త మొందింప మొదలిడెను. కావున నేఁడు ప్రపంచమందెక్కుడు ప్రజలచే అవలంబింపఁబడుచున్న మూఁడు ముఖ్యమతములును, అనగా బౌద్ధ, క్రీస్తు, మహమ్మదీయ మతములును, గీతాప్రయుక్త మతములే కాని వేఱుకానటులఁ గాన్పించును.

ఇంక హిందూమతమందు నానాఁటికిఁ బయలువెడలిన త్రిమతములఁ బరిశోధింతము. అద్వైత మతస్థాపనాచార్యుఁడగు శ్రీశంకరుఁడు గీతలలోచివరనున్న ఆఱధ్యాయముల నే ముఖ్యముగాఁగైకొనెను. జ్ఞానమునకు ముఖ్యస్థాన మొసంగి, కర్మను, భక్తిని అద్దాని కుపాంగములుగనొనర్చెను.

రామానుజుఁడు భక్తిని ప్రధానముచేసికొని, జ్ఞానకర్మములకు తరువాత స్థానమొసంగెను. దీనినే విశిష్టాద్వైతమని యందురు.

ద్వైతమత ప్రబోధకుఁడైన మధ్వాచార్యులు కర్మసోపానములపై భక్తిమార్గ మలవఱచికొనినచో ముక్తి సంపాదింపనగు ననెను. ఇట్లు త్రిమతాచార్యులును భగవద్గీతలనే

యాధారము చేసుకొని తమ తమ యభిమానమతముల వ్యాప్తి నొందించిరి. అంత యేల? నిన్న మొన్న! నన్ని మతముల నేకమొనర్ప నెత్నించిన బాలగంగాధరుఁడు, అరవిందఘోషు, గాంధీమహాత్ముఁడుకూడ తమ ప్రబోధనలకు గీతలనే యాధార మొనర్చుకొనియున్నారు. శ్రీకృష్ణప్రోక్తములగు గీతావచనములకు మించిన సుబోధనలు కాన్పింపవు. సర్వమతసారముగునట్టి గ్రంథమువచించినవ్యక్తి ఎట్టిమహాపురుషుఁడో చదువరులే యూహింతురుగాక. ప్రస్తుతమున్న రూపమున గీతలు శ్రీకృష్ణుని నోటినుండి వెలువడకుండ నుండిన నుండుగాక, గాని యందలియభిప్రాయములుమాత్ర మాతని వనుటకు సందియ మణుమాత్రమైనను లేదు.

ప్రతివ్యక్తియు నొక్కొక్క సమయమున అనుకొనని నంతటి అత్యున్నతస్థితి కరిగి అద్భుతకార్యము లాచరించుచుండును. ఆశక్తియుక్తులు వ్యక్తుల నావరించియున్న అనుకూల పరిస్థితులననుసరించి యావిర్భవించును. వెఱ్ఱివారు, దయ్యముపట్టినవారు నిద్రోన్మత్తులు (Somnambulist) కొన్ని నమ్మరాని పనులాచరించుచుందురు. అటులే శ్రీకృష్ణునకు కురుక్షేత్రరణరంగమున దేవుఁడు పూనియుండనోపు. కాకున్న అర్జునుడు మరల సావకాశముగ గీతల తెలుసుకొనగోరి శ్రీకృష్ణునడిగినపుడు ఆతఁడు అసలుగీతల చెప్పలేక అనుగీతల నుడువుట ఎందుకు తటస్థించును! కావున శ్రీకృష్ణున కెక్కుడు భగవదంశ గీతలు నుడివినప్పుడే పొడమినట్లు కాన్పించును.

నిర్యాణము

కురుపాండవ యుద్ధానంతరము శ్రీకృష్ణుఁడు ధర్మజు నార్యావర్తరాజ్యమున కభిషిక్తుంగావింప, నతఁడు పూజ్యంబగు రాజ్యంబు సేయుచు, వైదికకృత్యములని గృహస్థధర్మము పాటించుచుండెను.

దేశము నట్టుడికించిన పీడించిన శిశుబాలహంతకులును, స్త్రీలోలురును, భైరవీపూజాధురంధరులును, అగు కంస నరక జరాసంధాది క్రూరవీరులందఱును సమసియుండుటను, దేశమెల్లఁ జల్లగ కాలము గడుపుచుండెను.

అన్యపరిభవ మెఱుంగని యదువీరులు ద్వారకా నగరమున మిన్ను మన్నులుగానక మిడిసిపాటునఁ ద్రుళ్లుచుండిరి. శ్రీకృష్ణునిజూడ నరుదెంచిన మునిపుంగవులతో వారు పరిహాసోక్తు లాడ మొదలిడిరి. వా రలిగి 'మీ రంతఃకలహములచే హతులగుదు' రని శపించిరి.

యతినిందాపరతను యదువంశము నాశనం బగునని శ్రీకృష్ణుఁడు నిశ్చయించి యాదవులను ప్రభాసతీర్థంబున కరుగుండని యానతిచ్చెను. కాని యాదవులు మదిపానమత్తులై మత్సరంబునఁ దమలోఁదాము పోర నారంభించి యందఱును మడిసిరి. బలరామకృష్ణులు చింతాక్రాంతమనస్కులై ద్వారక వీడి వచ్చిరి. యోధుండగు బలరాముండట్టిదుస్థితి నున్న దేశంబున నుండనొల్లక యోగమార్గంబున దేహంబు విడిచి చనెను. బలరాముఁడే సరియైన యాదవవీరుఁడు. బ్రతికియున్నంతకాల మాతఁడొకరి లక్ష్యము లేక విచ్చలవిడి విహరించి, బ్రతుకు భారమని తోఁచినంతనే యద్దాని తృణప్రాయముగ విసర్జించెను.

హాలధరున కుండవలసిన అమాయకత్వమంతయు నాతని[illegible]చే మూర్తీభవించి యుండెను.

శ్రీకృష్ణుఁడన్ననో [illegible]. యాదవుఁడు మాధవుఁడై అవతారంబుల నెత్తియుత్నించుటచే నాతనికి బ్రదుకుపై నాస యధికమయ్యెను. ఇది యాతని చరమకాలావస్థను బరిశీలించినచో సువ్యక్తమగును.

———శ్రీకృష్ణుండు చని చని, యొక్క నికుంజ పుంజంబు చాటున విశ్రమించుటంజేసి చరణంబు వేఱొక చరణంబుమీఁద సంఘటించి చంచలంబుగా వినోదంబు సలుపు సమయంబున, నొక్క లుబ్ధకుండు మృగయార్థంబుగావచ్చి దిక్కులు నిక్కి నిరీక్షించుచుండ, వృక్షంబుచాటున నప్పరమ పురుషుని చరణకమలంబు హరికర్ణంబు గాఁబోలునని దానింగని, శరంబు శరాసనంబునందు సంధానంబుసేసి, యేసిన, నతండు హా హా రవంబునం గదల మొదలిడెను.———

"కంసాది కుమతుల కసిమసంగినవాఁడు" ఒక్కలుబ్ధకునిచే కాలగతి నొందవలసి వచ్చెను! ఔరా, కాలమహిమ! అవసరముతీరిన పిదప అవతారపురుషులగతి యిట్లేయుండును.

మానవశరీరము ధరించియుండుటనుగావలయు శ్రీకృష్ణభగవానుఁడుకూడ, బాణనిహతుండైనయపుడు బాష్పంబులు విడుచుటయు, ఆహారావంబులోనర్చుటయుజరిగెను. కాని దెబ్బతిని నప్పుడుకన్న నుసులులు వీడునప్పు డాతఁడెక్కుడు సహ[illegible] చూపెను. మహాపరాధుండగు నా లుబ్ధకుండు బాష్పజలధా[illegible]

సిక్తవదనుండై కృష్ణుకడ కేతెంచిన నాతఁడు వానింగని క్షమించి ప్రాణంబులు విసర్జించెను. ఇంకను ఈతనికి ఇహలోకతాపత్రయ మడంగలేదు.

స్త్రీబాలవృద్ధ జనంబుల గరిపురంబునకుం గొనిపొమ్మని దారుకునితోఁ జెప్పెనట! కాని యింతలో ద్వారకా నగరంబు పరిప్లుతజలమయంబై మునింగెను.

కం॥ "ఏ దినమున వైకుంఠుఁడు
మేదినిపైఁ బాత్ప్రనట్టి మేను విడిచి నా
డాదినమున నశుభప్రతి
పాదకమగు కలియుగంబు ప్రాప్తంబయ్యెన్॥"

శ్రీకృష్ణుండు తనకున్న శక్తిసామర్థ్యంబుల నెల్ల వినియోగించి కలియుగంబు రాకుండ కాపాడి యుంచెను. ఫణుల వర్తకవ్యాపారముల చేతను, (కాల) యవనుల దాడులవలనను, భరతవర్షమం దనేక నూతనాచార వ్యవహారములు చోరఁ జొచ్చెను. అందుచే ఆర్షమతమునకు విఘాతముకలుగనుండెను. కాని శ్రీకృష్ణునివంటి మహాపురుషుఁడు భూతభవిష్యద్వర్తమానముల బాగుఁగ గుర్తించి, వైదికాచారములఁ జాలవఱకు [illegible]లోచితముగ సంస్కరించి ప్రజలచే పాటింపఁజేసెను. ద్వాపరయుగాంతమునను, కలియుగారంభమునను, ఉన్న మహాత్ముఁడగుటచే, మత సాంఘిక ఆర్థిక రాజకీయ వ్యవస్థలయందు భావి కలియుగమున భారతవర్షమింకొక జాతికి దాస్యమొనర్చు నవసరము గలుగకుండ కట్టుబాటులొనర్చియే చనెను. కావున

శ్రీకృష్ణుఁడు నూతనయుగకర్త యని చెప్పనగును. ఈతఁడన్ని విధములఁ గలియుగమునకు కావలసినట్టి అవతారపురుషుఁడే. కలియుగ మీతని నిర్యాణానంతరము ప్రారంభమయ్యె ననుటలో నర్థమింతియే.

ముందుప్రకరణమున శ్రీకృష్ణుఁడు కలియుగమునకు కావలసిన సంస్కారముల నెటుల నడపించి, ఆయుగమువారి కవతార పురుషుఁ డెట్లయ్యెనో చూచెదముగాక.

———

ఉపసంహారము

శ్రీకృష్ణుఁడు

(i)

— యుగకర్త —

భారతవర్షమున పెక్కుమార్పులుగలుగు కాలమున శ్రీకృష్ణుఁడుండెను. ఈతఁడు నూతనయుగకర్త కావుననే యీతని నిర్యాణానంతరము కలియుగము ప్రారంభమైనట్లు మనవారు చెప్పుదురు. ఇంద్రియానందమే ప్రధానోద్దేశముగఁ గల అసురసిద్ధాంతములను శ్రీకృష్ణుఁడు నాశనమొనర్చెను. ఆర్యు లభివృద్ధిఁజెందుచుండు సమయమున నష్టదిక్కుల కధికారులుగ నియమింపఁబడిన నాయకులు (దిక్పాలకులు), వారి అనుచరులు (దేవతలు), కూడ నిర్వీర్యులై పేరునకుమాత్రి మక్కడక్కడ మిగిలియుండిరి. వారిలో నధికబలవంతులైన ఇంద్ర వరుణదేవపదవులం దుండువారు శ్రీకృష్ణునిచే నోడింపఁ బడిరి. అనగా నాటుమార్గముల కధిపతియైన ఇంద్రుఁడును, నీటిమార్గముల కధిపతియైన వరుణుఁడును యాదవవీరుఁడైన కృష్ణునకు దాసులైరి. దేవతలకసాధ్యులైన దనుజులను (నరక, నివాతకవచులను) నరులయం దుద్భవించిన కృష్ణార్జునులు సంహరించి, సురులకు నరులేవిధమునను అల్పులుకా రని స్థిర పఱచిరి. అర్జునుఁడు దేవేంద్రునితో సమానముగా నాతని అర్ధాసనముపైఁ గూరుచుండెను. ఆనాఁటితో సురనరభేదము లంతరించినవనుట కింతకన్న ప్రబలనిదర్శనము లేమికావలయు?

నరనాయకులలోఁకూడ శ్రీకృష్ణుఁడు పెక్కుమార్పులఁ గావించెను. సనాతన ఆర్యకుటుంబములవారు మిశ్రమజాతుల ననాదరణదృష్టితోఁ జూచుచుండుటచే నార్యావర్తమున నైక మత్య మంతరించి యుండెను. ఆర్యావర్తాంతరభూములయం దుండిన ద్రవిడజాతులు ఆర్యసంప్రదాయముల నవలంబించి నను, వారి నార్యనాయకులు తమలోఁ జేర్చుకొనుటకు సందేహించుచుండిరి. అందుచే ప్రాగ్దక్షిణభాగములయందుండిన అసురవీరులు ద్రవిడుల తమపక్షమునకుఁ ద్రిప్పుకొని వైదికమత వ్యాప్తికి విఘాతము గలిగించుటేగాక, ఆర్యావర్తమును కూడ నాక్రమింప మొదలిడిరి. కావున ననేక సనాతన ఆర్యరాజకుటుంబములవారు వృష్ణినాయకుఁడగు వసుదేవుని తో వైవాహిక సంబంధములఁ గల్పించుకొని, జరాసంధాది అసురపక్షపాతుల వాతఁ బడకుండ తమతమ రాజ్యములఁ గాపాడుకొనుచుండిరి. అవసరము ననుసరించి ఆర్యులు అభీరులను, యాదవజాతులనుకూడ తమలోఁ గలుపుకొనవలసి వచ్చెను. యాదవాభివృద్ధికి ఆర్యులతో మైత్రియే శ్రేయో దాయకమని శ్రీకృష్ణుఁడుకూడ తండ్రిమార్గము ననుసరించి యసురసంహారణమునకును, అసురసంప్రదాయ నిర్మూలనమున కును, బద్ధకంకణుఁ డయ్యెను. తండ్రివలె 'డొంకతిరుగుడు' మార్గముల నవలంబింపక ప్రత్యక్షవిరోధమూని శ్రీకృష్ణుఁడు కార్యముసాధింప ప్రారంభించెను.

పాశ్చాత్యదేశములతోఁడి వర్తకము తమసొత్తనిభావించు

చుండిన పణుల పనఁదూల్చి, శ్రీకృష్ణుఁ డావర్తక మాభీరుల కందఁజేసెను. వరుణదేవుఁ డోడిననాఁటినుండియు పణుల కార్యావర్తమున పలుకుబడితగ్గెను. ఈవణిగ్జాతులు పాశ్చాత్య ఖండముల యందే నిలచియుండి అచ్చో ప్రత్యేక సామ్రాజ్యములనేలకొల్పి అభివృద్ధిఁగాంచిరి.* భారతవర్షమం దుండిన వణిజులు దక్షిణాపథమున కేతెంచి, అచ్చోనుండిన సనాతన ఆదిమజాతులతో వైవాహిక సంబంధంబులు గల్పించుకొని యభివృద్ధిఁగాంచఁ దొడంగిరి. ఈ సంబంధములవలననే కరణులుద్భవించి, పన్నాటముగనుండిన దక్షిణాపథమును కాలక్రమమున కన్నాట మొనర్చిరి.

పణులను పారఁద్రోలి పశ్చిమోదధీతీరంబుల నాక్రమించిన అభీరులు క్రమముగ కుశద్వీపమంతయు స్వాధీనమొనర్చుకొనిరి. అందుచేతనే యాద్వీపమునకు అభీరక (Africa) మనుపేరు వచ్చినది. శ్రీకృష్ణుని నిర్యాణానంతర మార్యావర్తమున యాదవు లదృశ్యులైరి; కాని అభీరులుమాత్రము వివిధస్థలములనిలచి యభివృద్ధిఁగాంచినట్లు స్పష్టముగఁ గాన్పించును. గుప్తులస్థానమును (Egypt the land of Copts) కూడ గొల్లరాజు లేలినట్లు చరిత్ర చెప్పుచున్నది. ద్వారక అదృశ్యమైన తరువాత సారసేనము (Arabia) అభీరులకు ముఖ్యస్థానమయ్యెను. ప్రాచీన పాశ్చాత్య చరిత్రలయందు

* (Phoenicians, Cretans, Copts, Canaans and Carthaginians).

కాన్పించు హీబ్రూలు (Hebrews) మన శ్రీకృష్ణుని ఆదరణక్రింద నభివృద్ధిఁగాంచిన అభీరులే యనుటకు సందియము లేదు.

శ్రీకృష్ణుం డార్యులకుంగల యహంభావమడంచి వైదిక కర్మల నందఱిచేఁ జేయింపసాగెను దీర్ఘతమసుండను అంధక ఋషిని దమలో నుండనీయక గంగాజలంబులఁ బడఁద్రోసిన ఆర్యులు, ద్వాపరాంతమున శ్రీకృష్ణుని మహాత్మునిగ నంగీకరించిరి.

"మునులున్నృపులుఁ జూడ మును షర్మజుని సభా
మందిరమున యాగమండపమునఁ
జిత్రమహిమతోడఁ జెలువొంది, * * * "

శ్రీకృష్ణుఁడు అచ్చో నగ్రతాంబూలముఁ గైకొనెను. తాము తప్ప యితరు లాచరింపకూడదని ఆర్యులు వారించు వైదిక యజ్ఞములను, శ్రీకృష్ణుఁడు తనతండ్రియగు వసుదేవునిచేఁ జేయించెను.

తే॥ "మఱచి యజ్ఞాన కామ్యకర్మములఁ దిరుగు
వేదపాఠకులకుఁ దన్నివృత్తిఁజేయ
* * * *
* మదయించి తండ్రునిన్ గొందఱు * "

వైదికకర్మ లాచరింప నర్హులమని గర్వించుచుండిన బ్రాహ్మణులు తమ వనితలు శ్రీకృష్ణుని సందర్శించి,

భక్తిమార్గ మవలంబించి యానందపరవశు లగుటఁ గాంచి చిన్నఁబోయిరి. అందుచే వారు కర్మమార్గముకన్న భక్తి మార్గమే మనసున కెక్కుడు శాంతిఁజేకూర్చు నని తెలుసు కొనఁగలిగిరి. శ్రీకృష్ణుఁడర్థములేని యాగము లాచరించుట కన్న మానవసంఘమును సేవించుటచే మనసున కెక్కుడానం దమును శాంతియుఁజేకూరునని బోధించెను. నాఁటినుండియే భక్తిప్రధానమైన భాగవతమతమున కార్యావర్తమున నెక్కుడు ప్రాముఖ్యత వచ్చెను.

కర్మమార్గము వెనుకఁబడుటచే బ్రాహ్మణుల ప్రాముఖ్య తయు, అహంభావమును అంతరించెను; అన్నితరగతులవారికి నార్షమతముపై నభిమానము హెచ్చెను. అందుచే హిందూ సంఘమునకు నాఁటినుండియు నెక్కు డౌన్నత్యము గలిగెను.

———

శ్రీకృష్ణుఁడు

(ii)

— మహాత్ముఁడు —

ఉ॥ "ఉత్తమకీర్తులైన మను జోత్తము లాత్మ హితంబు లెన్నడుం
జిత్తములందుఁ గోరరు హసించియు లోకులకెల్ల నర్థ సం
పత్తియు భూతియుఙ్ సుఖము భద్రముఁ గోరుదురు *
* * * * ".

ఉద్దేశము లెట్టులున్నను ఫలములఁబట్టి వ్యక్తులు ప్రఖ్యాతిఁ గాంచుచుందురు. వృష్ణివంశీయుఁడైన కృష్ణుఁడు తన తండ్రివిరోధుల నిర్జింప మొదలుపెట్టి, మహాబలశాలియగు మాగధునితో కయ్యమునకుంగడంగి, ఆతనితోఁబోరలేక అభీరుల (నారాయణ గోపాలుర) తన చెంతఁజేర్చుకొని అఖిలయాదవలోకము నేకము నర్ప నెత్నించి, కయ్యము లధికమైనకొలంది నెయ్యములంబెంచి, భారతవర్షమందలి రాజకుటుంబములతో సంబంధములుకల్పించుకొననవసరపడి, తుదకు మహాభారత రాజకీయనాట్యరంగమునఁ గూడ ననవసరసంపర్కము కలిగించుకొని, అనుకొనని జగత్కల్యాణకర్త కావలసివచ్చెను.

కాని తనవిహితధర్మము లెటింగిన కొలందిని తదనుగుణమగు శక్తియుక్తులతో వాటిని సమర్థింప సాహసించిన వ్యక్తి మహాపురుషుఁ డనక తప్పదు. శ్రీకృష్ణుఁడు కేవల

స్వార్థపరుండుగాక యింకొకరిఁగూర్చి పాటుపడుటచే మహాత్ముఁడుకూడ నయ్యెను. బలదేవుఁడు తనకుఁగల ప్రఖ్యాతి నంతయు తన పశుబలముతోడనే యార్జించియుండెను. అందుచేతనే పశుబలప్రియుఁడగు దుర్యోధనుఁడు హాలరాముని ప్రియశిష్యుఁడని చెప్పఁబడుచున్నాఁడు. శ్రీకృష్ణుఁ డట్లుగాక బుద్ధిబలముచేత సాధారణముగ నన్నికార్యములను సాధింపఁ జూచుచుండెను. కావుననేకావలయు మనవారు శ్రీకృష్ణుఁడు మూర్తీభవించినబుద్ధి అనికూడ వాడుదురు. *

కేవలముబుద్ధిప్రభావముచేతనే వేలకొలఁది వత్సరముల పిమ్మటఁ దనజన్మభూమికిన్ని, అభిమానమతమగు నార్షమతము

* శ్రీజగన్నాథక్షేత్రమందు కలియుగనారాయణుఁడని పూజింపఁబడుచున్న బౌద్ధావతారవిగ్రహమును వీక్షింప నందుకరచరణాదులు కాన్పింపవు. విగ్రహమంతయు ముఖముతోడనే నిండియున్నది. బుద్ధికి స్థానమైన శిరస్సు ఆవిగ్రహమందు ముప్పాతిక మువ్వీసము లాక్రమించియుండును. పశుబలప్రయుక్తంబున కనువగు నవయవముల (కాలుచేతుల) కందు చోటులేదు. కలియుగంబున మనఁదలచుకొనిన ప్రజలకు పశుబలముకన్న బుద్ధిబలమే ఎక్కుడుండవలె నని ఆవిగ్రహము స్పష్టీకరించును. కలియుగప్రారంభమున నవతరించిన మహాపురుషుండగు శ్రీకృష్ణుని జీవితముకూడ దీనినే విశదీకరించుచున్నది. మహాపురుషులను మనవా రిటులనే అవతారము లొనర్చినట్టుల కాన్పించును.

నకును రాఁగల ముప్పుల నెఱింగి, కావలసిన కట్టుబాటు లొనర్చియె చనియెను. వివిధజాతులవా రేతెంచి ఆర్యావర్త పుణ్యభూమి నల్లకల్లోలమొనర్చి ఆర్షమతమునకు విఘాతము కలియుగంబున గలిగింప యత్నింతు రని శ్రీకృష్ణుఁ డెఱింగి యుండుటచేతనే సర్వమతములకును సమాధాన మియ్యఁగల గ్రంథమును కూడ నుడివి చనెను. మాటలతో మార్గము సూచించు మహాత్ముఁడే గాక, నడవడిచేత కూడ నందఱకు నాదర్శప్రాయుఁడై అస్తమించిన మహాపురుషుఁడు శ్రీకృష్ణుఁడు.

శ్రీకృష్ణుఁడు తనబుద్ధిచేతనే కదా పూతనాది రాకుసుల నంత మొందించెను. ఆసన్నమరణభీతిచే మతిచెడియున్న కంసుని కీలెఱిఁగి ఆతనిఁ గాలుపిఁటి కంపెను. అబలను ఆహావమునకు నెదురుగ నిలువఁబెట్టి, నరకుని మదికలఁగఁజేసి, ఆతనిఁ గడతేర్చెను. కాలయవనుని కాల్నడకను ఏకాకిగ మధుర నుండి ముచికుందుఁ డుండిన బిలముకడకు కొనివచ్చినదేది ? శ్రీకృష్ణుని బుద్ధిబలమేకదా! మార్గాయాసమున గ్రుగ్గియున్న యాతనిని, నిలుకడగ నింటకూర్చొనియున్న ముచికుందునిచే నంత మొందించెను. భీమునిచే జరాసంధుని గ్రుమ్మించుట యందు శ్రీకృష్ణునిచమత్కారమెంతయుఁగాన్పించును. కౌరవాధీశునికారాగారమున తా బంధీకృతుఁడుగాకుండ, తన వాక్పై పుణిఁజూపి, యటనుండి దాటుకొనివచ్చినవ్యక్తి బుద్ధివిభవమున కేమనవలెను ! యుద్ధదినములలో భీష్మునికడకు ధర్మజునంపి, ఆ వీరాధివీరుని మరణ మర్మమెఱుంగుటయు, అశ్వత్థామ హతుఁ

డయ్యెనని ధర్మజుచేఁబలికించి ద్రోణునిచే నస్త్రసన్యాసము చేయించుటయు, నిట్లనేకకృత్యంబుల శ్రీకృష్ణునిబుద్ధికాదే పాండవేయుల పురుషార్థంబులకు మూలంబయ్యెను. యాదవులు శాపోపహతులైనప్పుడు శ్రీకృష్ణుఁ డసమర్థతచే నూరకుండలేదు. వ్యసనాసక్తులై లోకకంటకులుగ నుండిన యాదవుల వినాశన మపేక్షించియే ఆతఁ డుపేక్షించి యుండెను.

"సీ. ఈరీతి శ్రీకృష్ణుఁ డేపారఁ బూతనా
శకట తృణావర్త సాల్వ వత్స
చాణూర ముష్టిక ధేను ప్రలంబక
దైత్యాఘ శిశుపాల దంతవక్త్ర
కంస పౌండ్రాదిక ఖండనం బొనరించి
యటమీఁదఁ గురుబలంబణఁచి మఱియు
ధర్మజు నభిషిక్తుఁ దనరఁగాఁ జేసిన
నతఁడు భూపాలనం బమరఁజేసె;

తే. భక్తులగు యాదవేంద్రులఁ బరగఁ జూచి
'యన్యపరిభవ మెఱుంగ రీ యదువు' లనుచు
వీరిఁబరిమార్ప నేఁ దక్క వేఱొకండు
దైవ మిఁక లేదు త్రిభువనాంతరమునందు."

అని నిశ్చయించుకొని కృష్ణుఁడు యాదవుల కన్యోన్య వైరానుబంధంబులం గల్పించి, వారల హతంబుగావించి భూభారంబడంపనెంచుటచే శాపదగ్ధులైనయాదవుల నుద్ధరింపక యూరకుండెను.

శ్రీకృష్ణుడు

(iii)

— సామ్రాజ్యస్థాపనాచార్యుడు —

నరులలో జన్మించిన నహుషుడు నూరు యజ్ఞములు చేసి దేవసముడై తుదకు దేవేంద్రపదవిఁగూడ కొంతకాల మనుభవించెను. ఆతని వంశమందు పుట్టిన యయాతిమహారాజు మహావైభవముతో భూమండలంబేలి ఆనాటి యసుర వీరులనుగూడ నడమియుంచెను. ఈతఁడు తన యఖండసామ్రాజ్యమున నలుదిక్కులఁ గన్నసుతులనే కావలి యుంచియుండెను. కాని కొన్ని కారణములచే పెద్దవాఁడగు యదువునకు సార్వభౌమత్వమీయక కనిష్ఠుండగు పురు వనువాని కయ్యెడయొసంగెను. యదు తన పుత్రమిత్రానుచర గణంబుతోఁ బాశ్చాత్య భాగంబులకు వలసపోయి అచ్చో తన స్వతంత్రతఁ గాపాడుకొని యుండెను. కొంతకాలమైన తరువాత నీతని వంశీయులైన హైహయులు భారతవర్షమున కేతెంచి ఆర్యావర్త పుణ్యభూమి కంటియున్న నర్మదానదీతీరంబున నొక్కపురంబు నిర్మించుకొని యందుండి యభివృద్ధిఁగాంచుచుండిరి. కార్తవీర్యుని బాహుబల సంపత్తులచే యదువంశీయులు దక్షిణాపథమును ఏకఛత్రాధిపత్యముగ నేలఁ దొడఁగిరి. సిరిసంపత్తు లధికమైన తరువాత పతిత క్షత్రియులే పావనులై తమయింటి పడుచుల వైదిక శిష్టాచార పారీణులగు బ్రాహ్మణోత్తములకుఁగూడ

నియ్య మొదలిడిరి. కొంత కాలమైనతరువాత నధికారమదాంధత హైహాయులచే ననేక దుష్టకార్యము లాచరింపఁజేసెను. తపో నిష్ఠాగరిష్ఠులగు బ్రాహ్మణోత్తములఁ దృణీకరించుటచే, వా రలిగి హైహాయరాజ్యమేగాక ఆర్యావర్తమందలి సనాతన రాజ్యములంగూడ నొకటి వేళ్ళతో విధ్వంస మొనర్చిరి.

కంll "భూపాలకులకు విప్రులఁ
గోపింపం జేయఁ దగదు కోపించినఁ ద
త్కోపానలంబు మొదలికి
భూపాలాటవులఁ గాల్చు భూకంపముగాన్" ll

కార్తవీర్యుని అనంతరము యదువంశీయులు కొంత కాల మార్యావర్తమున నామమాత్రావశిష్టులై యుండిరి. మాధవుఁడు ఉత్తరాపథమందును, ముచికుందాదులు దక్షిణా పథమునను, చిన్న చిన్న రాజ్యముల నెలకొల్పుకొని మనుచుం డిరి. వసుదేవుని నాఁటికి యాదవుల పలుకుబడి మరల నార్యా వర్తమున నధికము కాఁదొడంగెను. కాని కంసుని దుండగము లచే యాదవులయం దైకమత్య మంతరింప వారందఱు నానా దేశంబుల కేగిరి. ముచికుందునినిద్రాసక్తియు, కుండినగరంబు నందుండిన భీష్మకుని వైరాగ్యమును, కంసుని క్రౌర్యమును, యాదవులనెల్లెడల నిరుత్సాహులఁజేసెను. తనయాదవులదుస్థితిఁ గాంచి శ్రీకృష్ణుఁడు ముందంజవేసి కంసుంగడదేర్చి, ముచికుం దుని మేల్కొల్పి, భీష్మకుని పుత్రికను పరిణయమై యాదవుల యం దైకమత్యము నెలకొల్పెను.

కంసవధానంతరము శ్రీకృష్ణుఁడు జరాసంధునితో నిరంతరయుద్ధనిమగ్నుఁడయ్యెను. అరక్షితంబగు మధురానగరంబు యాదవుల సంరక్షణమున కనువుకాకుండెను. అందుచే శ్రీకృష్ణుఁడు యాదవరాజధాని నింకొక నూతన నగరంబునకు మార్పవలసివచ్చెను. ఈతనియనుచరులందు అభీరులెక్కుడుగ నుండుట చేతను, వారికి నీటిపై నెక్కుడు బలముండుటంబట్టి యు శ్రీకృష్ణుఁడు తన నూతన నగరము నీటఁగట్టెను. మహోదధీ తీరంబుల నదిమియుంచుటకు మహేంద్రంబు ప్రాచీభాగంబున నెట్టులుండెనో, పశ్చిమోదధీ తీరంబుల నెల్ల నేలుటకు రైవత కాద్రియు పశ్చిమ తీరంబున నట్టులుండెను. అందుచేత నే శ్రీకృష్ణుండు తత్పర్వతప్రాంతమందుండిన ద్వీపంబుపై ద్వారకా నగరంబునిర్మించి యాదవుల నిర్వక్రపరాక్రమోపేతులఁజేసెను. మున్ను కార్తవీర్యుఁడుండిన మాహిష్మతీ నగరంబుకూడ నా పరిసరంబులనే వర్ధిలి యుండెను.

ఆర్యులు నాటుదారులఁ (land routes) బట్టి నలుగడల వ్యాపింపఁ జూచునప్పుడు హస్తినా నగరము, మధుర, గిరివ్రజము వంటి భూమధ్యనగరములు రాజధానులుగ నుండుటకువీలయ్యెను. కాని పణులపర్యటనలచే నేఁడార్యులఅధికారము సముద్రాంతరభూములకుఁగూడ నీటిమార్గముఁబట్టి వ్యాపింపఁ జొచ్చెను - శ్రీకృష్ణుని నాఁటికి ఆర్యుల స్థానము భారవాహ జలసంధి (Bherring Straits) మొదలు బ్రిటాస్థానము (Britain) వఱకున్న స్థలజల భాగంబుల నావరించి యుండెను-

ఆ ప్రపంచమునకు ద్వారకయే అన్నిట ననువైన కేంద్ర స్థానము. ఇటనుండిన వీరు లానాఁటి ప్రపంచమందలి నాటు, నీటి మార్గములనెల్ల నేకరీతి స్వాధీనమందుంచుకొనఁ జాలియుందురని ఎఱింగియే శ్రీకృష్ణుండద్దానిని యాదవులకు రాజధానిగ నెన్ను కొనెను.

మనుజులకుఁ దెలిసిన ప్రపంచపరిమితి అధికమైనకొలఁది ప్రపంచముయొక్క కేంద్రస్థానముకూడ మారుచుండును. రాముని నాఁడు అయోధ్య కేంద్రముగనుండెను. శ్రీకృష్ణుని నాఁడు ద్వారక కేంద్రస్థానము కావలసివచ్చెను-కొంత కాలము తరువాత ఈగుప్త (Egypt) ఆనాఁటి ప్రపంచమునకు కేంద్ర స్థానమయ్యెను. కొలంబస్ (Colombus) పర్యటనంబుచే నేఁడు బ్రిటిష్ దీవులు ప్రపంచమునకు కేంద్రముగనున్నవి. అమెరికా ఖండ మభివృద్ధిఁ జెందుచున్నదిగావున కొలదికాలములో జపాన్ దీవులో హ్యాండురాస్ (Honduros) దీవులో కేంద్రస్థానము లగును.

నైల్ నదీ ముఖద్వారమందు అలగ్జాండర్ నిర్మించిన మహానగరము (Alexandria) ప్రాపంచకవర్తకమునకు కేంద్ర స్థానమై విఖ్యాతిఁ గాంచుటెల్ల ఆవీరాధివీరు బుద్ధివిభవమును వెల్లడించునట్లు, ద్వారకా నగర మభివృద్ధిఁగాంచి, ఆభీరు లన్నియెడల విజృంభించుట కనువొసంగుట యెల్ల శ్రీకృష్ణుని సామ్రాజ్య నిర్మాణకౌశలంబును వ్యక్తీకరించును. ఉత్తర దక్షి ణాపథంబులఁ జెదరియున్న యాదవుల నవసరపడినప్పుడెల్ల

ఆ నూతన నగరము నౌకాచోఁ జేర్చుటకు ద్వారక యెంతయో యనుకూలముగ నుండెను; అందుచే నాఁటినుండి యాదవు లపజయంబన్న నెట్టిదో యెఱుంగక నచ్చో మనఁ గలిగిరి. నీటఁగట్టఁబడిన ద్వారకానగరము, యాదవుల ఆదరమున నభివృద్ధిఁజెందిన అభీరుల కనిర్వచనీయమైన సౌకర్యములఁ జేకూర్చి, పశ్చిమోదధియంతయు వారి సొత్తొనర్చెను. కావున నే నాఁటినుండి నా సంద్రమును, ఆర్యు లాభీరసముద్ర మని పిలువఁ జొచ్చిరి.

పాశ్చాత్య దేశంబులఁకిక్కు మొగంబయి యుండిన ఆనూతన నగర మచ్చటిసంపత్తులనెల్ల నార్యావర్తమునకుఁ గొనివచ్చుటకుఁ దగిన ద్వారముగ నుండుటచేత నే కావలయు నద్దానికి ద్వారకా యనునామంబు సార్థకంబయ్యెను. నేఁటికిని పాశ్చాత్య దేశంబులతో ప్రధానముగ వర్తకమొనర్చుచున్న పట్టణములు (Karachi, Broach, Surat, Diu, Bombay) శ్రీకృష్ణుని ద్వారక పరిసరంబులనే యుండుటఁజూడ ఆ మహాపురుషుని ప్రజ్ఞాదికములపట్ల మనకింకను గౌరవ మధికము కాఁగలదు.

శ్రీకృష్ణుఁడెంత ప్రయత్నించినను యాదవులు తమ్మావరించియున్న దుర్గుణంబుల వీడకుండుటచే నాతనికి వారిపట్ల శంక లుత్పన్నమయ్యెను-శమంతకమణి కాన్పింపనప్పుడు, సుభద్ర నర్జునునకిచ్చు నవసరమున, శశిరేఖా వివాహ సందర్భముననను, మదిరాపానామత్తులై యాదవులు ప్రభాత తీర్థమందు స్త్రీలతో విచ్చలవిడి విహరించుపట్టునను, బలరాముఁడు రుక్మితోఁ జూద

మాడి స్వల్పకారణమునఁ గుపితుఁడై, ఒక్కవ్రేటున నాతనిఁ జంపు
తటిని, యాదవులపట్ల శ్రీకృష్ణుఁడు నిరుత్సాహుడయ్యెను.
కావుననే నాఁటినుండియు నాతఁడు పాండవుల నార్యావర్తసార్వ
భౌములుగఁజేయ నెక్కుడుగ యత్నింపవలసి వచ్చెను.
ఉగ్రసేను ననంతరము, యాదవసామ్రాజ్యమునకు, సర్వసద్గుణ
సంపన్నుఁడైనను ఆహవముల యందంతగ ననుభవములేని
యక్రూరుని బట్టభద్రునిగనొనర్చుటయందే శ్రీకృష్ణుఁడు యాద
వులసామ్రాజ్యాభివృద్ధి నంతతో నాపెనని నిశ్చయముగ నెఱుంగ
నగును.

పాండవులకు రావలసిన రాజ్యభాగ మిప్పించి వార
లన్నవస్త్రములకు దూరులు కాకుండ మున్ను చూచుచుండిన
శ్రీకృష్ణుఁడు, అటుతరువాత పాండవదూతగను, పార్థసారథిగను
కూడ నుండుట కంగీకరించుటయెల్ల, తనకు నచ్చినవారు
సార్వభౌమ పీఠంబున నుండుట కిచ్చగించియేకదా. యాదవుల
దుష్కృత్యంబులచే, శ్రీకృష్ణుని యాదవసామ్రాజ్యప్రతిష్ఠాప
నము పొసఁగకున్నను ఆతఁడు పాండవులఁబట్టి, వారలనుద్ధరించి
అఖిలభారత సామ్రాజ్యస్థాపన కార్యము నెఱవేర్చుకొనెను.

వరుణదేవుఁ డేలుచుండిన సామ్రాజ్యము(Sea Empire)
నకు అక్రూరుని బట్టముగట్టి, పాకశాసనుని పాలనంబందుండిన
స్వారాజ్యమును (Land Power) పాండవేయులకందఁజేసెను.
జగత్కల్యాణమునకు కావలసినది పాలకుని సద్వర్తనమేగాని
పుట్టు పూర్వోత్తరంబులు గావని శ్రీకృష్ణుఁడు స్పష్టీకరించెను.

ఆధునికకవి యొకఁడా మహాత్ముఁ డొనర్చిన సంస్కారణముల నిట్లభివర్ణించి యున్నాఁడు.

సీ॥ మాలఁబట్టించెగా ప్రాజలు మాన్పించి
నిరుపయోగులటంచు నిర్ఘృణులను;
మించి బోధించెగా మేదినీసురలను
గోసంతతుల భక్తిఁ గొల్వఁ జెనుచు;
మాన్పించె నాఁడుగా మహిమ తేదని చెప్పి
రహిఁ క్షుద్ర దేవతారాధనముల;
సమయఁ జేసెనుగదా జన్మతోఁ దనె రాజు
ననియెడు నాచారమును గడంగి;
పుట్టువనుగల్గు సత్వమ్ము గట్టి పసుకె,
బుద్ధి యింతయేనియున్ బొనరకున్న;
ననుచు నూహించి దేవకీతనయుఁ డవని
పాండుతనయుల కొసఁగూర్చెఁ బ్రాభవమున ॥

———

శ్రీకృష్ణుఁడు.

(iv)

మతస్థాపకుఁడు.

తమచుట్టునుండిన ప్రజలదుస్థితిని జూచి సహింపలేక యుదారస్వభావులగు మహాపురుషులు వారి నుద్ధరించుటకు ప్రయత్నింతురు. పరులబాధలు తమవిగభావించి సంఘసంస్కరణకుఁ బూనుకొందురు. ఈసంఘసంస్కర్తలే కాలక్రమమున తమజాతికి నాయకు లగుదురు (Tribal heroes). వీరు తమ జాత్యభివృద్ధికి అవలంబించిన మార్గముల నితరజాతి ప్రజలు కూడ నామోదించినంతనే వీరు మానవసంఘముచే మహాత్ములుగను, అవతారపురుషులుగను ఎన్నబడుదురు. జూదుల (యూదుల-Jews) దుస్థితిచూచి సహింపలేక వారల నుద్ధరింప నెత్నించి ఏసుక్రీస్తు మహాత్ముఁడయ్యెను. రోమకుల పాలనమున సకలసద్గుణములఁ గోల్పోయి పశుప్రాయులుగఁ బ్రవర్తించుచున్న యూదులకు స్వర్గరాజ్యరాజమార్గముఁ జూపిన మహాపురుషుఁడే, నేఁడు మానవకోటిచే నీశ్వరపుత్రుఁడుగనారాధింపబడుచున్నాఁడు. మహమ్మదు పుట్టిననాఁడు అరేబియా స్థితికూడ మిగుల నిర్భాగ్యదశయం దుండెను. ప్రజలలో నైకమత్యము లేకుండెను. శాఖ కొక దేవుఁడు, గ్రామమునకొక దేవత, వీథికొక దేవాలయము, ఇంటి కొక ఈశ్వరుఁ డగుటచే నెవరికివారే తాఁబట్టిన కుందేటికి మూడేకాళ్ళనుచుండిరి.

అంతఃకలహములచే నరబ్బులు నిరంతరదారిద్ర్యమును, దాస్య మును అనుభవించుచుండిరి. మహమ్మదు తనవారినుద్ధరింపనెంచి యెంతయోకాల మాలోచించి యాకారశూన్యమైన ఏకేశ్వ రోపాసనము బోధింపఁ జొచ్చెను. ఆకాలమున నరేబియాదేశ మందున్న వివిధమతములను, వివిధదేవతలను ఖండించి అందఱి కనువగు నొకమతమును నెలకొలిపెను. అన్ని దేవళములను విధ్వంసమొనర్చి మక్కాపట్టణమం దాదినుండియు ననేకులచే నారాధింపబడుచుండిన 'కాబా' యను ఈశ్వరదేవళము నొక్కదానినే మిగిల్చెను. చాలాకాల మాతఁడు తనజాతి వారుపెట్టిన బాధల ననుభవించెను. కాని తుదకు జయముఁ గాంచెను. ఆయరబ్బులనాయకుఁడు నేఁడు లోకులచే నిజమైన దేవదూత (The only true Prophet) అని కొనియాడఁ బడుచున్నాఁడు.

శ్రీకృష్ణుఁ డవతరించుటకుఁబూర్వము హిందూసంఘము కూడ మిక్కిలి దుస్థితియం దుండెను.

కం॥ "జననము నైశ్వర్యంబును,
ధనమును విద్యయును గల మదచ్ఛన్నుల కిం
చనగోచరుఁడగు నిన్నున్
వినుతింపఁగ లేరు నిఖిల విభుధస్తుత్యా". (భాగ. ప్రథ 190)

కంసునివంటి బాలఘాతుకులును, నరకునివంటి నారీజన మానాపహారులును, జరాసంధునివంటి వైరవార్ఛకులును

ఇంద్రియానందమే జన్మకుపరమావధి యనిభావించి, మానవ సంఘమునకు మహాపదలఁ జేకూర్చుచున్న ఆసురవృత్తులు భారతవర్షమం దంతటను చెలరేగియుండెను. జైమినిచేబోధింపఁ బడిన కర్మప్రధానమగు పూర్వమీమాంసమతము మూలఁబట్టి యుండెను. అట్టిసమయమున శ్రీకృష్ణుఁడు 'జ్ఞానప్రధానమైన భక్తిమార్గమవలంబించిన ముక్తిఁబడయుదు' రని బోధించెను. నాఁటినుండియు నార్యావర్త మనన్యసామాన్యమైన దివ్యకళలతో వెలుగొండ, అఖిలదేశంబులకు నాదర్శప్రాయమయ్యెను. ఆనాఁడు సర్వభద్రసంయోజకుఁడైన శ్రీకృష్ణుఁ డొనర్చిన సంస్కరణములే, ఈనాఁటికిని ఆర్షమతమును, హిందూసంఘమునుకూడ నశింపకుండ కాపాడుచున్నవి. అందుచేతనే మన వారు కొందఱతని 'శ్రీకృష్ణభగవానుఁ', డనుచున్నారు.

శ్రీకృష్ణుని ధైర్యసాహసములు, సమయస్ఫూర్తి, విశాలవీక్షణము, కార్యదీక్ష, దేశభక్తి, సర్వసమత్వము చక్కఁగ గుర్తెఱింగిన, నీతఁడు మహాపురుషుఁడేగాక మహాత్ముఁ డనికూడ స్పష్టపడును.

శ్రీకృష్ణుని ఆదర్శజీవనమును మహర్షి పోతన:

శా॥ "శ్రీకృష్ణా యదుభూషణా నరసఖా శృంగారరత్నాకరా
లోకద్రోహినరేంద్రవంశదహనా లోకేశ్వరా దేవతా
నీక బ్రాహ్మణ గోగణార్తిహరణా నిర్వాణసంధాయకా
* * * * *"

అని చక్కఁగ కుంతిచే ననిపించెను.

శ్రీకృష్ణుఁడట్టి కార్యము సేయఁ బూనినను పరమోత్సా-
హంబుతో నద్దాని నాచరించుచుండుటచే [illegible]
వెన్నఁడెఱుంగఁడయ్యె. భీష్మునంతటివాఁడు:

మ॥ "తనకున్ భృత్యుఁడు వీనిఁగాచుట మహాధర్మంబు వో మ్మంచు న
ర్జున సారథ్యము పూని పగ్గములు చేఁ జోద్యంబుగాఁ బట్టుచున్
మునికోలన్ నశిఁ బూన్చి ఘోటకములన్ మోదించి తాడించుచున్
జనులన్ మోహమునొందఁజేయు పరమోత్సాహుం బ్రశంసించెదన్"

అని శ్రీకృష్ణుని స్తుతించుచు, నీతని యుత్సాహమునే యెక్కుడుగఁ గొనియాడెను.

కావున నర్జునుఁడు తలంచినట్లు మనముకూడ శ్రీకృష్ణుని:—

"మనసారథి మనసచివుఁడు
మనవియ్యము మనసఖుండు మనబాంధవుఁడున్
మనవిభుఁడు గురుఁడు దేవర
* * * * * "

అని భావించి, యాతనిచర్యలఁ జర్చించి ధ్యానించినచో నా పురుషోత్తముని ఉత్తమగుణములు కొంతవఱకు మనలకలవడ, నన్నిటను మనముకూడ విజ[illegible]